www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 24-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 288 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: చవితి మ.1:11 తదుపరి పంచమి, నక్షత్రం: శ్రవణం ఉ.7:08 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: ఉ.11:19-1:00, దుర్ముహూర్తం: ఉ.11:52-12:36, అమృతఘడియలు: రా.9:23-11:04, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:45, సూర్యాస్తమయం: 5:43 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఒక్కరే రూ.3.6 లక్షలు కొనేశారు!

క్విక్ ఈ-కామర్స్‌లో దుమ్ము దులుపుతున్న బెజవాడ ప్రజలు

మహానగరాలకు దీటుగా భారీగా పెరిగిన ఆర్డర్లు 2

స్విగ్గీ-ఇన్‌స్టామార్ట్‌లో ఒక్క ఏడాదిలో బెజవాడ వాసి సంచలనం

రూ.3 లక్షలపైన మరో ముగ్గురు.. వార్షిక నివేదికలో వెల్లడి

స్నాక్స్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ వరకు క్విక్ డెలివరీ యాప్‌లను తెగ వాడేస్తున్నారు

ఆకు కూరల్లో చుక్క కూరపైనే మక్కువ

బ్యాగ్‌లు, వాలెట్లలో 538 శాతం, ఫిట్‌నెస్ ఉపకరణాల్లో 495 శాతం భారీ పెరుగుదల





హీరోయిన్లు డ్రెస్సింగ్ సెన్స్ పాటించాలి

ఓ సినిమా ప్రీ రిలీజ్‌లో నటుడు శివాజీ వ్యాఖ్యలు

పలువురు సినీ ప్రముఖుల అభ్యంతరం

వాయిస్ ఆఫ్ విమెన్ పేరిట 'మా'లో ఫిర్యాదు

శివాజీపై సీరియస్ అయిన మహిళా కమిషన్

27 ఉదయం విచారణకు రావాలని ఆదేశం 6

క్షమాపణలు చెబుతూ 'ఎక్స్'లో శివాజీ పోస్టు



2

ప్రియాంకను ప్రధానిగా ప్రజలు చూడాలనుకుంటున్నారు

ఆమెలో ఇందిరను చూస్తున్నారు.. ఇప్పటికే తన నాయకత్వ పటిమ తెలిసింది

రాజకీయాల్లోకి రావాలని నాపైనా ఒత్తిడి: ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా



రెండో ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న ఎల్వీఎం3-ఎం6 రాకెట్

రికార్డుపై బాహుబలి గురి!

బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

నేడే ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ ప్రయోగం 2

అమెరికాలోని ఏఎస్‌టీ స్పేస్ సంస్థకు చెందిన 6,400 కిలోల భారీ ఉపగ్రహంతో నింగిలోకి

షార్‌లో మొదలైన 24 గంటల కౌంట్‌డౌన్

ఇంతటి బరువైన ప్రయోగం ఇస్రోకిదే తొలిసారి

విజయవంతమైతే సరికొత్త రికార్డు సొంతం

క్వాంటమ్‌తో భవిత బంగారం

క్వాంటమ్‌లో నోబెల్ సాధిస్తే **100 కోట్ల నజరానా**

కొత్త ఆవిష్కరణను అందించే పూచీ నాది: చంద్రబాబు

అందిపుచ్చుకునే బాధ్యత విద్యార్థులు, యువతది

ఏడేళ్లు కష్టపడితే భవిష్యత్తుకు తిరుగుండదు

లక్ష మంది క్వాంటమ్ నిపుణుల తయారీనే అమరావతి క్వాంటమ్ వ్యాలీ లక్ష్యం

ఇరవై ఏళ్ల భవిష్యత్‌కు ఇప్పటి నుంచే కార్యాచరణ

నాడు సిలికాన్ వ్యాలీ.. నేడు క్వాంటమ్ వ్యాలీ

రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను తయారుచేస్తాం

'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో సీఎం

50 వేల మందికి పైగా టెక్ విద్యార్థుల హాజరు



'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ కేంద్రాన్ని స్థాపించడంతో పాటు వచ్చే రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్ తయారు చేసే స్థాయికి ఎదుగుతాం. ప్రపంచానికి మనం క్వాంటమ్ కంప్యూటర్లను సరఫరా చేయగలం. లక్ష మంది క్వాంటమ్ కంప్యూటింగ్ నిపుణులను తయారు చేయడమే అమరావతి క్వాంటమ్ వ్యాలీ లక్ష్యం

అమరావతి నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీగా ఉంటుంది. తిరుపతి స్పేస్ సిటీగా ఉంటుంది. అనంతపురం, కడప వంటి ప్రాంతాలు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ క్లస్టర్‌గా మారబోతున్నాయి. విశాఖ-చెన్నై, బెంగళూరు-హైదరాబాద్, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు రానున్నాయి.

- సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ టెక్నాలజీని రాష్ట్రానికి పరిచయం చేస్తానని, దానిని అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తును సృష్టించుకోవాలని విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ.. ఇప్పుడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక సాంకేతిక నైపుణ్య దిశానిర్దేశాలని చెప్పారు. విద్యార్థులు ఏడేళ్ల పాటు క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నిష్ణాతులైతే.. భవిష్యత్తు అంతా బంగారమేనని, కోరుకున్నవి అన్నీ దక్కుతాయని కర్తవ్యబోధ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆధారంగా

మిగతా 12వ పేజీలో...



కొండపై కల్తీకి కట్టడి

ఫలిస్తున్న టీటీడీ కఠిన చర్యలు

సరఫరాలైనా, భక్తులు ఇచ్చినవైనా.. శాంపిల్ ల్యాబ్‌కు పంపి నిర్ధారణ

తేడా అనిపిస్తే నిర్దాక్షిణ్యంగా తిరస్కృతి

దీంతో మెరుగుపడిన నెయ్యి నాణ్యత

పాతిక లారీల జీడిపప్పు వెనక్కి..

ప్రసాదాలపై ఆగిన ఫిర్యాదులు

సర్కార్ 'ప్రక్షాళన'పై భక్తుల్లో సంతృప్తి

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

కల్తీ నెయ్యి, నాణ్యత లేని దినుసులతో శ్రీవారి ప్రసాదాలను తయారుచేసి జగన్ పాలనలో తిరుమల పవిత్రతను మంటగలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భ్రష్టు పట్టిన వ్యవస్థల ప్రక్షాళనను తిరుమల నుంచే ప్రారంభిస్తున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ప్రభావం కొండపై కనిపించడం మొదలైంది. నైవేద్యాలు, ప్రసాదాల తయారీకి వినియోగించే సరుకుల నాణ్యతపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కఠిన వైఖరి అవలంబిస్తోంది. కొంచెం తేడా అనిపించినా సరుకులను నిర్ద్వందంగా తిరస్కరిస్తోంది. ఫలితంగా

మిగతా 14వ పేజీలో...

కొత్త జంటలకు శ్రీవారి అక్షింతలు 12

కంకణం, కుంకుమ, వేదాశీర్వచన పత్రిక కూడా.. పోస్టులో పంపుతున్న టీటీడీ



14

అదనపు సొలిసిటర్ జనరల్‌గా

కనకమేడల

దవీందర్, అనిల్‌లకూ ఏఎస్‌జీలుగా చాన్స్

మూడేళ్లపాటు పదవిలో.. కేంద్రం ప్రకటన

సివిల్ కోర్టు న్యాయవాది నుంచి సుప్రీంలో ఏఎస్‌జీ స్థాయికి టీడీపీ నేత రవీంద్రకుమార్

నల్సార్‌లో విద్యామండలి సభ్యుడిగా, 'లా-జస్టిస్' పార్లమెంటరీ సభ్యుడిగా కూడా

పాస్టర్ల గౌరవ వేతనాలకు 50 కోట్లు విడుదల 12

సీఎం మాటిచ్చిన 24 గంటల్లోపే జీవో

8,427 మందికి లబ్ధి: మంత్రి ఫరూక్



9

ఆయుర్వేదంలో ఆపరేషన్లకు

అనుమతి

పీజీ పూర్తి చేసిన వైద్యులకు అవకాశం



శ్రీసత్యసాయి జిల్లాలో గర్భిణిపై దాడి చేసిన వైసీపీ కార్యకర్త అజయ్ దేవ్‌ను కదిరిలో నడిపించి స్టేషన్‌కు తీసుకువెళుతున్న పోలీసులు

రోడ్డుపై నడిపిస్తూ స్టేషన్‌కు..

గర్భిణిపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తకు పోలీస్ ట్రీట్‌మెంట్

శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో నడి రోడ్డుపై ఊరేగింపు

రక్తాభిషేకం, రప్పా రప్పా.. బ్యాచ్ అందరిపై చర్యలు

సాధారణ ప్రజలపై దాడులు చేసిన వారిపైనా కేసులు

తూర్పు గోదావరి జిల్లాలో ఫ్లెక్సీ షాపు సీజ్.. యజమాని అరెస్టు

కదిరి, విడపనకల్లు, నల్లజర్ల, కలిదిండి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల పేరిట అరాచకానికి పాల్పడ్డ వైసీపీ శ్రేణులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ముత్యాలవారిపల్లి గ్రామంలో గర్భిణిపై దాడి చేసిన వైసీపీ కార్యకర్త అజయ్ దేవ్‌ను పోలీసులు అరెస్టు చేసి కదిరి పట్టణంలో రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి.. రిమాండ్‌కు తరలించారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ముత్యాలవారిపల్లి గ్రామంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు

మిగతా 13వ పేజీలో...

దివ్యాంగులకు ఉచిత మోటార్ ట్రై సైకిళ్లు 13

సర్కారు మరో వరం.. మంత్రి డోలా వెల్లడి

13



రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే

చివరి వారం నుంచి ప్రారంభం

విధివిధానాలతో ఉత్తర్వుల జారీ

నీట్, జేఈఈ పరీక్షల్లో ముఖ గుర్తింపు వ్యవస్థ

వచ్చే ఏడాది నుంచి ప్రవేశపెట్టే యోచనలో ఎన్‌టీఏ 2

ఒక్క కాలేజీకే 'పీపీపీ' బిడ్!

ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణానికి బిడ్ దాఖలు చేసిన 'కిమ్స్' సంస్థ

మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కాలేజీలకు ఒక్కరూ ముందుకు రాని వైనం

ముగిసిన టెండర్ల గడువు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించేందుకు పిలిచిన టెండర్లలో ఒకే ఒక సంస్థ బిడ్ దాఖలు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోనిలో మెడికల్ కాలేజీని నిర్మించేందుకు హైదరాబాద్‌కు చెందిన 'కిమ్స్' సంస్థ ముందుకు వచ్చింది. మిగిలిన మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కళాశాలలను చేపట్టేందుకు ఎవరూ ముందుకురాలేదు. మొత్తం 4 కాలేజీలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్) టెండర్లను ఆహ్వానించింది. దీనికి సంబంధించిన గడువు సోమవారం ముగిసింది. అయితే.. ఈ నాలుగు కళాశాలల్లో ఒక్క ఆదోని కాలేజీకి మాత్రమే 'కిమ్స్' సంస్థ బిడ్ దాఖలు చేసింది. దీనికి కారణాలపై చర్చిస్తామని

మిగతా 2వ పేజీలో...



నదుల 'అనుసంధానం'పై త్వరలో

సీఎంలతో భేటీ

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటన

గంగా-కావేరీపై కుదరని ఏకాభిప్రాయం 13

ఇచ్చంపల్లి నుంచి తరలింపునకు ఒప్పుకోం: ఏపీ

ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనకు ఓకే: తెలంగాణ

మాకు 25 టీఎంసీలంటే ఎలా?: కర్ణాటక

సమావేశంలో ఏకాభిప్రాయానికి రాని రాష్ట్రాలు

ఇళ్లల్లోనూ నోట్ల కట్టలు!

సబ్‌రిజిస్ట్రార్లు, సిబ్బంది నివాసాల్లో ఏసీబీ సోదాలు

కార్యాలయాల్లో కీలకమైన వ్యక్తుల ఇళ్లపైనా దాడులు

ఏకకాలంలో నాలుగు జిల్లాల్లో అధికారుల తనిఖీలు

భారీగా నగదు, బంగారం, కీలక పత్రాలు స్వాధీనం

అక్రమార్కులపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు? 13



విజయనగరం జిల్లా భోగాపురంలోని ఆలేటి కనకరాజు నివాసంలో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు, వెండి సామగ్రి

హెచ్-1బీ లాటరీకి స్వస్తి!

ఎక్కువ జీతం, నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇచ్చేలా కొత్త విధానం.. ఫిబ్రవరి 27 నుంచి..

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ వెల్లడి

నెలాఖర్లోపు వెళ్లిపోతే 3000 డాలర్లు ఇస్తాం

అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్ 12



2

ఉన్నావ్ రేప్ కేసు నిందితుడి

జైలు శిక్ష సస్పెన్షన్

కుల్‌దీప్ సింగ్ సెంగార్‌కు బెయిల్ మంజూరు

నాపై అత్యాచారం చేశారు.. నా తండ్రిని హత్య చేశారు.. ఇదేం న్యాయం: బాధితురాలి ఆవేదన



13

ఫిట్‌నెస్ ఫీజుల పెంపునకు బ్రేక్

లారీ యజమానులకు ఊరట

కేంద్రం స్పష్టత ఇచ్చాకే నిర్ణయం



12

రూ. 20కే కిలో

గోధుమపిండి

జనవరి 1 నుంచి రేషన్‌షాపుల్లో పంపిణీ

తొలుత జిల్లా కేంద్రాలు, ముఖ్యపట్టణాల్లోనే

తర్వాత డిమాండ్‌ను బట్టి రాష్ట్రవ్యాప్తంగా

కాంగ్రెస్ ఖాతాలో రూ.53 కోట్లు బీజేపీ ఖాతాలో రూ.6,900 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 23: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బ్యాంకు ఖాతాలో రూ.6,900 కోట్లకు పైగా నిధులున్నాయి. దాని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఖాతాలో మాత్రం రూ.53 కోట్ల నిల్వలే ఉన్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి వివిధ రాజకీయ పార్టీలు తమ బ్యాంకు ఖాతాల్లో నిధుల వివరాలు వెల్లడించాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతోపాటు కేంద్రం, రాష్ట్రాలు, జిల్లా కమిటీలు గల బీఎస్పీ బ్యాంకు ఖాతాలో రూ.580 కోట్లపై చిలుకు డిపాజిట్లు ఉండటం ఆసక్తికర పరిణామం. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రూ.9.9 కోట్లు, సీపీఐ (ఎం) రూ.4 కోట్లు, సీపీఐ రూ.41 లక్షల నిల్వలు కలిగి ఉన్నాయి. గత అక్టోబరులో ఈసీకి సమర్పించిన ఫైలింగ్‌లో 2024-25లో రూ.517 కోట్ల నిధులు సమకూరాయని కాంగ్రెస్ తెలిపింది. వాటిలో రూ.20 వేల కంటే ఎక్కువగా వచ్చిన విరాళాల వివరాలను వెల్లడించింది. పలు పార్టీలు వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు, ట్రస్టులతోపాటు వివిధ మార్గాల్లో విరాళాలు సేకరిస్తాయి.

నా భార్యను తూలనాడేవారు పేడ తిన్నట్టే!

అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ధ్వజం

» జాతి వివక్ష ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్య



వాషింగ్టన్, డిసెంబరు 23: తన భార్య ఉషను తూలనాడేవారు పేడ తిన్నట్టేనంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారసత్వ అమెరికన్‌వాదులు జాతి మూలాలపై అతిగా దృష్టి పెడుతున్నారని మండిపడ్డారు. ఉషను లక్ష్యంగా చేసుకొని అతివాద వ్యాఖ్యాత నిక్ ఫ్యూన్టెస్, మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రెస్ సెక్రటరీ జెన్ సాకీ భారత వ్యతిరేక, యూదు వ్యతిరేక వ్యాఖ్యలు చేయడంతో జేడీ వాన్స్ ఈ విధంగా ప్రతిస్పందించారు. ఒక బ్రిటిష్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ మాట్లాడుతూ 'నా భార్యను విమర్శించేవారు ఎవరైనా సరే.. వారి పేర్లు సాకీ, నిక్ అయినాసరే.. వారు పేడ తిన్నట్టే. అమెరికా ఉపాధ్యక్షుడిగా నా అధికారిక విధానం ఇదే' అన్నారు. ప్రత్యేకించి సంప్రదాయవాద ఉద్యమంలో యూదు వ్యతిరేకత, జాతి వివక్ష అన్ని రూపాల్లోనూ ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పారు. నల్లగా ఉన్నారని, లేదా తెల్లగా ఉన్నారని, లేదా వారు యూదులనే కారణంతో విమర్శించడం రోతగా ఉంటుందన్నారు. కాగా, భారత్ నుంచి వలసవచ్చిన దంపతులకు ఉషా వ్యాన్స్ జన్మించారు. దీంతో ఉషా లక్ష్యంగా నిక్ తరచుగా జాతి వివక్ష వ్యాఖ్యలు చేస్తున్నారు.

మద్యం కుంభకోణంలో బఘేల్ కుమారుడి వాటా రూ.250 కోట్లు

» చార్జిషీట్‌లో ఏసీబీ ఆరోపణ

రాయ్‌పూర్/లఖ్‌నవూ, డిసెంబరు 23: ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్ వాటా రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు ఉందని రాష్ట్ర పోలీసులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసు విభాగం పరిధిలోని అవినీతి నిరోధక బ్యూరో/ ఆర్థిక నేరాల విభాగం (ఏసీబీ/ఈఓడబ్ల్యూ) ప్రత్యేక కోర్టులో సోమవారం 3,800 పేజీల ఏడో అదనపు ఛార్జిషీటు దాఖలు చేసింది. గత కాంగ్రెస్ హయాంలో ఎక్సయిజ్ శాఖ అధికారులు, వ్యాపారులు కలిసి సిండికేట్‌గా ఏర్పడ్డారని, దానికి చైతన్య సమన్వయకర్తగా వ్యవహరించారని తెలిపింది. ఆయన ద్వారా రూ.1,000 కోట్లు వరకు చేతులు మారాయని, ఇందులో పావొంతు వరకు ఆయనకు దక్కిందని పేర్కొంది. మొత్తంగా రూ.3,074 కోట్ల మేర కుంభకోణం జరిగినట్టు ఆరోపించింది. ఇంతవరకు జరిగిన దర్యాప్తు తీరును కూడా ఛార్జిషీటులో పొందుపరిచింది. నగదు అక్రమ చలామణి కోణంలో దర్యాప్తు జరుపుతున్న ఈడీ చైతన్యను జూలై 18న భిలాయ్‌లో అరెస్టు చేసింది.

లోకం తీరు



అక్రమ వలసదారులకు అమెరికా భారీ ఆఫర్

» నెలాఖర్లోపు వెళ్లిపోతే 3000 డాలర్ల స్టైపెండ్

వాషింగ్టన్, డిసెంబరు 23: అక్రమ వలసదారులను తగ్గించుకోవాలని భావిస్తున్న అమెరికా.. వారికి తాజాగా భారీ ఆఫర్ ప్రకటించింది. ఈ ఏడాది ముగిసేలోపు స్వచ్ఛందంగా అమెరికాను వీడి వెళ్లిపోవాలని భావించే వారికి ఇచ్చే స్టైపెండ్‌ను మూడు రెట్లు పెంచింది. ఇప్పటి వరకూ ఇస్తున్న 1000 డాలర్ల బదులు 3000 డాలర్లు (రూ.2.69 లక్షలు) ఇస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ తెలిపింది. దీనికి తోడు, వారి దేశానికి ఉచితంగానే విమానంలో పంపిస్తామని స్పష్టం చేసింది. అక్రమ వలసదారులపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

మూడు రాష్ట్రాల్లో 95 లక్షల ఓట్లు గల్లంతు

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళతో పాటు అండమాన్ నికోబార్ దీవులకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది. వీటిలో ఏకంగా 95 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను తొలగించారు. మధ్యప్రదేశ్‌లోని 5.74 కోట్ల మంది ఓటర్లలో అత్యధికంగా 42.74 లక్షల మంది పేర్లు గల్లంతయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2.12 కోట్ల మంది ఓటర్లలో 27.34 లక్షల మంది, కేరళలో 2.78 కోట్ల మంది ఓటర్లలో 24.08 లక్షల మంది పేర్లను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. కేంద్రపాలిత ప్రాంతం అండమాన్ నికోబార్ దీవుల్లో మొత్తం 3.10 లక్షల మంది ఓటర్లలో 64 వేల మంది పేర్లు జాబితాలో లేవు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ తర్వాత వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న తుది ఓటర్ల జాబితాలను అధికారికంగా విడుదల చేస్తారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 1.79 లక్షల మంది ఓట్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ఈ సంఖ్య మొత్తం ఓటర్లలో దాదాపు ఒక శాతానికి సమానం కావడం గమనార్హం.

ప్రభుత్వ గోదాముల్లో 5.75 కోట్ల టన్నుల బియ్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 23: దేశంలోని ప్రభుత్వ గోదాముల్లో బియ్యం నిల్వలు రికార్డు స్థాయికి చేరాయి. గత ఏడాదితో పోలిస్తే డిసెంబరు ప్రారంభం నాటికి దాదాపు 12% అధికంగా ఉన్నాయి. డిసెంబరు 1 నాటికి మిల్లింగ్ చేయని వరి పంటతో సహా బియ్యం నిల్వలు మొత్తంగా రికార్డు స్థాయిలో 5.757 కోట్ల టన్నులకు చేరుకున్నాయి. ఇది జనవరి 1 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 0.761 కోట్ల టన్నుల లక్ష్యాన్ని గణనీయంగా అధిగమించింది. ఇక గోధుమల నిల్వలు డిసెంబరు 1 నాటికి 2.914 కోట్ల టన్నులు ఉండగా.. ఇది గతేడాది నిల్వలు (2.06 కోట్ల టన్నులు) కంటే అధికమని గణాంకాలు పేర్కొన్నాయి.

నీట్, జేఈఈ పరీక్షల్లో ముఖ గుర్తింపు వ్యవస్థ!

» వచ్చే ఏడాది నుంచి ప్రవేశపెట్టే యోచనలో ఎన్‌టీఏ

న్యూఢిల్లీ, డిసెంబరు 23: నీట్, జేఈఈ సహా ప్రధాన ప్రవేశ పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా అభ్యర్థుల వెరిఫికేషన్ కోసం ముఖ గుర్తింపు వ్యవస్థను వచ్చే ఏడాది నుంచి ప్రవేశపెట్టే యోచనలో ఎన్‌టీఏ ఉన్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అలాగే పరీక్షలకు దరఖాస్తు చేసే సమయంలో అభ్యర్థుల లైవ్ ఫొటోలు తీసే ఆప్షన్‌ను ప్రవేశపెట్టే ప్రక్రియలో కూడా ఉన్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. ఆన్‌లైన్ అప్లికేషన్ లేదా పరీక్ష ప్రక్రియల్లో నకిలీలను నివారించడానికి గాను వెబ్‌కామ్ లేదా ఫోన్ ద్వారా రియల్‌టైమ్ ఫొటో దోహదపడనుంది.

చైనా సరిహద్దులో.. 16 వేల అడుగుల ఎత్తులో..

» 32 కిలోమీటర్లతో భారత్ వ్యూహాత్మక రహదారి

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ఆపరేషన్ సిందూర్ తర్వాత సరిహద్దుల వెంబడి మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ వేగం పెంచింది. చైనా సరిహద్దుకు సమీపాన ఉన్న ఉత్తరాఖండ్‌లోని భారత్-టిబెట్ సరిహద్దు వద్ద సముద్ర మట్టానికి 16వేల అడుగుల ఎత్తులో వ్యూహాత్మకంగా 32 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఉత్తరాఖండ్‌లోని నీలపాణి నుంచి ములింగ్ లా బేస్ క్యాంప్ వరకు ఈ రోడ్డు నిర్మించనుంది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ నిర్మించనున్న ఈ రహదారి కోసం రూ.104 కోట్లు ఖర్చు చేయనుంది. ప్రస్తుతం మట్టి రోడ్డుగా ఉన్న ఈ మార్గాన్ని ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకుని నిలబడేలా నిర్మిస్తారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే శీతాకాలంలోనూ మంచుతో సంబంధం లేకుండా సైనిక వాహనాలు రాకపోకలు సాగించవచ్చు.

అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహ ప్రాజెక్టుపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఐకానిక్ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్, ఆర్థిక, పర్యాటక, రెవెన్యూ, ఆరోగ్య శాఖల మంత్రులను సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘానికి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శికి సహాయకులుగా సీఆర్‌డీఏ కమిషనర్‌ను నియమించడంతో పాటు మంత్రివర్గ ఉపసంఘంలోని సభ్యులు అవసరానికి అనుగుణంగా ఎవరినైనా ఆహ్వానించే వెసులుబాటు కల్పించారు. 'అమరావతిలో ఐకానిక్ ఎన్టీఆర్ విగ్రహ ప్రాజెక్ట్' పేరుతో ఏర్పాటైన ఈ మంత్రివర్గ ఉపసంఘం పూర్తిస్థాయి డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించాలి. విగ్రహ ఎత్తు, వెడల్పు ఇతర వివరాలను కూడా అందజేయాల్సి ఉంటుంది.

అధికారులకు హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణ

విధి నిర్వహణలో అధికారులు ఎదుర్కొనే మానసిక, శారీరక ఒత్తిడులను తగ్గించడంలో ధ్యానం ఎంతో ఉపకరిస్తుందని దాజీ తెలిపారు. హైదరాబాద్ రామచంద్ర మిషన్-కన్హా శాంతివనం-హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన కమలేశ్ డీ పాటిల్ దాజీ బృందం అమరావతి సచివాలయంలో మంగళవారం ఐఏఎస్ అధికారులు, ఇతర విభాగాల అధికారులకు ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్, ఇనీషియేటివ్స్, మెడిటేషన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మెడిటేషన్, ఇతర ప్రక్రియల వల్ల ప్రయోజనాలు ఆయన వివరించారు. సుమారు అరగంట అధికారులతో మెడిటేషన్ చేయించారు.

ఒక్క కాలేజీకే 'పీపీపీ' బిడ్!

(మెదటిపేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. వాస్తవానికి టెండర్ల ప్రకటన అనంతరం.. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్వహించిన ప్రీబిడ్ సమావేశాలకు 5 సంస్థలు హాజరయ్యాయి. ఆయా సంస్థలు పలు కీలక అంశాలపై ప్రభుత్వం నుంచి వివరణ కూడా తీసుకున్నాయి. అదేవిధంగా టెండర్ల దాఖలు గడువును పొడిగించాలని కోరగా.. రెండుసార్లు గడువు కూడా పొడిగించారు. దీంతో నాలుగు కాలేజీలకు ఆశించిన విధంగా బిడ్లు దాఖలవుతాయని అధికారులు భావించారు. కానీ, సోమవారం టెండర్ల గడువు ముగిసే సమయానికి కేవలం ఆదోని ఆసుపత్రికి మాత్రమే బిడ్ దాఖలుకావడం గమనార్హం.

రికార్డుపై బాహుబలి గురి!

బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో.. నేడే ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ ప్రయోగం

» అమెరికాలోని ఏఎస్‌టీ స్పేస్ సంస్థకు చెందిన 6,400 కిలోల భారీ ఉపగ్రహంతో నింగిలోకి

» ఇంతటి భారీ ఉపగ్రహ ప్రయోగం ఇస్రోకిదే తొలిసారి

సూళ్లూరుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య ప్రయోగాల్లో ఇస్రో మరో కీలక మైలురాయికి చేరువైంది..! తన బాహుబలి రాకెట్ ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమైంది. ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన కొత్తతరం కమ్యూనికేషన్ ఉపగ్రహం 'బ్లూబర్డ్ బ్లాక్-2'ని కక్ష్యలోకి చేర్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. బుధవారం ఉదయం 8.54 గంటలకు చేపట్టే ఈ ప్రయోగానికి తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ వేదిక కానుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం ఉదయం 8.54 గంటలకు ప్రారంభమైంది. కౌంట్‌డౌన్ పూర్తవగానే బుధవారం ఉదయం 8.54 గంటలకు 6,400 కిలోల బరువున్న బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని తీసుకుని ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. 15.07 నిమిషాల్లో రాకెట్ మూడు దశలు పూర్తికాగానే లో ఎర్త్ ఆర్బిట్ (లియో)లోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనుంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఇస్రో ఈ వాణిజ్య ప్రయోగాన్ని చేపడుతోంది. కాగా, భారత భూభాగం నుంచి ఇస్రో రాకెట్ ద్వారా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చడం ఇదే తొలిసారి. అందుకే ఈ ప్రయోగం విజయవంతమైతే ఇస్రో సరికొత్త రికార్డు నెలకొల్పనుంది. ఇప్పటి వరకూ ఉన్న 4,400 కిలోల ఉపగ్రహ ప్రయోగ రికార్డు మరుగున పడనుంది. వాణిజ్య ప్రయోగాల్లో ఇస్రోకిది మరో కీలక మైలురాయి కాబోతోంది. మంగళవారం ప్రారంభమైన 24 గంటల కౌంట్‌డౌన్ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ సమయంలోనే రాకెట్‌కు ఇంధనాన్ని నింపే కార్యక్రమాన్ని పూర్తిచేసిన శాస్త్రవేత్తలు రాకెట్‌లోని అన్ని దశల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ కౌంట్‌డౌన్ ప్రక్రియను పరిశీలించారు.

ఇస్రోపైనే అందరి దృష్టి..

బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణ ఎల్వీఎం-3 రాకెట్. దీన్ని ఇస్రో బాహుబలిగా పిలుస్తారు. ఇది 43.5 మీటర్ల ఎత్తు, 640 టన్నుల బరువు ఉంటుంది. ఇది 4,400 కిలోల బరువున్న భారీ పేలోడ్లను సైతం జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి అలవోకగా మోసుకెళ్లగలదు. లో ఎర్త్ ఆర్బిట్‌లోకి మరింత బరువున్న పేలోడ్లను తీసుకెళ్లగలదు. ఇస్రోకిది అత్యంత నమ్మదగిన రాకెట్. దీంతో చేపట్టిన గత ఎనిమిది ప్రయోగాలూ (టెస్ట్ ఫ్లైట్ సహా) విజయవంతమయ్యాయి. వాటిలో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-3 కూడా ఉంది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఇస్రో ఈ మిషన్ చేపడుతోంది. భారత గడ్డపై నుంచి ఇంతటి బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం-3 మోసుకెళ్తున్నందున.. ఇప్పుడు ప్రపంచం దృష్టంతా ఇస్రోపైనే ఉంది. కాగా, ఎల్వీఎం-3 ద్వారా చేపడుతున్న మూడో వాణిజ్య ప్రయోగమిది. గతంలో వన్‌వెబ్ సంస్థకు చెందిన రెండు వాణిజ్య ఉపగ్రహాలను ఈ రాకెట్ కక్ష్యలోకి చేర్చింది.



రెండో ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న ఎల్వీఎం3-ఎం6 రాకెట్

ఇంటర్నెట్ సేవల్లో విప్లవాత్మక మార్పులు..

ఈ ప్రయోగం కోసం సిద్ధం చేసిన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ సంస్థ రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్లకు నేరుగా హైస్పీడ్ సెల్యులర్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడం కోసం దీన్ని రూపొందించారు. ఈ సంస్థ తయారు చేసిన గత బ్లూబర్డ్ ఉపగ్రహాలకంటే ఇది 3.5 రెట్లు పెద్దది. అలాగే వాటికంటే పది రెట్లు అధిక సామర్థ్యంతో హైస్పీడ్ డేటాను అందిస్తుంది. ఇంధనంతో కలిపి దీని బరువు 6,400 కిలోలు ఉంటుంది. స్టార్‌లింక్ లేదా వన్‌వెబ్ వంటి ఉపగ్రహ ఇంటర్నెట్ ప్రొవైడర్ల మాదిరిగా కాకుండా.. దీనికి ప్రత్యేకమైన టెర్మినల్స్ లేదా యాంటెన్నాలు ఉంటాయి. స్మార్ట్‌ఫోన్లకు నేరుగా బ్రాడ్‌బ్యాండ్ సేవలందించడం దీని ప్రత్యేకత. అంటే టవర్లు లేని మారుమూల ప్రాంతాల్లో కూడా హైస్పీడ్ ఇంటర్నెట్, కాల్స్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కనెక్టివిటీలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని భావిస్తున్నారు. కాగా, ఈ ప్రయోగం ఇస్రో దాని వాణిజ్య విభాగం ఎన్ఎస్ఐఎల్‌కు అతిపెద్ద వాణిజ్య విజయం అయినప్పటికీ.. ఈ ఉపగ్రహం అందించే సేవలు భారత్‌లో అందుబాటులోకి రావు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను భారత్ అనుమతించదు. అంటే ఈ ఉపగ్రహం భారత భూభాగం నుంచే కక్ష్యలోకి చేరినప్పటికీ.. దాని సేవలు భారతీయులకు అందవన్నమాట.



ప్రజలు ప్రియాంకను ప్రధానిగా చూడాలనుకుంటున్నారు

» ఆమెలో ఇందిరను చూస్తున్నారు: వాద్రా

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: ప్రియాంకా గాంధీని కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలనే డిమాండ్‌కు ఆమె భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్‌వాద్రా మద్దతు తెలిపారు. మంగళవారం ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు రాజకీయ అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రియాంకలో ప్రజలు ఇందిరా గాంధీని చూస్తున్నారన్నారు. ప్రియాంక తన నాయకత్వ పటిమను ఇప్పటికే నిరూపించుకుందని వ్యాఖ్యానించారు. ప్రియాంకను అత్యున్నత పదవిలో చూడాలని అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారని, తనను సైతం రాజకీయాల్లోకి రావాలని ప్రజలు కోరుతున్నారంటూ వాద్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ.. ప్రధాని అభ్యర్థిగా ప్రియాంకను ముందుకు తేవాలన్నారు. కాగా, పార్లమెంట్ సమావేశాల సమయంలో రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై వస్తున్న విమర్శలను వాద్రా కొట్టిపారేశారు. రాహుల్, ప్రియాంక ఇద్దరూ దేశం కోసం కష్టపడుతున్నారన్నారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా, బీజేపీ తనను లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు.

బంగ్లాదేశ్‌లో మూకదాడిపై భారత్‌లో ఆగ్రహ జ్వాల

ఢిల్లీలో ఆ దేశ ఎంబసీ వద్ద వీహెచ్‌పీ, బజ్‌రంగ్‌దళ్ నిరసన

» కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషన్ ముట్టడి ఉద్రిక్తం



ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ కార్యాలయం వద్ద ఆందోళనకారులు

న్యూఢిల్లీ, ఢాకా, వాషింగ్టన్, డిసెంబరు 23: బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపు చంద్ర దాస్‌పై మూకదాడి చేసి చంపి, కాల్చేసిన దుర్మార్గానికి వ్యతిరేకంగా ఢిల్లీ, కోల్‌కతాల్లో నిరసనలు భగ్గుమన్నాయి. మంగళవారం ఉదయం ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్ద వీహెచ్‌పీ, బజ్‌రంగ్‌దళ్ తదితర సంస్థలు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించాయి. వందలాది మంది కాషాయ జెండాలు చేతబూని, ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. అనేక మంది బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి, ఢిల్లీలో ఉంటున్నారని, వారిలో ఒక్కరిపైనా దాడి జరగలేదని, కానీ, బంగ్లాదేశ్‌లో మాత్రం హిందువులపై మూకదాడులు జరుగుతున్నాయని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దేశ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి, దోషులను శిక్షించాలని, ఈ తరహా ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఎంబసీ ఆవరణలోకి నిరసనకారులు ప్రవేశించకుండా పోలీసు అధికారులు 1500 మంది పోలీసులను మోహరించారు. ఏడు వరుసల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఢిల్లీ రవాణా సంస్థకు చెందిన బస్సులను కూడా అడ్డంగా పెట్టి ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా, పోలీసులతో నిరసనకారులు వాగ్వాదానికి దిగారు. బారికేడ్లను పక్కకు నెట్టివేశారు. బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ కోసం అక్కడి ప్రభుత్వం చర్యలు చేపట్టే వరకూ తమ నిరసనలు కొనసాగుతాయని తేల్చి చెప్పారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో కూడా నిరసనలు మిన్నంటాయి. స్థానికంగా ఉన్న బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషన్ ఆఫీసు ముట్టడికి బీజేపీ, హిందూ సంఘాల నేతలు, కార్యకర్తలు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవటంతో తోపులాట జరిగి.. పలువురు నిరసనకారులు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. 12మంది ఆందోళనకారుల్ని పోలీసులు అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడి హత్య ప్రకంపనలు అమెరికానూ తాకాయి. భారత మూలాలున్న అమెరికా చట్టసభ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యురాలు జెనిఫర్ రాజ్‌కుమార్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, దేశంలోని హిందువులు, బౌద్ధులు తదితర మైనారిటీలకు రక్షణ కల్పించాలని వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

భారత రాయబారికి బంగ్లాదేశ్ సమన్లు

భారత్‌లో పలు ప్రాంతాల్లోని తమ దౌత్య కార్యాలయాల వద్ద హింసాత్మక నిరసనలు, ఘటనలు జరుగుతున్నాయని.. ఇవి తమ సిబ్బందిని ప్రమాదంలోకి నెట్టే ప్రమాదం ఉందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం భారత రాయబారి ప్రణయ్ వర్మకు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్లు జారీ చేసింది. ఈ మేరకు ఆయన విదేశాంగ కార్యదర్శి ఎదుట హాజరయ్యారు. ఈ నెల 20వ తేదీన ఢిల్లీలో, 22న సిలిగురిలో జరిగిన ఘటనల్ని ఉదహరిస్తూ తమ ఆందోళనను విదేశాంగ కార్యదర్శి ప్రణయ్‌వర్మకు తెలిపారు.

సెంగార్ జైలు శిక్ష సస్పెన్షన్

» పలు షరతులతో బెయిల్ మంజూరు

» ఉన్నావ్ రేప్ కేసులో ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 23: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ రేప్ కేసులో ముద్దాయిగా ఉన్న బీజేపీ నాయకుడు కులదీప్ సింగ్ సెంగార్‌కు మంగళవారం ఢిల్లీ హైకోర్టు ఊరట కలిగించింది. ఆయన అనుభవిస్తున్న జైలు శిక్షను సస్పెండ్ చేసింది. పలు ఆంక్షలు విధించి బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్‌ల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన ఘటనలో ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే బాధితురాలి తండ్రి పోలీసు కస్టడీలో మరణించడంతో సెంగార్‌పై మరో కేసు పెట్టారు. బాధితులను బెదిరిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో సుప్రీంకోర్టు 2019లో ఈ కేసు విచారణను ఉన్నావ్ నుంచి ఢిల్లీ కోర్టుకు బదిలీ చేసింది. అత్యాచారం కేసులో సెంగార్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 2019లో ఢిల్లీలోని ట్రయల్ కోర్టు తీర్పు ఇచ్చింది. దానిని హైకోర్టు ప్రస్తుతం సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సంతృప్తి చెందలేదని బాధితురాలు తెలిపారు. 'నా తండ్రిని హత్య చేశారు. నాపై అత్యాచారం చేశారు. కొన్ని ఏళ్ల పాటు జైలులో ఉంచిన తరువాత నిందితుడిని విడుదల చేస్తున్నారు. ఇదేమి న్యాయం?' అని ఆమె వాపోయారు. బాధితురాలి సోదరి కూడా ఇదే భయాలను వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి ప్రాణ హాని ఉందని, భద్రత కోసం తమనే జైలుకు పంపించాలని కోరారు.

ఒక్కరి స్విగ్గీ ఇన్‌స్టా బిల్ 3.6 లక్షలు

» 'స్పీడ్' షాపింగ్‌లో బెజవాడ దూకుడు

» మహానగరాలకు దీటుగా పెరిగిన ఆర్డర్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ఇంట్లో ఉల్లిపాయలు అయిపోయాయి.. ఇన్‌స్టామార్ట్‌లో ఆర్డర్ పెట్టేద్దాం. సన్‌ఫ్లవర్ ఆయిల్ వెంటనే కావాలి యాప్‌లో బుక్ చేసేద్దాం.. ఇలా విజయవాడ వాసులు స్పీడ్ డెలివరీ యాప్‌లను తెగవాడేస్తున్నారు. స్పీడ్ కొనుగోళ్లలో మెట్రో మహానగరాలనే తలదన్నేలా ఆర్డర్లు పెట్టేస్తున్నారు. బెజవాడియన్ల కొనుగోళ్ల జోరు చూసి ఇన్‌స్టామార్టే ఆశ్చర్యపోతోంది. ఈ టూటైర్ నగరాన్ని షాపింగ్‌లో దేశంలోనే శక్తిమంతమైన నగరాల సరసన చేర్చింది. దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న స్విగ్గీ-ఇన్‌స్టామార్ట్ 'క్విక్ ఈ కామర్స్' వార్షిక గణాంకాలను విడుదల చేసింది. ఇన్‌స్టామార్ట్ వార్షిక వినియోగ ట్రెండ్స్ నివేదిక మేరకు స్పీడ్ డెలివరీ కొనుగోళ్లలో విజయవాడ దూసుకుపోతోంది. ఆ జోరుతో దేశాన్ని ఒక్కసారిగా తనవైపు తిప్పుకొని షాపింగ్ సిటీగా పేరు తెచ్చుకుంది. విజయవాడ ప్రజల్లో వస్తున్న ఆర్థిక మార్పులకు, జీవనశైలికి ఈ కొనుగోళ్లు అద్దం పడుతున్నాయని ఆ నివేదిక వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో విజయవాడ నగరం అసాధారణ వృద్ధిని నమోదు చేసిందని పేర్కొంది.

పెరుగుదల మామూలుగా లేదు

విజయవాడ వాసులు ఇన్‌స్టామార్ట్ ద్వారా కిరాణా సరుకులే కాకుండా కిరాణాయేతర సరుకులు కూడా భారీగా ఆర్డర్లు ఇచ్చారు. బ్యాగులు, వాలెట్లు, ఉపకరణాల ఆర్డర్లు కిందటి ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 538 శాతం పెరిగాయి. క్రీడలు, ఫిట్‌నెస్ ఉపకరణాలకు సంబంధించి కూడా 495 శాతం పెరుగుదల నమోదైంది. ఈ ఏడాదిలో ఫిట్‌నెస్ ఆరోగ్య జీవనం కోసం ఇచ్చే ఆర్డర్లు 83 శాతం పెరిగాయి. ఫ్యాషన్ దుస్తుల కొనుగోళ్లు కూడా భారీ సంఖ్యలో జరిగాయి. బొమ్మల ఆర్డర్స్ అయితే 245 శాతం మేర, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల్లో 223 శాతం మేర వృద్ధి నమోదైంది.

ఉదయం ఉల్లిపాయలు, టమాటాలు

ఏ సమయంలో ఎక్కువగా ఆర్డర్స్ చేస్తున్నారన్న దానిపై కూడా ఇన్‌స్టామార్ట్ తన నివేదికలో పొందుపరిచింది. ఉదయం సమయంలో భారీగా ఆర్డర్స్ ఇస్తున్న వాటిల్లో ఉల్లిపాయలు, టమాటాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, బంగాళాదుంపలు వంటివి ఉంటున్నాయి. ఈ ఏడాది వీటి ఆర్డర్లు కూడా పెద్దఎత్తున పెరిగాయి. ఇక రోజువారీ స్నాక్స్ ఆర్డర్లలో థమ్సప్, లేస్, బింగో, కుర్కురే, బిస్లరీ వంటివి జోరు కొనసాగిస్తున్నాయి. నూనెల విషయంలో.. దుర్గానెయ్యి, నువ్వుల నూనె, వేరుశనగనూనెల ఆర్డర్స్ అధికంగా ఉన్నాయి. ఆకుకూరల్లో చుక్కకూరను ఎక్కువగా విజయవాడ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. పండుగల సమయంలో కోకోకోలాలు, చాక్లెట్స్, క్రంచీ స్నాక్స్ ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నారు.

కొనుగోళ్లలో రికార్డు

విజయవాడలో వ్యక్తిగతంగా ఎంత ఖర్చు చేస్తారన్నదానిపై కూడా ఇన్‌స్టామార్ట్ తన నివేదికలో వివరించింది. ఒక వ్యక్తి 2025 సంవత్సరంలో రూ. 3.62 లక్షల మేర కొన్నాడు. రోజువారీ కొనుగోళ్లతో అంత ఖర్చు చేశాడు. హైదరాబాద్ నగరంలో ఒక వినియోగదారుడు ఏడాదిలో రూ. 4.3 లక్షలు కొనడం దేశంలోనే అత్యధికంగా నిలిచింది. అయితే ఆ వినియోగదారుడు మూడు ఐ ఫోన్లను కొనుగోలు చేయడంతో అంత ఖర్చు అయింది. ఇక బెజవాడ వినియోగదారుడు మాత్రం ఏడాది పొడవునా షాపింగ్ చేయటం విశేషం. విజయవాడలో మరో ముగ్గురు కొనుగోలుదారులు ఏడాదిలో రూ. 3 లక్షలకుపైగా కొనుగోలు చేశారని ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది.

भारतीय गुणवत्ता परिषद्
QUALITY COUNCIL OF INDIA
Creating an Ecosystem for Quality

Honouring the legacy of our beloved former Prime Minister, Bharat Ratna Late Shri Atal Bihari Vajpayee, aligned with the **Hon'ble Prime Minister Shri Narendra Modi**'s vision of Viksit Bharat 2047, and under the guidance of Shri Piyush Goyal, Hon'ble Minister of Commerce and Industry, on the eve of **Sushasan Divas**,

Quality Council of India is Raising the Benchmark for Growth

Introducing Next-Gen Reforms



QCI's Commitment

In the last few years, QCI has been trying to transform India's quality ecosystem, making accreditation faster, smarter, and more accessible, with reforms that have delivered:

Clean Air Priority
New accreditation scheme for calibration of air quality monitoring equipment

Digital Ease
NABL Portal revamp with **23,000+** test options and **2,500+** equipment types for smooth, hassle-free processing

Rewarding Excellence with Ease
Labs with **10+ years** of strong performance get simple desktop surveillance

ZED Made Faster, Digital
ZED Bronze Certification in **24 hours** and end-to-end online process for ZED Certification

Fast Recognition
48-hour recognition for Soil Health Card Labs and MELT Scheme Labs

Longer Accreditation for Labs
Labs now get **4-year** accreditation instead of **2 years**

Our Humble Attempts: Listening to Stakeholders, Driving Change

QCI's Bold Reforms for Viksit Bharat

Building on the progress of our quality journey, we now accelerate the trajectory, driving the next wave of transformation.

The Big Leap Forward

Powering the Quality Engine

Unveiling the Q Mark - *Desh ka Haq*
Know your lab, hospital, and MSME through the QR-coded Mark of Quality. Full Disclosure, No Fake Certificates

From Inspection to Trust
Less paper. Less time. Fewer inspections. Higher trust. A low-friction ecosystem

Expanding Assessor Pool across Boards and Divisions
Lowering entry barriers to bring young experts to reach the last mile

Quality Setu
A secure ticket-based system for time-bound grievance and feedback resolution

One-Stop Accreditation Platform
Launching a single, paperless modular platform to replace multiple accreditation portals

Industry & MSMEs

NDIE — National Division for Industry Excellence

Empowering India's Economic Backbone-Our 6 Crore+ MSMEs

QCI-Industry Partnership
QCI to mentor & support Tier-2 & Tier-3 suppliers to achieve ZED and Lean certification

Making Indian products ready for global standards
1,00,000 MSMEs and SHGs **(ODOP)** to be trained in quality, packaging and branding in 2026

Shop floor Best Practices Playbook for MSMEs
Empowering every small business to get accustomed to global quality practices, strengthening everyday shop floor performance

Reducing Fees for ZED and Lean Certification
Ensuring access affordability, quality and recognition to India's last mile entrepreneur

Industry & Labs

NABL — National Accreditation Board for Testing and Calibration Laboratories

Endeavouring to make India the Testing Capital of the World

Introducing Model Scope for Medical Testing Laboratories
Ensuring uniformity in accredited scope of medical laboratories

Technical Skilling for Laboratory Personnel
5,000 lab personnel to be trained in technical skills in 2026 to build a stronger, safer national testing ecosystem

Self-declaration for Authorized Signatories
Approval of proposed signatory for NABL assessor within **48 hours**

Allowing 48-hour Scope Extension
Removing long waits for laboratories to expand services-approval for similar product/method/test/analyte under existing scope

Zero Additional Fee
Eliminating additional fee for product-based accreditation when test parameters are already covered

Healthcare

NABH — National Accreditation Board for Hospitals and Healthcare Providers

Driving Patient Safety First, in Every Hospital, Every Pincode

Direct, trusted guidance through NABH's MITRA programme-no middlemen
Trained, verified mentors officially empanelled to guide hospitals, especially in smaller towns

Relaxed Occupancy Norm
Opening accreditation to hospitals at **20% occupancy**

Graded Penalties
Shifting from blanket bans to graded penalties with guidance and course correction

Gunvatta Pathshala
Role-based skilling for doctors, nurses, and technicians in patient safety and accreditation

Desktop Surveillance for Consistent Performers
AI-assisted form filling and desk-based monitoring to reduce on-site inspections for consistently performing hospitals

NABCB — National Accreditation Board for Certification Bodies

Ensuring Local Products Reach Global Markets

Introducing Accredited Certification for Indigenously Manufactured Products
Ensuring seamless acceptance of Indian Products across Global Supply Chain

Quality Passport for Indian Products & Services
Globally aligned NABCB accredited Certifications for Faster Market Access

Quality in New-Age Tech Areas
Fast track accreditation of Certification Bodies for Drones and Cybersecurity Sectors

As we soar towards our national vision, we remain firmly grounded in our purpose.

Scan to Know more

QCI BOARDS: NABCB, NABH, NABL, NABET, NBQP

QCI DIVISIONS: PADD (Project Analysis and Documentation Division), PPID (Project Planning & Implementation Division), NDIE, Strategy & Policy Division

QCI INITIATIVES: गुणवत्ता गुरुकुल, गुणवत्ता संकल्प, MSME SARPANCH SAMVAAD, Quality City Nashik, QUALITY BHARAT, ONDC (Founded & Supported by QCI)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా బడబాగ్ని


బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ ఢిల్లీ, కోల్‌కతాల్లో మంగళవారం భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఢిల్లీలో బంగ్లాదేశ్ హైకమిషన్ కార్యాలయం ముందు వందలాది నిరసనకారులు తమ ఆగ్రహాన్ని ప్రకటిస్తూ, ప్రతీ హిందూ రక్తపుబొట్టునూ లెక్కిస్తామని నినదించారు. కోల్‌కతాలో బీజేపీ అగ్రనాయకుడు సువేందు అధికారి సారథ్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. పరివార్ సంఘాల కార్యకర్తలు బంగ్లా దౌత్యకార్యాలయంవైపు వెళ్ళకుండా నిరోధించడానికి పోలీసులు లాఠీచార్జి చేయవలసి వచ్చింది. విజ్ఞాపనపత్రం సమర్పించిపోతామని హామీ ఇచ్చినా పోలీసులు తమపై దురుసుగా ప్రవర్తించారని బీజేపీ నాయకుల ఆరోపణ. మూకదాడి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన చంద్రదాస్ కుటుంబానికి ప్రతీ నెలా ఆర్థిక సాయం అందచేయబోతున్నట్టు కూడా సువేందు అధికారి ప్రకటించారు. ఎన్నికలు ముగిసేవరకూ బంగ్లాదేశ్‌లో హింస తగ్గదని అక్కడి విశ్లేషకులు అంటుంటే, ఎన్నికలు సమీపిస్తున్న పశ్చిమబెంగాల్‌నూ సరిహద్దు ఆవలి పరిణామాలు ప్రభావితం చేయడం సహజం.

బంగ్లాతో దౌత్యానికి సమయం దాటిపోయిందని, ఇక శస్త్రచికిత్స చేయాల్సిందేనని అసోం ముఖ్యమంత్రి హేమంత బిశ్వశర్మ అంటున్నారు. జాతీయ మీడియాతో ఆయన చేసిన ఈ వ్యాఖ్యల్లో అంతరార్థం పొరుగు దేశంవారికి అర్థంకాకపోదు. భారత్ వ్యతిరేకతమీదే ఆధారపడిన బంగ్లాదేశ్ రాజకీయజీవులకు ఇక్కడి మాటలు, చర్యలు ఆక్సిజన్‌లాగా ఉపకరిస్తాయి. మరో రెండునెలల్లో ఎన్నికలు జరగబోతున్న ఆ దేశంలో పరిస్థితులు అతివేగంగా దిగజారిపోతున్నాయి. హసీనా వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన షరీఫ్ ఉస్మాన్ హదీ హత్యతో ఇటీవల రేగిన హింస పలురీతులుగా విస్తరించింది. గార్మెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న హిందూ యువకుడు దీపు చంద్రదాస్‌ను హత్యచేసి, తగలబెట్టేశారు. భారత్‌కు భజన చేస్తున్నాయనీ, హసీనా అనుకూల సంస్థలన్న ఆరోపణతో కొన్ని పత్రికలమీద దాడులు జరిగాయి. ప్రతీ క్షణం ప్రాణభయంతో, ఆత్మరక్షణలో బతుకుతున్నామని మీడియా ప్రముఖులు వాపోతున్నారు. చంద్రదాస్ మతదూషణకు పాల్పడ్డాడన్న వాదనలో వీసమెత్తు నిజం లేదని నిర్ధారణ అయిపోయింది. అతడిని రక్షించే ప్రయత్నం చేయకుండా ఫ్యాక్టరీ బయటకు తోసివేసి భక్షకులకు అప్పగించడం వంటి పరిణామాలు తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి.

షేక్ హసీనా అత్యంత అప్రజాస్వామికంగా, నిరంకుశంగా దేశాన్ని ఏలినమాట నిజం. ఆమెకు వ్యతిరేకంగా ఉద్యమించి, ప్రభుత్వాన్ని కూల్చి, చివరకు ఆమె దేశం విడిచిపోయేవరకూ జూలై తిరుగుబాటుదారులు విశ్రమించలేదు. విదేశాల్లో ఉన్న యూనిస్‌ను తాత్కాలిక అధినేతగా తెచ్చిపెట్టుకున్న ఈ విద్యార్థిలోకం దేశాన్ని చక్కగా గాడినపెట్టుకొని, ప్రజాస్వామికంగా తీర్చిదిద్దుకుంటుందని అంతా అనుకున్నారు. కానీ, షేక్ ముజిబూర్ రహ్మాన్ మూలాలను చెరిపివేయడం మీద ఉన్న శ్రద్ధ పరిస్థితులను చక్కదిద్దుకోవడం మీద లేకపోయింది. అవామీలీగ్‌ను ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధించడంతోపాటు, ప్రత్యేకకోర్టు తీర్పుతో హసీనాను తిరిగి దేశంలోకి అడుగుపెట్టనివ్వకుండా జాగ్రత్తపడ్డారు. మరోపక్క ఆమె ప్రత్యర్థి ఖలేదాజియాను స్వదేశానికి రప్పించి, రాబోయే ఎన్నికల్లో ఆమె పార్టీ విజయానికి ద్వారాలు తెరిచారు. జమాతే ఇస్లామీ సహా వివిధ మతసంస్థలమీద ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్ళలో ఉన్న ఆయా శక్తులను యూనిస్ ప్రభుత్వం వీధుల్లోకి వదిలేసిన ఫలితమే ప్రస్తుత అగ్ని. భారత్ వ్యతిరేకత ఆధారంగా ఎన్నికల్లో ఎక్కువస్థానాలు నెగ్గాలని కొన్ని పక్షాలు ప్రయత్నిస్తుంటే, మతవిద్వేషాలు రేపి పైచేయి సాధించాలని ఇస్లామిక్ శక్తులు చూస్తున్నాయి. పొరుగుదేశంలో అతివేగంగా మారుతున్న పరిణామాలకు జమాతే వంటి ఇస్లామిక్ సంస్థలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణం. యాభైమూడుశాతం ఓటర్లు వీటిపక్షాన ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. ఆరునూరైనా ఫిబ్రవరి 12నే ఎన్నికలు నిర్వహిస్తామని యూనిస్ గట్టిగా చెబుతున్నారు. అనుకున్నట్టు జరుగుతాయా లేదా అన్నకంటే అప్పటివరకూ దేశం ఎంత హింస చవిచూడాల్సి వస్తుందన్నది ప్రశ్న. పొరుగుదేశం పరిణామాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. హసీనాకోసం ఆ దేశాన్నే వదులుకున్నామన్న విమర్శలను అటుంచితే, అక్కడి ప్రమాదకర పరిణామాలపై అదుపులేని వ్యాఖ్యలు చేయడం, వారిని అవమానించేట్టుగా, రెచ్చగొట్టేట్టుగా మాట్లాడటం మనకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు.

గాంధీ ఆశయాలపై కేంద్రం తూటా

గ్రామీణ భారతదేశానికి ఊపిరిలా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నేడు నిర్వీర్యమవుతోంది. ఇది యాదృచ్ఛిక పరిపాలనా వైఫల్యం కాదు. ఉద్దేశ్యపూర్వక విధాన నిర్ణయాల ఫలితం. పేదలకు పని హక్కు ఇచ్చే ఈ పథకాన్ని క్రమంగా ఊపిరాడనీయకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వ అసలైన ఉద్దేశ్యం అనిపిస్తోంది. మహాత్మాగాంధీ పేరు పెట్టుకుని అమలు చేస్తున్న పథకాన్నే బలహీనపరచడం కన్నా పెద్ద ద్రోహం ఇంకేముంటుంది? గ్రామాలే భారతదేశానికి పునాది అని గాంధీ అన్నారు. పేదల శ్రమకు గౌరవం కావాలన్నారు. ఆకలి మానవత్వానికి అవమానం అని చెప్పారు. కానీ నేటి పాలనలో గాంధీ ఆశయాలకు సమాధి కడుతున్నారు.



గతంలో ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90శాతం, రాష్ట్రం 10శాతం నిధులు భరించేవి. ఇది పథకం సజావుగా నడవడానికి కీలకం. కానీ ఇప్పుడు కొత్త నిబంధనల పేరుతో కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం ఖర్చు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాలు తమ 40శాతం వాటా ఇవ్వలేక చేతులెత్తేస్తాయి. అప్పుడు కేంద్రం 'రాష్ట్రాలు ఖర్చు చేయడం లేదు' అని నెపం వేసే అవకాశం ఉంది. ఇది కపటత్వం కాకపోతే మరేమిటి? 15 రోజుల్లో వేతనం ఇవ్వాలన్న చట్టాన్ని కేంద్రం తానే ఉల్లంఘిస్తోంది. నెలల తరబడి జీతాలు రాకపోయినా ఎవరూ బాధ్యత వహించడం లేదు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు – పేదల శ్రమను దోచుకోవడమే. ఆధార్, బయోమెట్రిక్, ఆన్‌లైన్ విధానాలన్నీ– లీకేజీ అరికట్టడానికన్నా, పేదలను పథకం నుంచి బయటకు నెట్టడానికి పనికొస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ లేని కూలీకి పని లేదన్నట్టుగా వ్యవహరించడం, ఉపాధి హామీని హక్కు నుంచి దయగా మార్చడం ప్రమాదకరం. గాడ్సే ఒక్కసారే మహాత్మాగాంధీని శారీరకంగా చంపాడు. మోదీ ప్రభుత్వం మాత్రం గాంధీ ఆలోచనలను, పేదల పట్ల ఆయన నమ్మిన మానవత్వాన్ని, శ్రమ గౌరవాన్ని తన విధానాల ద్వారా రోజూ చంపుతోంది. ఇది ఒక్కసారిగా జరిగే హత్య కాదు. నెమ్మదిగా జరిగే, లోతుగా గాయపరచే వ్యవస్థాగత హత్య. పథకాన్ని పూర్తిగా రద్దు చేస్తే ప్రజలు ప్రశ్నిస్తారు. అందుకే నిధులు తగ్గిస్తూ, బాధ్యతలు మళ్లిస్తూ, సాంకేతిక అడ్డంకులు పెడుతూ నిశ్శబ్దంగా చంపుతున్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యమైతే గ్రామీణ నిరుద్యోగం పెరుగుతుంది. వలసలు ఉధృతమవుతాయి. మహిళల ఆర్థిక స్వావలంబన కూలిపోతుంది. పేదరికం మరింత లోతుగా మారుతుంది. ఇది అభివృద్ధి కాదు వెనుకడుగు. ఈ దేశానికి గాంధీ విధానాలు కావాలి. ఉపాధి హామీ పథకం దానం కాదు. అది హక్కు. ఆ హక్కును నిర్వీర్యం చేయడం ప్రజాస్వామ్యానికి అవమానం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన బాధ్యతను స్వీకరించాలి. లేదంటే చరిత్రలో ఇది గాంధీ పేరు చెప్పుకుని గాంధీ ఆశయాలను హతమార్చిన పాలనగా నమోదు అవుతుంది.

● రాంభూపాల్ రెడ్డి
ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ

కమల సరోవరంపై మోదీ సూర్యుడు



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఈ నెల 10వ తేదీన తెలంగాణ బీజేపీ ఎంపీలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. వచ్చీ రాగానే ఆయన అత్యంత ఆగ్రహంతో మాట్లాడారు. ఎంపీల గుండెలు బితుకుబితుకుమన్నాయి. ఎంపీల్లో ప్రతి ఒక్కరికీ తగిలే విధంగా మోదీ తీవ్రంగా మందలించారు. '1984 లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీకి కేవలం రెండే సీట్లు లభించాయి. గుజరాత్‌లోని మెహసానా సీటు నుంచి ఏకే పాటిల్ ఎన్నికయ్యారు. హనుమకొండ సీటు నుంచి జంగారెడ్డి గెలిచారు. నాడు రాజీవ్‌గాంధీ బీజేపీని హమ్ దో, హమారే దో అని ఎద్దేవా చేశారు. ఇవాళ గుజరాత్‌లో బీజేపీ పరిస్థితి ఎలా ఉన్నది, తెలంగాణలో పరిస్థితి ఎలా ఉన్నది?' అని ఆయన ప్రశ్నించారు. ఆయన మాటలకు ఎవరికీ నోరు పెగల్లేదు. 'మీ కంటే ఒవైసీ బెటర్' అని మోదీ నిష్ఠూరమాడడం అన్నిటి కంటే అవమానకమని ఒక ఎంపీ అన్నారు.

తెలంగాణ ఎంపీలను మోదీ ఎందుకు టార్గెట్ చేశారు? ఎంపీలకు మోదీ క్లాస్ తీసుకునేందుకు అయిదు రోజుల ముందు పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హైదరాబాద్ వెళ్లి వచ్చారు. పార్టీలో అంతర్గత వ్యవహారాల గురించి మాట్లాడుతున్న నేతలను ఆయన తీవ్రంగా మందలించారు. 'ఉంటే ఉండండి. పోతే పోండి' అని ఆయన హెచ్చరించారు. బహుశా సంతోష్ ద్వారా నివేదిక అందిన తర్వాతే మోదీ ఇలా విరుచుకుపడ్డట్లు సమాచారం.

మోదీ అంతటితో ఆగలేదు. పార్లమెంటు సమావేశాలు ముగిసేందుకు రెండు రోజుల ముందు బీఆర్ఎస్ ఎంపీలను పిలిచి మాట్లాడారు. ఆయన పిలిపించి మాట్లాడారా, లేక వారే కలుసుకునే ప్రయత్నం చేశారా అన్నది స్పష్టంగా తెలియదు. కరీంనగర్, వరంగల్ సమస్యల గురించి మాట్లాడేందుకు మంత్రుల ద్వారా అపాయింట్‌మెంట్ కోరితే మోదీ వెంటనే పిలిపించారని బీఆర్ఎస్ ఎంపీ ఒకరు చెప్పారు. విచిత్రమేమంటే మోదీ ఈ సమావేశంలో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. తాను ఏదో సోషల్ మీడియాలో చూశానని, కేసీఆర్ బాగా బరువు తగ్గినట్లు కనపడ్డా కోలుకుంటున్నట్లు తెలిసిందని మోదీ వారికి చెప్పారు. కేసీఆర్ కోలుకోవడం చాల మంచి పరిణామం అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

కేసీఆర్ గురించి మోదీ మాట్లాడిన మరో మూడు రోజులకు కేసీఆర్ అనూహ్యంగా మీడియా ముందుకు వచ్చారు. తన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లు అన్నిటినీ తుత్తునియలు చేస్తూ దాదాపు గంటన్నరకు పైగా తన ఒరిజినల్ శైలిలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. దీనితో ఇంతకాలం స్తబ్దంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్ చాలా ఉత్సాహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఏ విషయాలు ప్రస్తావించారు, అన్నీ నిజాలే మాట్లాడారా అన్నది ప్రశ్న కాదు. మళ్లీ విజృంభిస్తానని కేసీఆర్ చెప్పడం చర్చనీయాంశమైంది. జూబిలీహిల్స్ ఓటమి తర్వాత క్రుంగిపోయిన పార్టీకి మరోసారి ఆశలు రేకెత్తాయి.

తెలంగాణకు బీఎల్ సంతోష్ వెళ్లిరావడం, మోదీ తమ పార్టీ ఎంపీలను విమర్శించడం, బీఆర్ఎస్ ఎంపీలను పిలిచి మాట్లాడడం, ఆ తర్వాత కేసీఆర్ రంగప్రవేశం చేయడం... ఈ నాలుగు ఘటనలకు ఏమైనా అంతస్సంబంధం ఉన్నదా? అంతకు ముందే తెరవెనుక ఇంకా ఏమైనా పరిణామాలు జరిగాయా?

ఏమైనా ఒక విషయం మాత్రం స్పష్టం: మోదీ పూర్తిగా తెలంగాణపై దృష్టి కేంద్రీకరించారు. ఒకవైపు వచ్చే ఏడాది ప్రథమార్థంలో పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికలు జరగాల్సి ఉండగా, తెలంగాణపై మోదీ ఎందుకు దృష్టి కేంద్రీకరిస్తున్నారు? పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పరస్పర వ్యతిరేక విమర్శలు గుప్పించుకుంటుండగా, ఆ రాష్ట్రాన్ని వదిలి తెలంగాణను పట్టించుకోవాల్సిన తక్షణ అవసరం ఏమున్నది? తెలంగాణలో రేవంత్‌రెడ్డి రోజు రోజుకూ బలోపేతం కావడం, కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా ఆయన అన్ని విధాలా అండదండలివ్వడం మోదీ దృష్టికి వచ్చే ఉంటుంది. తెలంగాణ బీజేపీ నేతలు పరస్పరం ఘర్షించుకోవడం, స్థానిక పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావుపై ఆధిపత్యం చలాయించే ప్రయత్నం చేయడం మొదలైన వాటిని మోదీ హర్షించడం లేదు. కేసీఆర్ ఆరోగ్యం గురించి చాలా మందికి తెలియని సమాచారం మోదీకి ఉన్నప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో జరిగే పరిణామాలు, రేవంత్‌రెడ్డి ఎదుగుతున్న తీరు ఆయన గమనించకుండా ఉంటారా? అయితే మోదీ తదుపరి ఎత్తుగడ ఏమిటో ఎవరు అంచనా వేయగలరు? మోదీ గురి ఎక్కడో ఉన్నట్లు కనిపించినా అది ఎక్కడ తగులుతుందో ఆయనకు మాత్రమే తెలుసు. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇలాంటి పరిణామాలు పట్టకపోవచ్చు కానీ రేవంత్‌రెడ్డి మాత్రం అంచనా వేయకుండా ఉంటారా?

ఈ పరిణామాలన్నిటి వెనుక ఒక విషయం స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వంలోనే కాదు, భారతీయ జనతా పార్టీలో కూడా కర్త, కర్మ, క్రియ నరేంద్రమోదీ యే, సందేహం లేదు. ఆయనే అన్నీ. మోదీయే పార్టీ అధ్యక్షుడు, దేశ ప్రధానమంత్రి కూడా. బీజేపీలో సాధారణంగా పార్టీ జాతీయ అధ్యక్షుడి స్థానంలో ఉన్నవారు పార్టీ వ్యవహారాలను నిర్వహిస్తూ పార్టీ అంతర్గత సమావేశాల్లో కీలక నాయకులతో చర్చించి వ్యూహరచన చేసేవారు. లాల్‌కృష్ణ ఆడ్వాణీ, అటల్‌బిహారీ వాజపేయి, మురళీమనోహర్ జోషి, కుశాభావు థాక్రే, జానా కృష్ణమూర్తి, వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి వంటి హేమాహేమీలు పార్టీ అధ్యక్షులుగా ఉన్నంతవరకూ బీజేపీ కార్యాలయంలో ఒక రకమైన ప్రజాస్వామిక రాజకీయ వాతావరణం ఉండేది. వెంకయ్యనాయుడు పార్టీకి, ప్రభుత్వానికీ మధ్య వారధిలా ఉంటూ పార్టీని నిర్వహించేవారు. చాలా మంది కేంద్రమంత్రులు పార్టీ కార్యాలయానికి తమ శాఖలో తీసుకుంటున్న నిర్ణయాల గురించి తెలియజేసేవారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుల నియామకంలో జాతీయ అధ్యక్షులే నిర్ణయం తీసుకునేవారు. 'ఒక చేతిలో ఎన్డీఏ ఎజెండా, మరో చేతిలో బీజేపీ జెండా' ఇత్యాది నినాదాలను వెంకయ్యే రూపొందించేవారు.

> **ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ కర్త, కర్మ, క్రియ నరేంద్రమోదీయే, బిహార్ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత తనకు తిరుగులేదన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారు. నితిన్ నబీన్ నియామకంతో ఎవరినీ సంప్రదించాల్సిన అవసరం లేదనే సంకేతాలు మోదీ స్పష్టంగా పంపారు. యోగి ఆదిత్యనాథ్‌ను సంప్రదించకుండానే కేంద్రమంత్రి పంకజ్ చౌదరిని యూపీలో పార్టీ అధ్యక్షుడుగా నియమించారు. కాంగ్రెస్ సంస్కృతి ఒక రకంగా బీజేపీలో ప్రవేశించింది.**



అయితే 2020లో పార్టీ జాతీయ అధ్యక్షుడుగా జగత్ ప్రకాశ్ నడ్డా నియామకం తర్వాత పూర్తి నిర్ణయాధికారాలు మోదీ, అమిత్ షా చేతుల్లోకి వచ్చేశాయి. ఎవరిని ముఖ్యమంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడుగా నియమించాలనేది నడ్డా చేతుల్లో లేకపోవడమే కాదు, కనీసం ఆయనను సంప్రదిస్తున్నారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. రెండేళ్ల క్రితం బాగా పనిచేస్తున్న ఒక రాష్ట్ర అధ్యక్షుడిని అకస్మాత్తుగా తొలగించారు. ఆయన ఢిల్లీకి వచ్చి పార్టీ జాతీయ అధ్యక్షుడిని కలుసుకున్నారు. 'నన్నెందుకు తొలగించారు సార్ చెప్పండి' అని టీవీ చూస్తున్న ఆ జాతీయ అధ్యక్షుడిని అడిగారు. ఆయన ముఖం తిప్పకుండా రిమోట్‌తో ఛానెల్స్ మారుస్తూ. 'నన్ను తొలగించమన్నారు.. నేను తొలగించాను. అంతే..' అని జవాబిచ్చారట!

ఇదే విధంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులను, ముఖ్యమంత్రులను నియమించే విషయం మోదీ, అమిత్ షాలకు తప్ప మరెవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. కొందరు బీజేపీ నేతలకు తమను ముఖ్యమంత్రులుగా నియమిస్తున్న విషయం చివరి వరకూ తెలియదట. 'పార్టీ శాసన సభాపక్ష సమావేశంలో నా పేరు నిర్ణయిస్తారని ముందే తెలుస్తే షర్టు మార్చుకుని వచ్చేవాడిని కదా!' అని ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఒక నేత ఆశ్చర్యపోయారట. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న 14 మంది బీజేపీ ముఖ్యమంత్రుల్లో జాతీయ స్థాయిలో తెలిసిన వారి పేర్లు తక్కువే.

ఆసక్తికరమైన విషయం ఏమంటే ఇప్పుడు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా కూడా ఎవరూ ఊహించని, ఇప్పటి వరకూ ఎవరికి తెలియని 45 సంవత్సరాల నితిన్ నబీన్‌ను నియమించారు. పార్టీలో ఆయన కంటే సీనియర్లు, అనుభవజ్ఞులైన నేతలు ఎందరో ఉన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాలు ఒక జూనియర్ నేత ద్వారా వారందరికీ పనులు అప్పగిస్తారన్నమాట. ఈ నెల 16న నితిన్ నబీన్ తన కొత్త పదవీ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చినప్పుడు హోంమంత్రి అమిత్ షా స్వయంగా ఆయనకు స్వాగతం పలికారు. తద్వారా తాము నియమించిన వ్యక్తిని అందరూ ఆమోదించాల్సిందేనని నిక్కచ్చిగా సంకేతాలు పంపారు. అయినప్పటికీ ఒకరిద్దరు పార్టీ ప్రధాన కార్యదర్శులతో పాటు మరికొందరు నేతలు కొత్త అధ్యక్షుడికి స్వాగతం చెప్పకుండా ముఖం చాటేశారని సమాచారం. ఈ నియామకంపై జిల్లా అధ్యక్షులు కూడా కొందరు అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. కాని వారు ఏమి చేయగలరు?

బిహార్ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనకు తిరుగులేదన్నట్లుగా వ్యవహరించడం స్పష్టంగా తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్‌తో ఏకాభిప్రాయం కుదరక పార్టీ జాతీయ అధ్యక్షుడి నియామకం ఏడాదిగా వాయిదాపడుతూ వస్తోంది. నితిన్ నబీన్ నియామకంతో ఎవరినీ సంప్రదించాల్సిన అవసరం లేదనే సంకేతాలు మోదీ స్పష్టంగా పంపారు. ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను సంప్రదించకుండానే కేంద్రమంత్రి పంకజ్ చౌదరిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమించారు. దీనిపై ఆదిత్యనాథ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సమాచారం. ఒకరకంగా కాంగ్రెస్ సంస్కృతి బీజేపీలో ప్రవేశించింది. పార్లమెంటులో బిల్లుల విషయంలో కూడా మునుపెన్నడూ లేని రీతిలో దూకుడు కనిపిస్తోంది. ప్రతిపక్షాలు ఎంత తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నా రాష్ట్రాల్లో ఓటర్ జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ (సర్)ను ఉధృతంగా అమలు చేస్తున్నారు. త్వరలో కేంద్ర కేబినెట్‌లో అనేకమందికి ఉద్వాసన చెప్పనున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ఆడ్వాణీ వివిధ రాష్ట్రాల్లో అరుణ్ జైట్లీ, అనంతకుమార్, వెంకయ్యనాయుడు, సుష్మాస్వరాజ్, గోవిందాచార్య, ఉమాభారతి వంటి నేతలను ప్రోత్సహించి జాతీయ స్థాయికి తీసుకువచ్చారు. ఇప్పుడు అలాంటి రెండోతరం నేతలెవరూ కనపడడం లేదు. ఆసక్తికరమైన విషయం ఏమంటే బీజేపీలో ఇతర పార్టీల్లో లాగా లుకలుకలు పైకి కనపడవు. నాయకుడు గెలిపిస్తున్నంత వరకూ ఎవరూ ఏమి మాట్లాడరు. మరి కొత్త సంవత్సరంలో పరిణామాలు ఎలా ఉంటాయో ఎవరు చెప్పగలరు?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆంధ్రా కురియన్ కాకాని

స్వర్గీయ కాకాని వెంకటరత్నం మరణించి డిసెంబర్ 25కి 53 సంవత్సరాలు పూర్తి అవుతుంది. అయినా ఆయన సేవలు నేటికీ ప్రతి పల్లెలోనూ, పట్టణంలోనూ స్మరించుకుంటూనే ఉన్నారు. దేశ సౌభాగ్యానికి పట్టుకొమ్మలైన గ్రామీణ రైతు, కూలీ బంధువుగా వారికి చేయూతనందించిన ప్రజల మనిషి ఆయన. ప్రజానాయకునిగా అంచెలంచెలుగా ఎదిగిన మహోన్నత వ్యక్తి కాకాని వెంకటరత్నం.



తన వృత్తే ప్రజాసేవ అని నమ్మి జీవితమంతా ప్రజలతోనే గడిపిన ఆదర్శ నాయకుడు ఆయన. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయమంత్రిగా చేసిన కాలంలో ఆయన స్థాపించిన పాల సేకరణ కేంద్రాలు, శీతలీకరణ కేంద్రాలు, జిల్లా పాడి పరిశ్రమ కేంద్రాలు గ్రామీణ రైతాంగ ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహదపడ్డాయి. తద్వారా గ్రామీణ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాయి. అందుకే కాకానిని చాలా మంది 'ఆంధ్రా కురియన్'గా పిలుచుకుంటారు.


తదనంతర రాజకీయ పరిణామాలలో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి సారథ్యం వహించే అరుదైన అవకాశం కాకానికి లభించింది. మహోధృతంగా జరిగిన ఆ ఉద్యమ ఫలం ఆయన మరణించిన 42 సంవత్సరాల తరువాత సాకారమైంది. రాష్ట్రం నేడు అనేక అభివృద్ధి కార్యక్రమాలతో ముందడుగు వేస్తోంది. 1953లో ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం కారణం. అదే 13 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి జరిగిన ఉద్యమంలో అసువులు బాసిన త్యాగమూర్తి కాకాని. 1972 డిసెంబర్ 24 తలపెట్టిన సమైక్యవాదుల సమావేశానికి వ్యతిరేకంగా జరిగిన విస్తృత ప్రజా ఉద్యమంపై అజంతా హోటల్, ఏలూరు రోడ్డు సెంటరులో జరిగిన పోలీసు కాల్పులలో మరణించిన ఉద్యమకారుల శవాలను చూసి, 'నా బిడ్డలను పిట్టలలాగా కాల్చేస్తున్నారన్న' తీవ్ర ఆవేదనతో అదే రోజు రాత్రి గుండెపోటుతో మరణించారు కాకాని. అటువంటి నిస్వార్థ నాయకునికి స్మృతి చిహ్నంగా నూతన రాజధాని అమరావతిలో ఒక కట్టడానికి గాని, కృష్ణా జిల్లా నుంచి అమరావతి ప్రాంతాన్ని కలిపే ఐకానిక్ బ్రిడ్జికి గాని రాష్ట్ర ప్రభుత్వం కాకాని పేరు పెట్టాలి. కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధులందరూ ఇందుకోసం కృషి చేయాలి.

○ కలపాల వినయసాగర్
కాకాని వెంకటరత్నం మెమోరియల్ ట్రస్ట్, ముదునూరు, కృష్ణా జిల్లా

(డిసెంబర్ 25: కాకాని వెంకటరత్నం వర్ధంతి)

సుపరిపాలనకు స్ఫూర్తిప్రదాత

పండితుడు, ప్రజల మనస్సులో ఇప్పటికీ ప్రతిధ్వనించే కవి; క్రమశిక్షణ, సేవాభావంతో నిండిన స్వయంసేవకుడు; పార్టీలకు అతీతంగా గౌరవం పొందిన రాజనీతిజ్ఞుడు; అధికారం కంటే నైతికతను మిన్నగా భావించిన అరుదైన రాజకీయ నాయకుడు; దేశభక్తుడు; ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన దూరదృష్టి గల నాయకుడు– భారతరత్న అటల్‌బిహారీ వాజపేయి. ఆయన జన్మ శతాబ్ది, ఒక సత్యాన్ని దేశానికి గుర్తుచేసింది. నాయకులు కాలంతో వెళ్లిపోవచ్చు, కానీ వారి సిద్ధాంతాలు శాశ్వతంగా నిలుస్తాయి. వాజపేయి ఆదర్శాలు నేటికీ ప్రతి భారతీయుడికీ, ముఖ్యంగా రాజకీయ నాయకులకు నవ భారత నిర్మాణంలో ప్రేరణ ఇస్తూనే ఉన్నాయి.



1984లో ముంబయిలోని శివాజీ పార్క్‌లో జరిగిన బీజేపీ ఆవిర్భావ సభలో వాజపేయి మాట్లాడుతూ "అంధేరా ఛటేగా, సూరజ్ నిక్లేగా, కమల్ ఖిలేగా" (చీకటి తొలగిపోతుంది, సూర్యుడు ఉదయిస్తాడు, కమలం వికసిస్తుంది) అన్నారు. అప్పట్లో బీజేపీకి కేవలం రెండు లోక్‌సభ స్థానాలే ఉన్నాయి. అయినా ఆయన నమ్మకం కోల్పోకుండా, కార్యకర్తల హృదయాల్లో ఆ నమ్మకాన్నే నాటారు. జనసంఘ్ నుంచి బీజేపీ వరకు 10సార్లు లోక్‌సభ సభ్యుడిగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా గెలిచారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ నియంతృత్వానికి ఎదురొడ్డి నిలిచిన నాయకుడు వాజపేయి.

బీజేపీ నుంచి తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, విభిన్న భావజాలాల మిత్రపక్షాలను కలుపుకొని విజయవంతంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపారు. ఒక్క ఓటుతో ప్రభుత్వం పడిపోయినా, నైతిక విలువలతో రాజీపడని నాయకత్వం ఆయనదే. 1999లో కార్గిల్ చొరబాటు సమయంలో, ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా ఉన్నప్పటికీ వాజపేయి వెనుకడుగు వేయలేదు. ఆపరేషన్ విజయ్ ద్వారా భారత సైన్యం విజయం సాధించింది. భారీ అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి, భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధించింది. ఈ ఆలోచనను మోదీ మరింత ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారు. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ఇందుకు నిదర్శనాలు. నేడు రక్షణ రంగంలో భారత్ దిగుమతిదారుని నుంచి ఎగుమతిదారుగా మారింది.


సర్వ శిక్షా అభియాన్, స్వర్ణ చతుర్భుజి– జాతీయ రహదారుల నిర్మాణం, ప్రధాన్‌మంత్రి గ్రామ సడక్ యోజన– గ్రామీణ రహదారుల నిర్మాణం, టెలికాం సంస్కరణలు, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి సంస్కరణలను మోదీ మరింత విస్తరించారు. నేడు భారత్ ప్రపంచంలో 67 లక్షల కిలోమీటర్ల రోడ్లతో రెండో అతిపెద్ద రహదారి నెట్‌వర్క్ కలిగి ఉంది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరతో మన దేశంలో మొబైల్ డేటా లభ్యమవుతోంది. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, వాజపేయి సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ఈ నెలలో 14 రోజుల పాటు 'అటల్–మోదీ సుపరిపాలన యాత్ర'ను ఆరంభించారు. ఈ ప్రత్యేక బస్ యాత్ర ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రయాణించి, ప్రతి జిల్లాలో కూటమి నేతలతో కలిసి వాజపేయి విగ్రహావిష్కరణలు, సభలు, సమావేశాలు నిర్వహించింది. ఈ యాత్ర ద్వారా ఆధునిక భారత నిర్మాణంలో వాజపేయి చేసిన సేవలను, ఆ స్ఫూర్తితో నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో ప్రజలకు వివరించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాజపేయిని రాజకీయాల్లో 'అజాతశత్రువు'గా, దార్శనికుడిగా అభివర్ణించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ధర్మవరం నుంచి యాత్రను ప్రారంభించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి మదనపల్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్, కేంద్రమంత్రి శ్రీనివాస్‌వర్మతో పాటు అనేక ఎన్డీయే ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. డిసెంబర్ 25 వాజపేయి జన్మదినోత్సవాన, అమరావతిలో ఈ యాత్ర ముగింపు సభ జరుగనున్నది.

● విను‌షారెడ్డి
బీజేపీ అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

ఐదేళ్లలో విద్యాలక్ష్యాలు సాధించగలమా?

2015 మేలో దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో నిర్వహించిన ప్రపంచ విద్యా ఫోరంలో 'ఇంచియాన్ డిక్లరేషన్'ను రూపొందించారు. ఈ డిక్లరేషన్ ద్వారా 2030 నాటికి అందరికీ నాణ్యతతో కూడిన విద్యను అందించడంతో పాటు, జీవనపర్యంత అభ్యసన అవకాశాలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యం–4' (SDG 4)కు భారత్ సహా అన్ని ఐరాస సభ్య దేశాలు తమ ఆమోదాన్ని తెలిపాయి. ఈ లక్ష్య సాధన కేవలం విద్యారంగానికే పరిమితం కాకుండా, మానవ వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, అసమానతలను రూపుమాపడం, శాంతియుత, శక్తిమంతమైన సమాజాలను నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ SDG 4 విద్యా లక్ష్యం కింద మొత్తం పది ఉప లక్ష్యాలు ఉన్నాయి. ఇవి పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు, వృత్తిపరమైన శిక్షణ నుంచి ఉపాధ్యాయుల నాణ్యత వరకు విస్తృత పరిధిని కలిగి ఉన్నాయి.



2030 గడువుగా నిర్దేశించుకున్న ఈ లక్ష్యాల సాధనకు ఇంకా ఐదేళ్ల వ్యవధి మాత్రమే ఉంది. రాబోయే ఐదేళ్లలో భారత్ ఈ లక్ష్యాన్ని చేరుకోవడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. 'సుస్థిర అభివృద్ధి నివేదిక–2025' ప్రకారం... ఫిన్లాండ్ (87 స్కోర్‌తో మొదటి స్థానం), స్వీడన్, డెన్మార్క్ దేశాలు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. భారతదేశం (67 స్కోర్‌తో) మొదటిసారిగా తొలి 100 దేశాల శ్రేణిలోకి ప్రవేశించి, 167 దేశాల వరుసలో 99వ స్థానంలో నిలిచింది. అయినప్పటికీ మన పొరుగు దేశాలైన చైనా (49వ స్థానం), భూటాన్(74వ), నేపాల్ (85వ), శ్రీలంక (93వ) వంటి దేశాలు మనదేశం కంటే మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఇది లక్ష్య సాధనలో మన దేశం వెనుకబాటుతనాన్ని తెలియజేస్తోంది.


మన దేశంలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య పరంగా విద్యార్థుల నమోదు విషయంలో గణనీయమైన ప్రగతి ఉన్నప్పటికీ, విద్యలో నాణ్యత లేమి వేధిస్తోంది. విద్యా స్థితిగతుల వార్షిక నివేదిక–2024 (ASER) వెల్లడించిన అంశాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. గ్రామీణ భారతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో– మూడవ తరగతి విద్యార్థుల్లో కేవలం 23.4శాతం మంది మాత్రమే రెండవ తరగతి స్థాయి వచనాన్ని చదవగలుగుతున్నారు. 33.7శాతం మంది మాత్రమే తీసివేతలు చేయగలుగుతున్నారు!

UDISE 2024–25 డేటా ప్రకారం... పై తరగతులకు వెళ్లేకొద్దీ విద్యార్థుల నమోదు గణనీయంగా తగ్గిపోతోంది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యార్థుల నమోదు 98శాతంగా ఉంది. అప్పర్ ప్రైమరీ (6–8 తరగతులు) విద్యార్థుల నమోదు 90.3శాతంగా ఉండగా, సెకండరీ స్థాయి (9–10 తరగతులు) విద్యార్థుల నమోదు 78.7శాతంగా ఉంది. వీరిలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల్లోని విద్యార్థుల నమోదు మరింత తక్కువగా నమోదైంది. ఇక, వృత్తి విద్యకు సంబంధించి ఇతర దేశాలతో పోలిస్తే మన దేశ స్థానం చాలా వెనుకబడి ఉంది. CII రిపోర్ట్–2024 లెక్కలను బట్టి చూస్తే, మన దేశం విద్యపై జీడీపీలో 2.7–2.9 శాతం మాత్రమే ఖర్చు చేస్తోంది. ఇది కొఠారీ కమిషన్, NEP–2020 సిఫార్సు చేసినదాని (6శాతం) కంటే చాలా తక్కువ. స్వీడన్ (6.7–6.9శాతం), యూకే (5.3–5.6శాతం), చైనా (3.9శాతం) వంటి దేశాలు మనకంటే చాలా మెరుగ్గా ఉన్నాయి.

నిర్దేశించుకున్న విధంగా 'SDG 4' లక్ష్యాలను చేరుకోవాలంటే... ECCE కవరేజీని 100శాతానికి పెంచాలి. 'నిపుణ్ భారత్' కార్యక్రమాన్ని బలోపేతం చేయాలి. ఉపాధ్యాయ శిక్షణను మెరుగుపరచాలి. వీటితో పాటు విద్యపై జీడీపీలో కనీసం 6శాతం నిధులు ఖర్చు చేయాలి. పని ఆధారిత శిక్షణతో కూడిన వృత్తి విద్యను మాధ్యమిక, ఉన్నత స్థాయిలలో తప్పనిసరిగా అమలు చేయాలి. పరిశ్రమలతో భాగస్వామ్యం పెంచాలి. ఐటీఐలను తక్షణమే ఆధునికరించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, డిజిటల్ మౌలిక సదుపాయాలను కల్పించాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు, స్కాలర్‌షిప్స్, డిజిటల్ పరికరాల పంపిణీ ద్వారా విద్యా అంతరాలను తొలగించాలి. సెకండరీ విద్యలో డ్రాపౌట్ రేట్లను తగ్గించాలి.

ప్రస్తుత వేగంతో కొనసాగితే 2030 లక్ష్యాలు కేవలం కాగితంపైనే మిగిలిపోతాయి. భారతదేశం విద్యకు సంబంధించిన ప్రతి అంశంలోనూ అత్యవసరంగా విధాన సంస్కరణలను అమలుచేయాల్సిన అవసరం ఉంది. తూర్పు ఆసియా దేశాలు, ఫిన్లాండ్, స్వీడన్, జర్మనీ వంటి దేశాల అనుభవాల నుంచి నేర్చుకుని, భారత్ తన విద్యా వ్యవస్థను పరివర్తనం చేయాలి.

■ ఏటూరి సోమశేఖర్‌శర్మ
విశ్రాంత జిల్లా విద్యా శాఖాధికారి, ఖమ్మం






సమావేశంలో మంత్రి గొట్టిపాటి, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జూలకంటి, భాష్యం, చదలవాడ, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

వసూళ్లు.. 36.07 శాతమే

- పురాల్లో ఆస్తి పన్నులపై నిర్లక్ష్యం
- లక్ష్యాలు విధిస్తున్నా పురోగతి అంతంతే
- మున్సిపాల్టీల్లో మందకొడిగా చెల్లింపులు
- మార్చి 31 గడువు.. లక్ష్యం రూ.447.09 కోట్లు



1 నుంచి వందకి..రూ.2 వడ్డీ

మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31 లోపు చెల్లించాల్సి ఉంది. ఆ గడువు దాటితే మార్చి 31 వరకు మూడు నెలలకు రూ.100కు రూ.2 వడ్డీ విధిస్తారు. గడువు లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ వర్తించదని మున్సిపల్ అధికారులు తెలిపారు.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో ప్రగతి పనులు, సిబ్బంది జీతాల చెల్లింపులకు ఆధారం పన్నుల ఆదాయమే. అయితే పన్నులు భారీగా ఉంటున్నా వసూళ్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దీంతో నిధుల లేమితో మున్సిపాల్టీలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ఏడాది రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గడువు సమీపిస్తున్నా ఇప్పటి వరకు 36.07 శాతం పన్నులను మున్సిపల్ అధికారులు వసూలు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల్లో పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.447.09 కోట్లుగా ఉంది. అయితే ఈ పన్నులను వచ్చే మార్చి 31 కల్లా (మిగతా 7వ పేజీలో)

గుంటూరు జిల్లాలో 29.14 శాతమే

గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్నులు రూ.510.41 కోట్లు వసూ లు చేయాలి. ఇప్పటి వరకు 29.14 శాతం అంటే 148.74 కోట్లు వసూలు చేశారు. ఒక్క గుంటూరు కార్పొ రేషన్‌లోనే రూ.260.29 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇక్కడ 25.55 శాతమే వసూలు కావ డం గమనార్హం. గత ఏడాది కంటే పన్ను వసూళ్లలో వెనుకబడి ఉంది. తెనాలిలో 41.79, మంగళగిరి - తాడేపల్లిలో 62.29, పొన్నూరులో 49.01 శాతం వసూలు చేశారు.

పల్నాడులో 38.45 శాతం

పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలకు సంబంధించి ఆస్తి, నీటి పన్నులు రూ.92.21 కోట్లు వ సూలు కావాల్సి ఉంది. ఇప్పటి వర కు 38.45 శాతం అంటే రూ.35.46 కోట్లు మాత్రమే వసూలు చేశారు. 73.22 శాతం పన్నుల వసూలుతో వినుకొండ ముందు వరుసలో ఉంది. నరసరావుపేటలో 36.63 శాతం, చిలకలూరిపేటలో 32.06, సత్తెనపల్లిలో 35.92, పిడుగురాళ్లలో 48.39, మాచర్లలో 37.16, దాచేపల్లి లో 45.06, గురజాలలో 44.73 శాతం పన్ను వసూలు చేశారు.

కుడి కాల్వకు 26.63 టీఎంసీలే

- వృథా అరికట్టాలి.. పంటలను రక్షించాలి
- వరద సమయంలో నీటిని లెక్కిస్తే నష్టపోతాం
- తాగునీటి అవసరాలకు పది టీఎంసీలు కేటాయించాలి
- సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రి గొట్టిపాటి

నరసరావుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాల్వకు 132 టీఎంసీలు కేటాయించగా ఇప్పటి వరకు 105.37 టీఎంసీల నీటిని వినియోగించామని ఇక మిగిలింది 26.63 టీఎంసీలేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో సాగు నీటి వృథాను అరికట్టేందుకు జలవనరులశాఖ అధికారులు, నీటి సంఘాలు సమష్టిగా కృషి చేయాలన్నారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో మంగళ వారం జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రి మాట్లాడారు. మార్చి నెలాఖరు వరకు పంటల రక్షణకు నీటిని సరఫరా చేయాలన్నారు. డ్యాంకు వరద సమయంలో కుడి కాల్వకు విడుదల చేసిన నీటిని లెక్కిస్తే నష్టపోతామన్నారు. ఆ నీటిని పరిగణనలోకి తీసుకోకూడదని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. 10 టీఎంసీల నీటిని తాగు నీటి అవసరాలకు ఉంచాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

జలాశయంలో ఉన్న నీటి నిల్వ ఆధారంగా మరో 19 టీఎంసీలు కేటాయించాలని కేఆర్ఎంబీకి లేఖ రాయాలని అధికారులకు సూచించారు. చివరి భూములకు కూడా సక్రమంగా నీటి సరఫరా చేయాలన్నారు. పన్నులు వసూలు చేసి ఆ నిధులతో కాల్వల నిర్వహణను మెరుగుపరచాలన్నారు. ఎత్తిపోతల పథకాల సామగ్రి, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కట్టలు బలహీనంగా ఉండటంతో ఊట ద్వారా అవుతున్న వృథాను అరికట్టేందుకు వాటిని పటిష్టం చేయాలన్నారు. అచ్చంపేట ప్రాంతానికి పంటలకు నీరు అందడంలేదని సదరు డీసీ అధ్యక్షుడు తెలిపారు. క్రోసూరు మండలంలో ధ్వంసమైన ఆరు సైఫన్లను పునరుద్ధరించాలన్నారు. 85/3 మైలు నుంచి ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగు నీటి సరఫరాలో లోపాలు ఉన్నాయని, 3,000 కూసెక్కులు సరఫరా చేసి పంటలను కాపాడాలని ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి కోరారు. కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ కాల్వల్లో నీటి వృథాను అరికట్టేందుకు డిజాస్టర్ నిధులు వినియోగిస్తామన్నారు. రూ.60 లక్షలతో చేపట్టిన బుగ్గవాగు షట్టర్ల ఏర్పాటు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ అరవింద బాబు, భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కాంతారావు, జలవనరుల, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.



7

ఇదేమి చోద్యం..!

- గవర్నర్ హరిబాబుకు ఘన స్వాగతం
- రాష్ట్రస్థాయి ఖోఖోకు ఉమ్మడి జిల్లా జట్లు
- 28, 29తేదీల్లో అంపైరింగ్‌పై శిక్షణ తరగతులు

● వీసీపై విచారణకు కిందిస్థాయి అధికారి ● నిబంధనలకు నీళ్లొదిలిన వ్యవసాయశాఖ ● ఎన్‌జీ రంగా వర్సిటీలో గందరగోళం



క్రిస్మస్‌కు చర్చీల ముస్తాబు

● నేటి అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్న వేడుకలు

7

మాదక ద్రవ్య రహిత సమాజానికి కృషి

గుంటూరులో అవగాహన ర్యాలీ



7

ర్యాలీలో పాల్గొన్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, వేదికపై ఐజీ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే నసీర్ తదితరులు

టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై వైసీపీ నేత దాడి

- ఫ్లెక్సీల తొలగింపుపై కౌన్సిలర్ భర్త ఆగ్రహం
- దాడిని ఖండిస్తూ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

తెనాలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఓ ఉద్యోగిపై కౌన్సిలర్ భర్త దాడి చేసిన ఘటన మంగళవారం తెనాలిలో చోటుచేసుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వెంకట్రామయ్య మంగళవారం పట్టణంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగిస్తున్నారు. 13వ వార్డులోని సుగాలి కాలనీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించే పని చేపట్టారు. దీనిని ఆ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత భర్త కుర్రా శ్రీను స్థానిక వైసీపీ నాయకులతో అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమ ఫ్లెక్సీలను తొలగించడానికి వీలు లేదని భీష్మించారు. అయినా సిబ్బంది ఫ్లెక్సీలను తీసి వేస్తుండటంతో వైసీపీ నాయకులు అధికారులతో వాదనకు దిగారు. దీంతో టౌన్ ప్లానింగ్ ఉద్యోగి వెంకట్రామయ్య కార్యాలయానికి బయల్దేరారు. ఆ సమయంలో తనను వెంబడించి నడి రోడ్డుపై అడ్డుకుని చేతులతో కౌన్సిలర్ భర్త శ్రీను దాడి చేశాడని వెంకట్రామయ్య తోటి సిబ్బంది దగ్గర ఆవేదన వ్యక్తం చేశారు. విధులను అడ్డుకోవడమే కాకుండా దాడి చేశారని తెలిసిన ఉద్యోగులు ఆగ్రహం చెందారు. ఇలాగైతే తాము ఉద్యోగాలు చేయలేమంటూ కమిషనర్ రామ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళవారం మధ్యాహ్నం నుంచి పెన్‌డౌన్ ప్రకటించి నల్లబ్యాడ్జీలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పోలీసులు సంప్రదింపులు జరిపారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని సూచించినా సిబ్బంది శాంతించలేదు. సాయంత్రం వరకు నిరసన తెలిపి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలర్ భర్త శ్రీనుపై ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు.



కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి

నేర సమీక్షలో రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి ఆదేశాలు జారీ

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన నేర సమీక్షకు హాజరైన ఐజీ అధికారులకు పలు



మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, పెండింగులో ఉన్న కేసుల విచారణ పురోగతి, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల నివారణ చర్యలు, రౌడీషీటర్లు, ఇతర నేరస్తులపై తీసుకుంటున్న చర్యలు, గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం తదితరాలపై ఐజీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రజల ఫిర్యాదులకు సత్వర, నాణ్యమైన పరిష్కార చర్యలు చూపించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ముఖ్యమైన పది మంది రౌడీ షీటర్లను ఎంపిక చేసి, వారిపై నిఘా ఉంచి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల కేసు నమోదై వారిపై సస్పెక్టెడ్ షీట్ నమోదు చేయాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన ప్రణాళికలు రూపొందించుకుని, ఎక్కువగా ఎక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో ఆ ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, జిగ్జాగ్ లైన్లు, మొబైల్ స్టాప్ బోర్డులు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమణమూర్తి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో క్రిటికల్ కేర్ యూనిట్

- జూన్‌లోగా కేంద్రాన్ని ప్రారంభించాలి
- ప్రసూతి, నవజాతి శిశు సంరక్షణ కేంద్రం
- తెనాలి ఆస్పత్రి పరిశీలనలో కలెక్టర్ అన్సారియా

తెనాలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ప్రమాదాలు, రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో తెనాలిలో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. తెనాలి జిల్లా వైద్యశాలలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండున్నర గంటల సేపు ప్రతి విభాగాన్ని తనిఖీ చేశారు. వైద్యసేవల కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలిలో క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభిస్తే గుంటూరు ప్రభుత్వాస్పత్రిపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలకు ఆరోగ్య సమస్యలు ఉంటే తల్లికి దూరంగా నియోనేటల్ కేర్ యూనిట్‌లో పెడుతున్నారని, దీని వల్ల తల్లులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితిని దూరం చేస్తూ తల్లి, బిడ్డ ఒకే చోట ఉండేలా ప్రసూతి, నవజాతి శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేక వార్డు ఏర్పాటుకు కావాల్సిన గది, ఇతర సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణికి కొన్ని సూచనలు చేశారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాకు పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు జాప్యం లేకుండా వేగవంతం చేయాలని జూన్ నాటికి ఈ బ్లాకులో రోగులకు సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్‌ను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. పేదలకు వైద్యసేవలు అన్నీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ సంజన సింహ, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీసీహెచ్ఎస్ రంగారావు, సీనియర్ వైద్యులు జె.హనుమంతరావు, నరేంద్రసింగ్, రామానుజన్ తదితరులు ఉన్నారు.



వైద్యశాలలో గర్భిణితో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

జమాబంద్

- రెవెన్యూలో సాగని జమాబందీ
- కొన్నేళ్లుగా పట్టించుకోని ఉన్నతాధికారులు
- తహసీల్దార్ల కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లదే హవా

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖలో ఎంతో జమాబందీని కొన్నేళ్లుగా కలెక్టరేట్ అధికారులు మరిచిపోయారు. ఆర్‌వోఆర్(రికార్డు ఆఫ్ రైట్స్) నిర్వహణలో ఈ ప్రక్రియ ఎంతో కీలకమైనది. అయినప్పటికీ అధికారులు ఏ కారణం చేతనో పట్టించుకోవడం లేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సరిగా ఉండటం లేదు. కొన్ని మండలాల్లో అయితే తహసీల్దార్లకు వీటిపై ఏమాత్రం అవగాహన ఉండకపోతుండటంతో అన్ని విధాలుగా కంప్యూటర్ ఆపరేటర్లపై ఆధార పడుతున్నారు. తహసీల్దార్ల డిజిటల్ సిగ్నేచర్‌ను కూడా కంప్యూటర్ ఆపరేటర్లే నిర్వహిస్తున్నారు. ఇదే అదనుగా వారు మ్యుటేషన్లకు రూ.లక్షల్లో లంచాలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా జమాబందీని పంట కాలాల తర్వాత/ఏడాదికి ఒకసారి నిర్వహిస్తారు. ఇందుకోసం కలెక్టరేట్ నుంచి సీనియర్ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి తహసీల్దార్ కార్యాలయాలకు పంపుతారు. ఇందుకోసం డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులకు స్పెషల్ డ్యూటీలు వేసేవాళ్లు, అలానే కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కూడా కొన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల తనిఖీలకు గతంలో వెళ్లేవారు. అక్కడ అన్ని రికార్డులను వీరి పరిశీలించి ఏమైనా తప్పులు ఉంటే వాటిని సరి చేసుకోవడానికి ఆదేశాలు జారీ చేసేవారు. అంతా సవ్యంగా ఉంటే జమాబందీ జరిగినట్లుగా సర్టిఫై చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి జిల్లాలో ఏ కోశాన కనిపించడం లేదు. దీంతో భూమి వివాదాలు నానాటికి పెరిగిపోతున్నాయి. అమరావతి రాజధానిలోనూ జరీబు భూములపై వివాదం ఏర్పడింది. అదే జమాబందీ జరిగి ఉంటే ఈ వివాదం తలెత్తి ఉండేదే కాదు. ఇప్పుడున్న రెవెన్యూ అధికారులైనా జమాబందీని ఏటా సక్రమంగా నిర్వహిస్తారో, లేదో చూడాలి.

జమాబందీతో వివాదాలకు చెక్

జమాబందీ అనేది ఒక నిర్దిష్ట ప్రాంతానికి భూమి యాజమాన్యం, స్వాధీనం, సాగు, పన్నులు, చరిత్రను రికార్డుల పరంగా వివరిస్తుంది. ఇది భూమి లావాదేవీలు, వివాదాల పరిష్కారానికి చట్టపరమైన రుజువుగా పనిచేస్తుంది. జమాబందీ జరిగితే భూమికి సంబంధించి ప్రస్తుతం, పాత యజమానుల పేర్లు అందులో నిక్షిప్తమై ఉంటాయి. అలానే భూమి పరిమాణం, స్థానం, సరిహద్దులు, భూమి కేటిగిరి పొందుపరిచి ఉంటుంది. భూమి పన్ను వివరాలు, ఆదాయ చరిత్ర కూడా వివరిస్తుంది. జమాబందీ భూమి యాజమాన్యం, హక్కులను నిర్ధారిస్తుంది. అక్రమ లావాదేవీలు, భూవివాదాలను తగ్గిస్తుంది. క్లెయిమ్‌లకు నమ్మకమైన రికార్డును అందిస్తుంది.



స్టైలిష్ లుక్‌లో శంకర వరప్రసాద్

మెగాస్టార్ చిరంజీవి మాస్ అప్పీల్, అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలగలిస్తే ఎలా ఉంటుందో చూపించడానికి సిద్ధమవుతోంది 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రం. మంగళవారం ఈ చిత్రం నుంచి విడుదలైన కొత్త లుక్‌లో చిరంజీవి స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. బ్లాక్‌సూట్, వైట్ షర్ట్ ధరించి, చలువ కళ్లాద్దాలతో, చేతిలో గన్ పట్టుకొన్న చిరు లుక్ పవర్‌ఫుల్‌గా ఉంది. అలాగే వింటేజ్ చిరూను గుర్తుకు తెస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదలవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. చిరంజీవి, వెంకటేశ్‌లపై చిత్రీకరించిన ప్రత్యేకగీతాన్ని త్వరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార కథానాయిక. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో

ఈసారి హిట్‌కొడతాం

- ఆది సాయికుమార్



"శంబాల' సినిమాతో ఈసారి మేము మంచి విజయాన్ని అందుకోబోతున్నామనే నమ్మకం నాకుంది. అందుకే పోటీ ఎక్కువ ఉన్నా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం' అని అన్నారు ఆది సాయికుమార్. ఆయన కథానాయకుడిగా నటించిన 'శంబాల' విడుదల సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. 'ఈ చిత్రంలో అద్భుతమైన పోరాట సన్నివేశాలున్నాయి. క్లైమాక్స్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. 80వ దశకంలో వచ్చే కథ కాబట్టి పాత్రల వస్త్రధారణల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. శ్రీ చరణ్ పాకాల ఆర్‌ఆర్ చూసి ఆశ్చర్యపోయాం. ఆయన ఎక్కడ కూడా సంతృప్తి చెందరు. ప్రతీ ఒక్క పాత్రకు అద్భుతమైన థీమ్ సెట్ చేశారు' అని చెప్పారు.

కథ వినగానే షాక్‌కి గురయ్యా

- అఖిల్ రాజ్



"ఈషా' కథ వినగానే ఒక్కసారిగా షాక్‌కి గురయ్యాను. హారర్ చిత్రాలు చూసేవారికి తప్పనిసరిగా కొత్త అనుభూతిని ఇస్తుంది' అని అన్నారు హీరో అఖిల్ రాజ్. ఆయన కథానాయకుడిగా శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా అఖిల్ రాజ్ మీడియాతో ముచ్చటించారు. 'కథ చెప్పినప్పుడు అందరితోపాటు నేనూ ఉలిక్కి పడ్డాను. ట్రైలర్ చూసినప్పుడు కూడా అదే ఫీలింగ్. సౌండ్ డిజైనింగ్ భయంకరంగా ఉంటుంది. ఈ సినిమాలో వినయ్ అనే పాత్రలో నటించాను. సినిమా పట్ల క్లారిటీ ఉన్న దర్శకుడు మన్నె శ్రీనివాస్. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ విషయంలో ఆయన చాలా స్ట్రాంగ్. ఈ సినిమా తప్పకుండా విజయవంతం అవుతుందన్న నమ్మకం నాకుంది' అని ఆయన చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



కలరిపయట్టు నేర్చుకున్న మహేశ్ బాబు

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'వారణాసి' చిత్రం నుంచి రోజుకో ఆసక్తికరమైన అప్డేట్ వెలువడుతోంది. ఈ సినిమాలో మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం మహేశ్‌బాబు యుద్ధ విద్య కలరిపయట్టు నేర్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శిక్షకుడు హరికృష్ణ ఈ విద్యలో మహేశ్ బాబుకు శిక్షణ ఇచ్చారు. ఈ విషయాన్ని హరికృష్ణ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'నేను గత సంవత్సరం మహేశ్ సర్‌కు శిక్షణ ఇచ్చాను. కానీ, సమయం వచ్చే వరకూ ఈ విషయాన్ని బయటపెట్టొదని చిత్రబృందం కోరింది. అందుకే ఇప్పటి వరకూ వెల్లడించలేదు. వారణాసి షూటింగ్‌కి వెళ్లే ముందే మహేశ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నారు. కలరిపయట్టు అందులో భాగమే' అని తెలిపారు.

డ్రెస్సింగ్ సెన్స్ పాటించాలి

నటుడు శివాజీ అభ్యంతరకర వ్యాఖ్యలు

- ఆ వ్యాఖ్యలపై పలువురు ప్రముఖుల ఆగ్రహం
- వాయిస్ ఆఫ్ విమెన్ పేరిట 'మా'లో ఫిర్యాదు
- సామాన్యుల నుంచి కూడా తీవ్ర విమర్శలు
- శివాజీపై సీరియస్ అయిన మహిళా కమిషన్
- 27న ఉదయం విచారణకు రావాలని ఆదేశం

క్షమాపణలు చెబుతూ 'ఎక్స్'లో శివాజీ పోస్టు







'దండోరా' చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో.. హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వాడిన పదాల్లో రెండు అభ్యంతకరమైన పదాలపై తెలుగు రాష్ట్రాల్లో దుమారం రేగింది. సినీ తారలు, నెటిజన్లు ఆయన తీరుని తప్పుపట్టారు. దీంతో.. ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోపే శివాజీ క్షమాపణలు తెలిపారు. 'దండోరా' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడిన నటుడు శివాజీ.. హీరోయిన్ల అందం వారు ధరించే దుస్తుల్లోనే ఉంటుందన్నారు. 'హీరోయిన్లు కొంచెం డ్రెస్సింగ్ సెన్స్‌ను పాటిస్తే బాగుంటుంది. ఇలా చెబుతున్నందుకు ఏమనుకోవద్దు. కానీ ప్రతీ దానికీ ఓ హద్దు ఉంటుంది. గ్లామర్ అనేది ఒక దశ వరకే ఉండాలి. స్వేచ్ఛ అనేది అదృష్టం. దాన్ని కోల్పోవద్దు' అన్నారు. ఆయన తీరుపై పలువురు సినీ ప్రముఖులతో పాటు సామాన్యులు సైతం సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గాయని చిన్మయి శ్రీపాద స్పందిస్తూ.. 'హీరోయిన్ల వస్త్రధారణపై శివాజీ ఇలా అసభ్యకరమైన పదజాలంతో నోరుపారేసుకోవడం చాలా విచారకరం. ముందుగా ఆయన తన వస్త్రధారణపై దృష్టిపెట్టాలి. ఇలా ఆయన జీన్స్, హుడీ ధరించి ఉచిత లెక్చర్లు ఇచ్చే ముందు.. ధోవతి కట్టుకుని భారతీయ సంప్రదాయాల్ని అనుసరించాలి కదా. ఒకవేళ ఆయనకు వివాహం అయ్యుంటే బొట్టు, మెట్టెలు కూడా పెట్టుకోవాలి' అని విమర్శించారు. 'మా శరీరం. మా ఇష్టం. మీది కాదు' అని నటి, యాంకర్ అనసూయ ఎక్స్ వేదికగా శివాజీ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శివాజీ పేరు ప్రస్తావించకుండా నటుడు మంచు మనోజ్, ఆయన తరపున మహిళలందరికీ క్షమాపణలు తెలిపారు. 'హీరోయిన్ల దుస్తులపై ఓ నటుడు ఇలా మాట్లాడడం నిరాశకు గురిచేసింది. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే. మహిళలను అందరూ గౌరవించాలి. మహిళలను అగౌరవపరిచేలా ఆ నటుడు చేసిన వ్యాఖ్యలకు నేను క్షమాపణలు చెబుతున్నా' అని ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఇలాంటి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని.. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, నటుడు నవదీప్ పోస్టు పెట్టారు. శివాజీపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)లో ఫిర్యాదు నమోదైంది. 'వాయిస్ ఆఫ్ విమెన్' పేరిట.. నిర్మాతలు స్వప్న దత్, సుప్రియ యార్లగడ్డ, నటి లక్ష్మి మంచు, దర్శకురాలు నందినీ రెడ్డి, యాంకర్ ఝాన్సీ ఆయనపై ఫిర్యాదు చేశారు. శివాజీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని లేదంటే చట్టప్రకారం ముందుకెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

చర్యలు తీసుకుంటాం..

శివాజీ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ఈ నెల 27న ఉదయం11 గంటలకు తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. 'ఆయన మాట్లాడిన మాటలను.. మహిళా కమిషన్ లీగల్ టీమ్ పరిశీలిస్తుంది. ఆ వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటాం' అని కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. ఎవరైనా స్త్రీలపై అసభ్యకరమైన రీతిలో మాట్లాడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కాగా.. తన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో శివాజీ క్షమాపణలు చెప్పారు. "ఇటీవల షాపింగ్స్ మాల్స్ దగ్గర జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని హీరోయిన్ల భద్రతపై అలా మాట్లాడాను. నేను మాట్లాడింది అమ్మాయిలందరినీ ఉద్దేశించి కాదు. హీరోయిన్స్ బయటకు వెళ్లినప్పుడు దుస్తులు జాగ్రత్తగా ఉంటే ఇబ్బందులు ఉండవనే ఉద్దేశం తప్ప ఎవర్నీ అవమానపరచాలని కాదు. మంచి మాటలు చెప్పే ఉద్దేశంలో పొరపాటుగా రెండు అసభ్య పదాలను వాడాను. ఎదుటివారికి అలాంటి అవకాశం ఇవ్వొద్దని చెప్పేందుకే ఊరు భాష మాట్లాడాను. అది చాలా తప్పు. ఆ రెండు పదాలూ దొర్లకుండా ఉంటే ఈరోజు ఈ పరిస్థితి లేదు. మంచి చెప్పాలనే ఉద్దేశం తప్ప అవమానపరచాలి అనే ఉద్దేశం నాకు లేదు. నా మాటల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బ తిని ఉంటే మన్నించండి. పరిశ్రమలోని మహిళలకు మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాను. నాకు మహిళలంటే ఎంతో గౌరవం ఉంది. స్త్రీని మహాశక్తిగా, అమ్మవారిలాగే భావిస్తాను' అని ఆయన ఎక్స్‌లో ఓ వీడియో పెట్టారు. 'శివాజీ క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం ఇంతటితో ముగిసిందని అసోసియేషన్ భావిస్తోంది' అని మా అధ్యక్షుడు మంచు విష్ణు పేర్కొన్నారు.

బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

● రాయబారిగా ప్రకాష్‌రాజ్



నటుడు ప్రకాష్ రాజ్‌ను 17వ బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవ రాయబారిగా ఎంపిక చేసినట్లు సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. విధానసౌధలో చలనచిత్రోత్సవాల సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, వచ్చే ఏడాది జనవరి 29 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ దాకా చలనచిత్రోత్సవాలను నిర్వహిస్తామని ప్రకటించారు. చిత్రోత్సవ కమిటీ నిర్ణయించినట్లుగా ప్రకాష్‌రాజ్‌ను రాయబారిగా నిర్ణయించామని తెలిపారు. చిత్రోత్సవంలో 60 దేశాలకు సంబంధించిన 400 సినిమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

బెంగళూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

క్రిస్మస్‌కు విడుదల

ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే హంగులతో రూపుదిద్దుకున్న యానిమేషన్ చిత్రం 'మిషన్ శాంటా'. క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది. 'కళ్లు చెదిరే యానిమేషన్ క్వాలిటీ, మనసును తాకే ఎమోషన్స్, ఉత్కంఠ రేకెత్తించే అడ్వెంచర్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. వేగంగా సాగే కథనం, ధైర్య సాహసాలతో కూడిన పాత్రలు ప్రేక్షకులకు వెండితెరపై సరికొత్త అనుభూతిని ఇస్తాయ'ని నిర్మాణ సంస్థలు బ్రాడ్ విజన్ ఇండియా, స్టూడియో 56 తెలిపాయి.





ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు

పార్థ గోపాల్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'డైమండ్ డెకాయిట్'. మేఘన కథానాయిక. సూర్య జీ యాదవ్ దర్శకుడు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పార్థ గోపాల్ మాట్లాడుతూ 'ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఈ చిత్రాన్ని నిర్మించాం. ఇదొక ఎమోషనల్ రివెంజ్ డ్రామా. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని తెలిపారు. అద్భుతమైన లొకేషన్లలో తెరకెక్కించాం, పాటలు నేపథ్య సంగీతం మా సినిమాకు ప్రధానాకర్షణ అని సూర్య జి. యాదవ్ చెప్పారు. సంగీతం: పెద్దపల్లి రోహిత్

గవర్నర్ హరిబాబుకు ఘన స్వాగతం



ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

పొన్నూరు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు ఘన స్వాగతం లభించింది. మంగళవారం పట్టణంలోని నిడుబ్రోలులో బంధువుల ఇంటికి గవర్నర్ విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ హరిబాబును తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, అర్బన్ సీఐ ఎల్ వీరా నాయక్, ఎంపీడీవో జి.చంద్రశేఖర్, తదితర అధికారులు, నిడుబ్రోలు వాసులు సాదర స్వాగతం పలికి ఆహ్వానించారు.

28, 29 తేదీల్లో అంపైరింగ్‌పై శిక్షణ తరగతులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 28, 29వ తేదీలలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ స్టేట్ ప్యానల్ పరీక్షకు అంపైరింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు వి.మనోజ్ సాయి, యూ.మహతి శంకర్, బి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టులో ఆడినవారు 1985లో, ఆడని వారు 1990లో పుట్టినవారు ఈ శిక్షణకు అర్హులన్నారు. క్రికెట్‌పై అవగాహన, ఇంగ్లీష్‌పై ప్రావీణ్యం ఉండాలన్నారు. పేర్లు నమోదుకు ఈ నెల 27 సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉందన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9912069152 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

మాదకద్రవ్య రహిత సమాజానికి కృషి

● ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న వర్ల రామయ్య, పక్కన ఐజీ త్రిపాఠి, ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎమ్మెల్యే నసీర్, ఎస్పీ వకుల్ జిందాల్, మేయర్ రవీంద్ర తదితరులు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి చేద్దామని పోలీసు ఉన్నతాధికా రులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో భారీ అవ గాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా మహాత్మా గాంధీ పార్క్ వద్ద డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ పార్క్ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రేంజ్ ఐజీ ఎస్ఎస్ త్రిపాఠి మాట్లాడుతూ, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ, ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ, యువశక్తి సమృద్ధిగా ఉన్న భారతదేశాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో శత్రు దేశాలు నార్కోటిక్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మాదకద్రవ్యాలను కూకటి వేళ్లతో పెకిలించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలను కేవలం అవగాహనతోనే నిర్మూలించగలమన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్ల రామయ్య మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో డ్రగ్స్‌ను మూలాల తో సహా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టంగా చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ శ్రీ నగేష్, మేయర్ కోవెలమూడి నాని, ఐడీసీ ఛైర్మన్ ప్రభాకర్, దాసరి రాజామాష్టారు, డిప్యూటీ మేయర్ సజీల, టీడీపీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఖోఖోకు ఉమ్మడి జిల్లా జట్లు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల జట్టు

నకరికల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖోఖో చాంపి యన్ షిప్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల, స్త్రీల జట్లు పాల్గొంటున్న ట్టు అసోసియేషన్ కార్యదర్శి చింతా పుల్లయ్య తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు కృష్ణాజిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23 వరకు ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో శిక్షణ ఇచ్చారు. క్రీడాకారులకు క్రీడాదుస్తులను పాపాబత్తుల దానియేలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు వి.వీరభద్రా రెడ్డి, ట్రెజరర్ ఝాన్సీరాణి, టి.రావు కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.వెంకయ్య, ఎం వీరయ్య, పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి

● రైతు జేఏసీ నేతలతో బీజేపీ నేతల సమావేశం



తుళ్లూరులో రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు జేఏసీ, బీజేపీ నేతలు

తుళ్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబరు 25న రాష్ట్ర రాజధాని అమరావతి పరిధి వెంకటపాలెంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు వెంకటపాలెం రెవెన్యూలో ఆవిష్కరణ అనంతరం జరిగే బహిరంగ సభకు అధికారులు, కూటమి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు సంబంధించి మంగళవారం మండల కేంద్రం తుళ్లూరులో రైతు జేఏసీ నేతలతో బీజేపీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి జయప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, మండల అధ్యక్షుడు నీరుకొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకుడు కోళ్లమూడి హేమసుందర్, జిల్లా నాయకుడు మార్త నరేంద్రబాబు, జేఏసీ నేతలు జమ్ముల శ్యాంకిషోర్, లంకాసుధాకర్, కొమ్మినేని సత్యనారాయణ, బెల్లంకొండ నరసింహరావు, గద్దె బుచ్చి తరుపతి రావు, జోజాల చలపతిరావు, ధనేకుల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చీల ముస్తాబు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు నగరంలోని ప్రధాన చర్చీలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఇప్పటికే నగరంలోని డాన్ బాస్కో చర్చి, ఈస్ట్, వెస్ట్, నాత్ ప్యారిష్ చర్చీలతో పాటు ప్రధాన ప్రాంతాల్లోని చర్చీలను వైభవంగా అలంకరించారు. క్రిస్మస్ వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆయా చర్చీల్లో ఏర్పాట్లు చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి చర్చీలలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం కానున్నాయి.



విద్యుత్ వెలుగుల్లో బిషప్ హౌస్



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన డాన్ బాస్కో చర్చి



బాల ఏసు జననం అలంకరణ

ఇదేమి చోద్యం..!

● వీసీపై విచారణకు కిందిస్థాయి అధికారి ● నిబంధనలకు నీళ్లొదిలిన వ్యవసాయశాఖ ● ఎన్జీ రంగా వర్సిటీలో గందరగోళం

గుంటూరు సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విషయంలో వ్యవసాయ శాఖ నిబంధనలకు నీళ్లొదిలేసింది. వీసీపై విచారణకు ఆయన కంటే తక్కువ స్థాయి అధికారిని నియమించి అభాసుపాలయింది. రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాల నేపథ్యంలో యూనివర్సిటీపై వచ్చిన ఆరోపణల గురించి నిజానిజాలు తేల్చేందుకు మహిళా అధికారి సోమవారం లాం ఫాం వచ్చారు. అయితే తూతూ మంత్రంగా విచారణ ముగించేందుకు చేసిన ప్రయత్నానికి సీనియర్ ప్రొఫెసర్ గండి కొట్టారు.

● మీకు ఆ స్థాయి లేదు...

వీసీ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సీనియర్ ప్రొఫెసర్ శ్యాం రాజ్ నాయక్ 22వ తేదీన అందుబాటులో ఉండాలని విచారణాధికారి నోటీసులు పంపారు. ఆ నోటీసులపై స్పందించిన సీనియర్ ప్రొఫెసర్ శ్యాం రాజ్ నాయక్ అసలు ఈ విషయాలను విచారించే అర్హత ఆ అధికారికి లేదని లేఖ రాసినట్లు తెలిసింది. వీసీ స్థాయి అధికారిని విచారించేందుకు ఆ పదవి కంటే తక్కువ స్థాయి అధికారిని నియమించటం నిబంధనలకు విరుద్ధమని అందులో పేర్కొన్నారు. ఈ పరిణామంతో కంగుతిన్న విచారణాధికారి కేవలం రిజిస్ట్రార్‌తో మాట్లాడి వెళ్లిపోయారు. కాగా, ఎన్జీ రంగా వర్సిటీ ఇంచార్జి వీసీగా నియమితులైన శారద జయలక్ష్మిపై లెక్కకు మించిన ఫిర్యాదులు ఉన్నాయి. అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్న ఆమెను కాపాడేందుకు వ్యవసాయశాఖ రాష్ట్రస్థాయి కీలక అధికారి ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్సిటీ అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని సుప్రీంకోర్టు న్యాయవాది కూడా ప్రధాన మంత్రి, గవర్నర్‌కు రెండోసారి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బీటెక్ పరీక్షా ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీటెక్ రీవాల్యుయేషన్ పరీక్ష ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. ఫలితాల కోసం ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందు పరిచామన్నారు.

సురేష్ కుమార్‌కు అంతర్జాతీయ అవార్డు



వీసీ గంగాధరరావుకు అవార్డును చూపిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్

ఏఎన్‌యూ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, న్యాయ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య మధుపల్లి సురేష్ కుమార్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. అనువాదం, టెక్నాలజీ ఆఫ్ ట్రాన్స్‌లేషన్‌లో ఆయన చేసిన పరిశోధనలు, సాహిత్య కృషికి గాను బ్యాంకాక్‌లోని రాజభక్తి రాజన గేంద్ర విశ్వవిద్యాలయం ఇండో-థాయ్ చాన్స్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందించింది. ఈ సందర్భంగా మంగళవారం ఏఎన్‌యూ వీసీ ఛాంబర్‌లో సురేష్ కుమార్ వీసీ గంగాధర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి తాను అందుకున్న అవార్డును చూపించారు. ఈ సందర్భంగా ఇంచార్జి రెక్టార్ ప్రొ.శివరాంప్రసాద్, ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొ.సింహాచలం, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు. కాగా, ఇండియన్ కౌన్సిల్ సోషియల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సురేష్ కుమార్, సహాయ ఇన్వెస్టిగేటర్ పి.త్రిమూర్తి రావు ఎంపికయ్యారు.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	58,244
అమ్మకాలు	55,787
నిల్వ	12,631

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15200
273	11500	14000
341	11000	17000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17200
దేవనూరు డీలక్స్	11000	17500
ఆర్మూరు	10000	12700
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16800
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16500
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7700

దక్షిణ భారత యువజనోత్సవంలో ఏఎన్‌యూ సత్తా

● పలు విభాగాల్లో బహుమతులు పొందిన వర్సిటీ విద్యార్థులు



చెన్నైలో జరిగిన యువజనోత్సవంలో ప్రదర్శన ఇస్తున్న ఏఎన్‌యూ విద్యార్థులు

ఏఎన్‌యూ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల యువజనోత్సవం పోటీలలో ఏఎన్‌యూ విద్యార్థులు ప్రతి భను కనబరిచి విజేత లుగా నిలిచారని యువజనోత్సవం సమన్వయకర్త ఆచార్య మురళీమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైలోని హిందుస్థాన్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగిన 39వ యువజనోత్సవాలలో ఫోక్, గిరిజన నృత్యంతో పా టు క్రియేటివ్ కొరియోగ్రఫీ, కలోజ్ పోటీలలో బహుమతులు సాధించారని వెల్లడించారు. థియేటర్ అంశాల పోటీలలో రన్నరప్‌గా నిలిచారన్నారు. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తదితరులు బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వసూళ్లు.. 36.07 శాతం

(5వ పేజీ తరువాయి)

వసూలు చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. గడువు సమీపిస్తు న్నా లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగడంలేదు. ఇళ్లు, ఖాళీ స్థలాలతో పా టు నీటి పన్ను బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. నెలవారీ లక్ష్యాలను ఇస్తూ.. వారంవారం మున్సిపల్ పరిపాలనా విభాగం ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా పన్ను వసూళ్లలో పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని పురాల అధికారులను ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా ఫలితం ఉండటంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వ సంస్థలు, కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు భారీగా ఉన్నాయి.

పన్నుల ఆదాయమే దిక్కు

మూడు జిల్లాల పరిధిలోని ఐదు మున్సిపాల్టీలకు పన్నుల ఆదాయమే దిక్కుగా ఉంది. నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపాల్టీలకు కౌన్సిల్ ఎన్నికలు జరగలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను మూడు విడతలుగా నిలిపేసింది. నిధుల లేమితో ఆయా మున్సిపాల్టీలు ఆర్థిక సంక్షోభం నెలకొంది. పన్నులు వసూలు చేసుకుంటేనే జీతాలు కూడా చెల్లించే పరిస్థితి. పన్నుల ఆదాయంపై ఆధారపడి ప్రగతి పనులు చేపట్టాలి. దీంతో ఆర్థిక సమస్యలతో ఆయా పురపాలక సంఘాలు కొట్టుమిట్టాడుతున్నాయి.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

10కే వాక్‌ను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య కోసం నడక... గుంటూరు కోసం నడక పేరుతో జనవరి 25న 10కే వాక్‌ను నగర ప్రజలు సమష్టిగా విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు మంగళవారం విద్యానగర్లోని ఇండియన్ స్ప్రింగ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వయోభేదం లేకుండా 15 నుంచి 60 సంవత్సరాల వరకు మొత్తం ఐదు విభాగాల్లో 10 కే వాక్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొన్న వారికి విభాగాల వారీగా బహుమతులు ఇవ్వడంతో పాటు గిఫ్టు ఓచర్లు అందజేస్తామని వివరించారు. సమావేశంలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు, ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, దక్షిణ సంస్థల చైర్మన్ డాక్టర్ టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.


మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో వార్డుల వారీగా తాగునీటి సరఫరాపై ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడైనా పూర్తి స్థాయిలో సరఫరా కాకుంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కృష్ణబాబు కాలనీ, కేవీపీ కాలనీ, కోదండరామయ్య నగర్, పట్టాభిపురం ప్రాంతాల్లో మంగళవారం ఆయన తాగునీటి సరఫరా, పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ కృష్ణబాబు కాలనీ నుంచి తాగు నీటి సరఫరాపై పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించి, ఫిర్యాదుదారులతో వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ ఏమైనా పైప్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపిన అనంతరం పునరుద్ధరణకు ఎక్కువ సమయం పడు తుందని అధికారులు తెలుపుతున్నారని, కాని సరఫరాలో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే కృష్ణబాబు కాలనీలోని అన్ని డ్రెయిన్లలో మంగళవారం మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో డీసీపీ సూరజ్ కుమార్, బయాలజిస్ట్ రాజు నాయక్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవన్‌ప్రమాణ పత్రాలను సమర్పించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులు 1 జనవరి 2026 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా జీవన ప్రమాణ పత్రాలను ఆయా సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో అందించాలని జిల్లా ఖజానా శాఖ అధికారి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన ప్రమాణ పత్రాలను మాన్యువల్, జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో కానీ, పోస్టాఫీసులలోనూ, మీసేవ కేంద్రాల్లోనూ జనవరి 1వ తేదీ నుంచి సమర్పించవచ్చన్నారు. పత్రాలను సమర్పించేందుకు ట్రెజరీ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఘనంగా నరెడ్కో డైరీ ఆవిష్కరణ

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో నరెడ్కో డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎస్టీ స్పెషల్ కమిషనర్ నూతలపాటి సౌమ్య హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ రంగంలో జీఎస్టీకి సంబంధించిన అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ముందుకు సాగితే నిర్మాణ రంగం మరింత బలప డుతుందని అన్నారు. కార్యక్రమంలో నరెడ్కో స్టేట్ సెక్రటరీ మామిడి సీతారామయ్య, గౌరవ అధ్యక్షుడు నాగవంశీ , నరెడ్కో క్యాపిటల్ జోన్ అధ్యక్షుడు కేసీహెచ్ అంకారావు, వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీనాథ్, సెక్రటరీ శ్రీనివాస్ మాదాల, ట్రెజరర్ కేసీహెచ్ తిరుపతయ్య, వ్యవస్థాపక సభ్యులు గద్దె తిరుపతిరావు, చుక్కపల్లి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

రైతు జన బాంధవుడు చౌదరి చరణ్ సింగ్

● రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ

● అట్టహాసంగా ముగిసిన నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్

గుంటూరు (విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమీందారీ వ్యవస్థ రద్దులో కీలక పాత్ర పోషించి, భారత రాజకీయాల్లో రైతుల పక్షాన ధైర్యంగా నిలిచిన గొప్ప నాయకుడు భారతదేశ మాజీ ప్రధాని దివంగత చౌదరి చరణ్ సింగ్ అని రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎస్‌టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో రెండు రోజులుగా జరుగుతున్న నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తన రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత పదవులను కూడా తృణప్రాయంగా వదిలేసిన ధీరుడు చౌదరి చరణ్ సింగ్ అని కొనియాడారు. రైతు బాంధవుడైన ఆయన సేవలకు గుర్తింపుగా డిసెంబరు 23న ఆయన జయంతి రోజున జాతీయ వ్యవసాయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతు ప్రదర్శనలకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ఇందిరా గాంధీ టెక్నికల్ యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ ఎస్.రాంనారాయణరెడ్డి, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ఎన్‌ఐటీబీఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్‌రావు, సీఈఓ డాక్టర్ ఆర్.హఫీజ్ బాషా, డాక్టర్ సజ్జా రాధిక, డాక్టర్ శోభా తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ తదితరులు

జనవరి 15కి అన్ని కార్యాలయాల్లో ఈ-ఆఫీసు

● కలెక్టర్ తమీమ్ ఆదేశాలు


కలెక్టరేట్‌లో ఈ-ఆఫీసు అమలుపై జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనవరి 15 నాటికి గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారానికి ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆమె మంగళవారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, హౌసింగ్, ఉపాధి హామీ పథకం, తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతా ఈ-ఆఫీసులోనే ఉత్తర, ప్రత్యుత్తరాలు జరగాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల అమ్మకాల కోసం జనవరి 3 నుంచి 15 వరకు గుంటూరులో నిర్వహిస్తున్న సారస్- 2026 ఎగ్జిబిషన్‌పై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని సూచించారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రవేశ పెట్టిన 100 రోజుల ప్రణాళికను ఖచ్చితంగా అమలు జరిగేలా పాఠశాలలకు నియమించిన నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లాలో మద్దతు ధర కు ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధి కారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, సీపీఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడీ శంకర్, జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులు నూరుశాతం వినియోగించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు (సీఎస్సార్) ద్వారా మంజూరు చేసిన నిధులు నూరుశాతం నిర్ధేశించిన కాలపరిమితిలో వినియోగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో వీసీ సమావేశ మందిరంలో మంగళవారం సీఎస్సార్ ద్వారా మంజూరు చేసిన నిధులు వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన నిధులు, వాటిలో వినియోగించిన నిధులు, మిగిలిన నిధుల వినియోగానికి కార్యాచరణ ప్రణాళికను సోమవారం నాటికి పూర్తిస్థాయి నివేదిక విభాగాధిపతులు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ పద్మావతి, డీఈవో సలీంబాషా, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు కలర్ ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా అందజేత

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పోలింగ్ బూత్ లెవల్ అధికారులకు(బీఎల్ఓ) కలర్ ఫొటోలతో కూడిన ఓటర్ల జాబిత ప్రతులను అందజేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌కి మంగళవారం పలువురు బీఎల్‌వోలను పిలిపించి ఈ ఓటర్ల జాబితాలను అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సదుపాయాన్ని ప్రారంభిస్తోన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

రైలు ప్రయాణీకులకు సౌకర్యవంతమైన విశ్రాంతి

● గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణీకులకు సౌకర్యవంతమైన విశ్రాంతి కల్పించడానికి గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రప్రథమంగా స్లీపింగ్ పాడ్స్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని డీఆర్ఎం సుధేష్ణసేన్ అన్నారు. రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాం వైపున ఈ సదుపాయాన్ని మంగళవారం లాంఛనంగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ఉచిత వైఫై, వేడి నీళ్ల, స్నాక్స్ బార్, ట్రావెల్ డెస్కు, టాయిలెట్స్, లాకర్ వంటి సౌకర్యాలను విశ్రాంతి తీసుకొనే ప్రయాణీకులు పొందవచ్చన్నారు. ఈ స్లీపింగ్ పాడ్స్ వలన ఏటా రైల్వేకు రూ.21 లక్షల ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఎయిర్ కండీషనింగ్ సదుపాయం కలిగిన స్లీపింగ్ పాడ్స్‌ని ప్రయాణీకులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, ఏసీఎం వినయ్‌కాంత్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై అశ్రద్ధ చూపుతున్న ప్రభుత్వాలు

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయం రంగంపై అశ్రద్ధ చూపుతూ ఆదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూరుస్తున్నాయని పార్లమెంట్ మాజీ సభ్యుడు, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న చౌదరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతాంగం సమస్యలు - పరిష్కారాలపై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రైతు ఉద్యమ నేత, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రసంగిస్తూ ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా లభించేటట్లు వ్యవసాయ ఉత్పత్తుల ధరలను నిర్ణయించాలని నివేదిక అందిస్తే మోదీ ప్రభుత్వం ఆ నివేదికను అమలు చేస్తామని పేర్కొని ఆచరణలో అమలు చేయటం లేదన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ భారత దేశ వ్యవసాయ భూమిలో సగం భూమికి నీటిపారుదల సౌకర్యాలు లేవని తద్వారా వ్యవసాయ రంగ ఉత్పాదకత చాలా అల్పంగా ఉందన్నారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్ ప్రసంగిస్తూ దేశంలో వ్యవసాయ రంగంలో పరిశోధనలకు సరైన ప్రోత్సాహకాలు, నిధులు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి, మానవత కార్యదర్శి కె.సతీష్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత సీహెచ్ పరమేశ్వరరెడ్డి, రైతు సంఘ నాయకులు కొల్లి రంగారెడ్డి, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లాభక్షు, జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి పాల్గొని ప్రసంగించారు.


ప్రసంగిస్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

పండుగలా వాజ్‌పేయి విగ్రహావిష్కరణ : దేవానంద్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈనెల 25న జరిగే మాజీ ప్రధాని వాజ్‌పేయి 12 అడుగుల విగ్రహావిష్కరణ పండుగలా నిర్వహించబోతున్నట్టు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్ అన్నారు. స్థానిక చంద్రమౌళినగర్‌లో బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఇతర మంత్రులు పాల్గొంటారని వివరించారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న తొలి విగ్రహం వాజ్‌పేయిదే అవ్వడంలో ఆనందంగా ఉందన్నారు. మరో ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాజకీయ జీవితంలో ఒక్క అవినీతి మకిలీ, ఒక్క శత్రువు లేకుండా గడిపిన వాజ్‌పేయి జీవితం అందరికి ఆదర్శనీయమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, దర్శనపు శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, భజరంగ్ రామకృష్ణ, అంబేద్కర్ పాల్గొన్నారు.

సౌత్ జోన్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులో ఈనెల 25 నుంచి జరిగే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల టెన్నిస్ పోటీలకు ఏపీ నుంచి జి.బాల మనోజ్ కుమార్, డి.అభిరామ్ ఎంపికైనట్టు ఎన్టీఆర్ స్టేడియం టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాదు తెలిపారు. అంతర్ విశ్వ విద్యాలయాలకు పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారులను పీడీ రామచంద్రరావు, డీఎస్‌డీవో ఆఫ్రోజ్‌ఖాన్, రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాస్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

పున్నమ్మ చెరువును కబ్జాదారుల నుంచి రక్షించండి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 120 ఏళ్ల చరిత్ర కలిగిన తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఉన్న పున్నమ్మ చెరువును కబ్జాదారుల నుంచి రక్షించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావును విశ్రాంత పోలీస్ అధికారి ఐ.పోలరాజు, దళిత సంఘ నాయకుడు సీహెచ్ సాంబయ్య కోరారు. ఇన్నర్ రింగురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం పిల్లి మాణిక్యరావును వారు కలిసి సమస్యను వివరించారు. పున్నమ్మ చెరువును కొందరు వ్యక్తులు ఆక్రమించి రియల్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూలికపూడి శివయ్య పాల్గొన్నారు

గంజాయి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

● 1200 గ్రాములు స్వాధీనం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లాల్‌పురం రోడ్డులో గంజాయి విక్రయిస్తోన్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 1200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ నిందితుల వివరాలు వెల్లడించారు. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీఐపీ రోడ్ నుంచి లాలుపురం వెళ్లే డొంక మధ్యలో, శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి గుడి ప్రక్కన ఉన్న ఖాళీ స్థలం వద్ద గంజాయి కార్యకలాపాలు జరుగుతున్నాయని సీఐ సత్యనారాయణకి అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి నిర్వహించి అక్కడ ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారిని విచారించి వారి వద్ద ఉన్న 1200 గ్రాముల గంజాయిని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కి తరలించినట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు. మరికొంత మంది నిందితులను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. చంద్రావలి, దేవానంద్‌లు బీహార్ రాష్ట్రానికి చెందినవారని, జీవనోపాధి నిమిత్తం గుంటూరుకు వచ్చి కేవీపీ కాలనీలో నివసిస్తూ, మిర్చి యార్డులో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వారికి గుంటూరుకు చెందిన వల్లెపు హరికృష్ణ పరిచయం అయ్యాడన్నారు. చంద్రావలి బీహార్ నుంచి గుంటూరుకు వచ్చేటప్పుడు గంజాయిని తీసుకురాగా ముగ్గురు కలిసి విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకునేవారన్నారు. కేసు దర్యాప్తులో పాల్గొన్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రసన్న కుమార్, హెడ్ కానిస్టేబుళ్ల ప్రసాద్ బాబు, ఎం. దాసు, కానిస్టేబుళ్ల ఎస్.శ్రీనివాస్, ఉదయ్, పి.గంగరాజుని వెస్ట్ డీఎస్పీ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, పక్కన సీఐ సత్యనారాయణ, వెనుక నిందితులు

ముగ్గురు వ్యభిచార నిర్వాహకులు...

నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంకట రమణ కాలనీ 4వ లైన్ ప్రాంతంలో వ్యభిచారం జరుగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు నగరంపాలెం సీఐ సత్యనారాయణ దాడి చేసి, వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న ఒక ఆర్గనైజర్‌తో పాటు ఒక మహిళ, ఒక పురుషుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బైక్ ర్యాలీలను జయప్రదం చేయాలి : ముప్పాళ్ళ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే బైక్ ర్యాలీలను జయప్రదం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక లాడ్జీ సెంటర్, అంబేద్కర్ కూడలిలో మంగళవారం ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బుధవారం దుగ్గిరాల, తెనాలి, పొన్నూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు మీదుగా సాగి సాయంత్రం గుంటూరు, చాకలిగుంటలోని కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ వద్ద జరిగే బహిరంగ సభతో ఈ ర్యాలీ ముగుస్తుందన్నారు. ఈనెల 26తో సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బైక్ ర్యాలీలో జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, జంగాల చైతన్య, మేడా హనుమంతురావు, కొల్లి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదపడతాయని డీఎస్‌డీవో ఆఫ్రోజ్ ఖాన్ అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపికలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన పాలసీని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆశోక్‌బాబు మాట్లాడుతూ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు, పతకాలు అందజేశారు.


టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన పిల్లి మాణిక్యరావును మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య -గుంటూరు (ఆంధ్రజ్యోతి)


సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే నసీర్

పీపీపీపై సైకోల మాటల నమ్మకండి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● రూ.87 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల నిర్మాణంలో పీపీపీ విధానంపై రాష్ట్రంలో మేధావులు ఆలోచించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆయన రూ.87 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల వైద్యానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.7.80 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామని వెల్లడించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ వైద్యంతోపాటు సీఎంఆర్ఎఫ్ ద్వారా తోడుగా నిలుస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై జగన్ గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నిలదీస్తారనే భయంతో సంతకాల సేకరణ డ్రామాకు తెరతీశారన్నారు. హైవే రోడ్లు, డ్యాములు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఇలా ప్రభుత్వానికి సంబంధించిన వాటిని ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తూ ఉంటామని, ఇందులో భాగంగా మెడికల్ కాలేజీలనూ పూర్తి చేసేందుకు పీపీపీ విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు.

నేడు మహ్మద్ రఫీ స్మారక మ్యూజికల్ నైట్

● ఎమ్మెల్యే నసీర్ నేతృత్వంలో భారీ కార్యక్రమం

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): భారత సినీ ప్రపంచంలో అమరగాయకుడిగా పేరుపొందిన పద్మశ్రీ మహ్మద్ రఫీ జయంతి సందర్భంగా బుధవారం భారీ మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, మైనార్టీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో ఎంపవర్ ఫౌండేషన్ బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్కెస్ట్రా బృందం పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. మహ్మద్ రఫీ ఆలపించిన గీతాలను ఆలపిస్తారు. కేవలం సినీ గేయాలకే పరిమితం కాకుండా సమాజంలోని పలు పార్శ్వాలు, మతాలకు సంబంధించిన పాటలు పాడి ప్రజల మనసుల్లో స్థానం పొందిన రఫీకి నివాళిగా జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు.

108 సేవలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 108 సేవలలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు 108 ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, వై శివశంకర్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.4 వేలు ప్రతి ఒక్క ఉద్యోగికి చెల్లించాలని కోరారు. సమస్యలపై స్పష్టత లేకపోతే ఈ 26న సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో షేక్ హసన్, బి యెహోషువ, హసన్ కమల్, బాజీ, రాజ్ కుమార్, హరి, ఆశోక్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

● సీఎం చంద్రబాబుకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కేసన, క్రాంతికుమార్ పక్కన సీపీఐ రామకృష్ణ

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా మేరకు 52 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతనే ఎన్నికలకు వెళ్ళాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్‌లు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబును ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ఆమోదానికి పంపిన నేపథ్యంలో, మన రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు వారి జనాభా దామాషా మేరకు 52 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర నేతలు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే గఫూర్ తదితరులున్నారు.

కాసుల కృష్ణంరాజుకు పూర్ణ కుంభ పురస్కారం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో జరిగే తెలుగు ప్రపంచ మహాసభల్లో కాసుల పురుషోత్తమ కవి వారసుడుగా గుంటూరుకు చెందిన ధ్వని అనుకరణ కళాకారుడు డాక్టర్ కాసుల కృష్ణంరాజుకు పూర్ణకుంభ పురస్కారం అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాసుల కృష్ణంరాజును నగర్ మేయర్ కోవెలమూడి రవీంద్ర అభినందించి, సత్కరించారు. మేయర్ మాట్లాడుతూ ఆంధ్ర నాయక శతక కర్త కాసుల పురుషోత్తమ కవి తెలుగు వారందరికి సుపరిచితులని, ఆయన పేరుతో ఫౌండేషన్ స్థాపించి పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులలో తెలుగు పద్య రచనపై ఆసక్తి గలిగేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కాసుల కృష్ణంరాజు సేవలు అభినందనీయమన్నారు.

27న చలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న తలపెట్టిన చలో రాజ్‌భవన్‌ను జయప్రదం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో మంగళవారం ప్రజా, కార్మిక, వ్యవసాయ సంఘాలతో ప్రత్యేక సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాశం రామారావు, కే అజయ్, జెట్టి బాలరాజు, ఎం రవి, బి వెంకటేశ్వరరావు, చెంగయ్య, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారిపై వేధింపులు ఆపాలని 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట 104 సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డీఆర్వో ఖాజావలీకి వారు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనల్లో వివికే సురేష్, ఎం రాజేశ్వరరావు, గోరంట్ల సురేష్, శ్రీహర్ష, ఐ నాగులు, సత్యరాజ్, బాలకృష్ణ, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

భాగవత మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం (రవీంద్ర నగర్)లో ఉన్న శ్రీ రమ సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 28వరకు జరిగే భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞం భాగవత మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ ప్రవచనంలో భాగవతంలోని కథల ద్వారా వేదాంత తత్వాన్ని ప్రతిపాదించారు. జీవుడు సుఖదుఃఖాలతో కూడిన ఈ ప్రపంచాన్ని కాక పరమాత్మను నిత్యం స్మరించాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ చావలి గణపతి, దత్త ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేదంలో ఆపరేషన్లకు అనుమతి

▸ పీజీ పూర్తి చేసిన వైద్యులకు అవకాశం

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పురాతన భారతీయ వైద్య విధానాన్ని ఆధునిక చికిత్స విధానాలతో అనుసంధానం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆయుర్వేదలో పీజీ పూర్తి చేసిన వైద్యులకు స్వంతంత్రంగా ఆపరేషన్లు చేయడానికి ఆయన ఆమోదం తెలిపారు.ఆయుర్వేదలో వైద్యులకు శస్త్రచికిత్స ప్రక్రియకు సంబంధించిన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ నియమావళి - 2020, నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేలా తగు గుర్తింపతో పాటు అనుమతివ్వడానికి అంగీకరించినట్లు వివరించారు. ఈ నిర్ణయంతో ఇప్పటికే శస్త్ర చికిత్సా విధానంలో పీజీ పట్టా పొందిన వైద్యులు శస్త్ర చికిత్సలు చేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ నిర్ణయంతో 39 శల్యతంత్ర (జనరల్ సర్జరీ) శస్త్ర చికిత్సలు, 9 శలక్యతంత్ర (ఈఎన్‌టి, ఆప్తమాలజీ) చికిత్సలను ఆయుర్వేద వైద్యుల చేయవచ్చునన్నారు. వీటిలో అంటు వ్యాధులకు, ప్రమాదాల కారణంగా దెబ్బతిన్న జీవకణాల తొలగింపు, గాయాలకు శస్త్ర చికిత్సలు, కుట్లు వేయడం, మొలలు, మలద్వారంలో చీలికలకు చికిత్స, కణుతులు, శుక్లాలు, గవదల తొలగింపు, కండరాల చికిత్స, చర్మమార్పిడి చికిత్సలు చేయవచ్చునన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలన కేంద్ర ప్రభుత్వం - 2020లోనే విడుదల చేసిందని, గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఆయుష్ సేవల పట్ల వారి నిర్లక్ష్యానికి ఇదోక ఉదాహరణగా మంత్రి వెల్లడించారు.

గత ప్రభుత్వ 'చెత్త'ను ఊడ్చేశాం!

వ్యర్థాల నుంచి విద్యుత్ తయారు చేస్తున్నాం.. రెండేళ్లలో ఆరు కొత్త వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు

▸ నాలుగు కేంద్రాల డెవలపర్స్‌తో డిస్కంల ఒప్పందం

▸ ప్రతిరోజూ 7,500 టన్నుల చెత్త ప్రాసెసింగ్..

▸ 119 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా ఏర్పాట్లు

▸ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి



వేస్ట్ టు ఎనర్జీ కేంద్రాల డెవలపర్స్‌తో ఒప్పంద కార్యక్రమంలో మంత్రి నారాయణ, డిస్కంల అధికారులు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గత సర్కార్ చెత్తపై కూడా పన్ను వసూలు చేసిందని, తమ ప్రభుత్వం చెత్తతో విద్యుత్ తయారీకి శ్రీకారం చుట్టిందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న నాలుగు వేస్ట్ టు ఎనర్జీ (వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి) కేంద్రాల డెవలపర్స్‌తో ఏపీ డిస్కంలు మంగళవారం ఒప్పందం చేసుకున్నాయి. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్తను వదిలిపోయిందన్నారు. అక్టోబరు 2 నాటికి నిల్వ చెత్తను తొలగించాలని సీఎం ఆదేశించారని, లక్ష్యం కంటే ఎక్కువగానే 93 లక్షల టన్నుల చెత్తను అధికారులు తరలించారని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో రెండు కేంద్రాల నుంచి చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. నెల్లూరు, కాకినాడ, కడప, కర్నూలులో ఏర్పాటు చేసే నాలుగు ప్లాంట్లతో డిస్కంలు ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 7,500 టన్నుల చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్లాంట్లను నెలకొల్పుతున్నామన్నారు. రెండేళ్లలోనే 6 కొత్త వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. మున్సిపాలిటీల్లో పీపీపీ విధానంలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జిందాల్, ఆంటోని లారా కంపెనీల ఆధ్వర్యంలో నిర్మాణాలు, నిర్వహణ జరుగుతాయన్నారు.

పదుల సంఖ్యలో మున్సిపాలిటీలు కవరయ్యేలా..

కాకినాడ (రామేశ్వరం)లో 21 మున్సిపాలిటీలు కవర్ అయ్యేలా 957 టన్నుల వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 15 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు, నెల్లూరు (దొంతాలి)లో 9 మున్సిపాలిటీలకు 604 టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యంతో 12 మెగావాట్ల ప్రాజెక్టులను జిందాల్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కడప (కొలుములపల్లి)లో 18 మున్సిపాలిటీలకు 781 టన్నుల వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 15 మెగావాట్ల ప్రాజెక్టు, కర్నూలు (గార్వేయపురం)లో 13 మున్సిపాలిటీలకు 751 టన్నుల వ్యర్థ ప్రాసెసింగ్ సామర్థ్యంతో 15 మెగావాట్ల ప్రాజెక్టును ఆంటోని లారా కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నాలుగు ప్లాంట్లు ప్రతిరోజూ 3,093 టన్నుల ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేస్తాయన్నారు. టెండర్ల దశలో ఉన్న విజయవాడ, తిరుపతి ప్లాంట్లు 1,600 టన్నుల చెత్తను ప్రాసెస్ చేయనున్నాయని తెలిపారు. ఇప్పటికే గుంటూరు, విశాఖలో నడుస్తున్న ప్లాంట్ల ద్వారా 2,800 టన్నుల చెత్తను ప్రాసెస్ చేస్తున్నారని, తద్వారా 35 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఈ ఎనిమిది ప్లాంట్లు కలిపి 7,493 టన్నుల చెత్తను విద్యుత్‌గా మారుస్తూ 119 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు, ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జీఎం డి.రాజేంద్రప్రసాద్, ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జీఎం బి.ఉమాపతి, ఈపీడీసీఎల్ చీఫ్ జీఎం ఎల్.మహేంద్రనాథ్, పీపీసీసీ జీఎం పి.ప్రభాకర్, జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్స్ అధ్యక్షుడు ఎంవీ చారి, ఆంటోని లారా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.


ఇక పెట్రోల్ బంకుల్లో రెండేళ్ళకోసారి తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు, ధ్రువీకరణ పత్రాల స్టాంపింగ్‌లు ఇకపై రెండేళ్ళ కొక సారి జరగనున్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ విడుదల చేసింది. సాధారణంగా పెట్రోల్ బంకుల్లో తూనికల, కొలతల శాఖ అధికారులు ప్రతి ఏటా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తారు. పెట్రోల్ పంపులు, నాణ్యత, ప్రమాణాలపై తనిఖీలు చేసి అధికారికంగా .ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారు. ఇది ప్రతి ఏటా జరిగే ప్రక్రియ. అయితే తాజాగా రెండేళ్ళకోసారి తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ స్టాంపింగ్ నిర్వహించేలా కేంద్రం గెజిట్ విడుదల చేయటంపై ఏపీ ఫెడరేషన్ ఆఫ్ పెట్రో డీలర్స్ రాష్ట్ర అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పేరం రవికుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీటీడీసీ బోర్డు సభ్యులుగా మునిరత్నం, జయప్ప

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) బోర్డుకు ప్రభుత్వం మరో ఇద్దరు సభ్యులను నియమించింది. ఈ మేరకు పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరికి చెందిన సి.మునిరత్నం, హిందూపురానికి చెందిన జయప్పలను ఏపీటీడీసీ బోర్డు సభ్యులుగా నియమించారు. ఇప్పటికే చైర్మన్‌తో పాటు కొంత మంది సభ్యులను నియమించిన ప్రభుత్వం తాజాగా మరో ఇద్దరికి అవకాశం కల్పించింది.

రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యం




▸ పీపీపీపై వైసీపీ బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

▸ ఐదేళ్లలో యూనిట్ విద్యుత్ ధర 1.20కి తగ్గించాలని చంద్రబాబు కృషి చేస్తున్నారు

▸ విజయవాడలో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మంత్రి కొలుసు

విజయవాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తోందని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మంత్రి వివరంగా మాట్లాడారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలల నిర్మాణంపై వైసీపీ చేస్తున్న విమర్శ పూర్తి బాధ్యతారాహిత్యమైనదంటూ మండిపడ్డారు. పీపీపీ టెండర్లలో పాల్గొంటే జైలుకు పంపిస్తామనే విపక్షం బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువలు, వ్యవసాయ కాలువల నిర్వహణకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. దీనివల్ల వ్యవసాయ రంగం కుదేలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాల మంత్రులు కూడా ఏపీకి వస్తున్న పెట్టుబడులు గురించి చర్చించే స్థాయికి రాష్ట్రం చేరుకుందంటే దానికి కారణం చంద్రబాబు అనుభవం, పరిపాలనా దక్షతేనని పేర్కొన్నారు. విపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో విద్వేషాలు, ఉద్వేగాలు రెచ్చగొడుతూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని మంత్రి దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాబోయే ఐదేళ్లలో యూనిట్ విద్యుత్ ధరను రూ.1.20కు తగ్గించాలని లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ప్రపంచంలోనే అతికొద్ది దేశాలకే అందుబాటులో ఉన్న క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను రాష్ట్రం ద్వారా దేశానికి అందించబోతున్నామని మంత్రి అన్నారు. గూగుల్, రిలయన్స్, కాగ్నిజెంట్ వంటి ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రానికి రావడంలో మంత్రి లోకేశ్ కీలకపాత్ర పోషించారన్నారు. కాగా, ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడంలో జర్నలిస్టుల, మీడియా సంస్థల బాధ్యత చాలా కీలకమని ప్రభుత్వం గుర్తించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడేషన్ కార్డుల సంఖ్య 22 వేల నుంచి 12 వేలకు తగ్గించారని ఆరోపించారు. ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సోషల్ మీడియా, యూట్యూబర్లకు కూడా ఇచ్చే అంశంపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని వేశామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనేది చాలాకాలం నుంచి ఉన్న డిమాండ్ అని, 2014-19 మధ్య కాలంలో భూ కేటాయింపులకు సంబంధించి కొన్ని జీవోలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంపై సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకులు ఐవీ సుబ్బారావు, కంచల జయరాజు, సోమసుందర్, వెంకటేశ్వర్లు, దాసరి నాగరాజు, ఏచూరి శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



శ్రీవారి ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లిన న్యాయమూర్తులు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకున్న వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

గోడను ఢీకొట్టిన బైక్.. ముగ్గురు యువకులు మృతి

పెనుమంట్ర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మితిమీరిన వేగం ముగ్గురు యువకులను బలితీసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం పొలమూరులో బ్రాహ్మణ చెరువు- వీరవాసరం రహదారిపై సోమవారం అర్ధరాత్రి మోటార్ బైక్ గోడను ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పొలమూరు లూథరన్ చర్చి వద్ద నిర్వహించిన యూత్ క్రిస్మస్‌కు వచ్చిన స్నేహితుడిని ఇంటివద్ద దించేందుకు బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏలేటి రాజు (19), ఏలేటి అంజిబాబు (22), కోళ్ల సత్యనారాయణ (21) మృతి చెందారు. పెనుగొండ సీఐ రాయుడు విజయ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

టోకెన్లు తొలి మూడు రోజులకే..

2 నుంచి 8వరకు టోకెన్లు లేకపోయినా తిరుమలకు రావచ్చు

▸ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

▸ వైకుంఠ ద్వార దర్శనాలపై టీటీడీ చైర్మన్ స్పష్టీకరణ



తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలకు టోకెన్లు లేనివారిని రానివ్వరంటూ జరుగుతున్న ప్రచారం నిజం కాదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం తిరుమలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'నో టికెట్, నో ఎంట్రీ' అంటూ సోషల్ మీడియాలో కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిని నమ్మవద్దని కోరారు. కొండపైకి రావద్దు అనడానికి ఎవరికీ అధికారం లేదు. ఉండదు కూడా అని స్పష్టం చేశారు. గత అనుభవాల నేపథ్యంలో తొలి మూడురోజులు మాత్రమే...టోకెన్లు ఉన్నవారికే దర్శనం ఉంటుందని ఇప్పటివరకు ప్రకటిస్తూ వస్తున్నామన్నారు. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు టోకెన్లు లేకపోయినప్పటికీ తిరుమలకు వచ్చి సర్వదర్శనాలు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరిగే వైకుంఠ ద్వార దర్శనాల సమయంలో భక్తులపై ఆంక్షలు లేవన్నారు. రెండు మూడు నెలలుగా టీటీడీ అధికార యంత్రాంగం విశేషంగా కృషి చేసి ప్రణాళికలు సిద్ధం చేసిందని, తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ మంత్రులతో సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసి వైకుంఠద్వార దర్శనాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తోందని వివరించారు. కాగా గోవిందరాజస్వామి ఆలయంలో బంగారు దొంగతనం జరిగిందా అంటూ మీడియా అడిగిన ప్రశ్నకు 'అది నాకు తెలీదు' అని బీఆర్ నాయుడు బదులిచ్చారు.

రెండు గంటల్లోనే దర్శనం: ఈవో

వైకుంఠద్వార దర్శనాల సమయంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, అన్నప్రసాదాలు, వసతి, క్యూలైన్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మీడియాకు తెలిపారు. తొలి మూడురోజుల్లో టోకెన్లు పొందిన భక్తులు కేటాయించిన సమయానికే దర్శనానికి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకుండా రెండు గంటల్లోనే దర్శనభాగ్యం కలుగుతుందన్నారు. 3,500 మంది పోలీసులు, 1,150 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



పవిత్ర జలంతో ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి)ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 30వ తేదీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవారి ఆనంద నిలయం మొదలుకుని.. బంగారు వాకిలి, ఆలయం లోపల ఉపాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్ర పరిమళ జలాన్ని ప్రోక్షణం చేశారు. ఈ సమయంలో ఆలయంలోని మూలవిరాట్టుకు వస్త్రాన్ని కప్పిఉంచారు. తిరుమంజనం అనంతరం వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్య కార్యక్రమాలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు.

కూతుళ్లను కాల్వలో తోసేసిన తండ్రి

▸ దైవ దర్శనం పేరిట తీసుకువెళ్లి ఘాతుకం

▸ ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు

▸ అనంతపురం జిల్లా నేమకల్లులో అమానవీయ ఘటన



తమ్ముడితో చందన, అనసూయ (ఫైల్)



మైకంలో తండ్రి కల్లప్ప


బొమ్మనహాళ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికని తీసుకువెళ్లి ఇద్దరు కూతుళ్లను ఓ తండ్రి కాల్వలో తోసేశాడు. వీరిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..... నేమకల్లుకు చెందిన కలప్పకు ఇదే మండలంలోని కలుదేవనహళ్లి గ్రామానికి చెందిన శిల్పతో వివాహం జరిగింది. వీరికి సింధు(11), అనసూయ(9), మూడేళ్ల కుమారుడు శంకర్ పిల్లలు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సింధు ఆరో తరగతి, అనసూయ ఐదో తరగతి చదువుతున్నారు. కలప్ప...తన ఇద్దరు కూతుళ్లను ఆదివారం దైవదర్శనం పేరిట కర్ణాటకకు తీసుకువెళ్లాడు. అల్లీపురం వద్ద ఉన్న శంకరప్ప తాత దేవాలయానికి వెళుతున్నామని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఆ తరువాత ఒక్కడే ఇంటికి తిరిగి వచ్చాడు. బిడ్డలు ఏమయ్యారని కుటుంబ సభ్యులు, బంధువులు ప్రశ్నించినా... పూర్తి మత్తులో ఉన్న కల్లప్ప రెండు రోజులపాటు ఏ సమాచారమూ ఇవ్వలేదు. ఈ క్రమంలో గ్రామస్థులు అందరూ ఏకమై మంగళవారం ఉదయం గట్టిగా నిలదీయడంతో ఇద్దరినీ కర్ణాటకలోని సిరిగేరి క్రాస్ వద్ద తుంగభద్ర దిగువ కాల్వలోకి తోసేశాని తెలిపాడు. దీంతో అందరూ షాక్‌కు గురయ్యారు. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించగా ట్రైనీ ఎస్ఐ నవీన్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి గ్రామానికి చేరుకుని కల్లప్పను విచారించారు. వారికి కూడా పిల్లలను నీటిలో తోసేశాని తెలపడంతో అదుపులోకి తీసుకుని బళ్లారికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు సిరిగేరి క్రాస్ వద్దకు వెళ్లి కాల్వలో గాలించగా కగ్గల్లు సమీపంలో సింధు మృతదేహం లభించింది. అనసూయ కోసం గాలిస్తున్నారు. కన్న కూతుళ్లను తండ్రి ఎందుకు ఇలా నీటిలో తోసేశాడో తెలియడం లేదని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అంటున్నారు.

అట్టహాసంగా పెసా మహోత్సవ్ ప్రారంభం

▸ విశాఖ బీచ్‌రోడ్డులో 10కె రన్

▸ పోర్టు స్టేడియంలో క్రీడా పోటీలు

▸ గిరిజన ఉత్పత్తులతో స్టాళ్లు



ఆర్కే బీచ్‌రోడ్డులో నిర్వహించిన 10కె రన్‌లో పాల్గొన్న గిరిజన క్రీడాకారులు

విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'పెసా' మహోత్సవం మంగళవారం విశాఖలో అట్టహాసంగా ప్రారంభమైంది. పది రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కళాకారులతో ఉత్సవ్ తొలిరోజు ఉత్సాహంగా సాగింది. ఉదయం బీచ్‌రోరోడ్డులో 10కె రన్ నిర్వహించారు. రన్‌ను ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతి సురేఖ, కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు రేవు ముత్యాలరాజు, కృష్ణతేజ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోర్టు స్టేడియం వేదికగా ఉత్సవ్‌ను కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారులతో థింసా నృత్యం చేశారు. ఏపీ, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన గిరిజనుల ఉత్పత్తులతో 68 స్టాళ్లు ఏర్పాటుచేశారు. బొమ్మలు, చేనేత వస్త్రాలు, ఆహార ఉత్పత్తులు ప్రదర్శన లో ఉంచారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, తదితరులు గిరిజనులు ఆకులతో తయారుచేసిన టోపీలు ధరించారు.

తొలిరోజు విజేతలు...

ఖేల్ ఇండియాలో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో 10 రాష్ట్రాలకు చెందిన పురుషుల జట్లు, ఎనిమిది మహిళా జట్లు పాల్గొన్నాయి. పురుషుల కబడ్డీలో మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణ.., మహిళల కబడ్డీలో జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విలువిద్యలో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 12 మంది పురుషులు, ఎనిమిది మంది మహిళలు పాల్గొన్నారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో జార్ఖండ్‌కు చెందిన కృష్ణా పింగువా బంగారు పతకం, రాజస్థాన్‌కు చెందిన బద్రీలాల్ మీనా రజత పతకం, దినేష్ ముర్ము (జార్ఖండ్) కాంస్య పతకం సాధించారు. మహిళల వ్యక్తిగత విభాగంలో రాజస్థాన్‌కు చెందిన ఖుషీ నసోమా బంగారు పతకం, జార్ఖండ్‌కు చెందిన అనురాధకుమారి రజత పతకం, ఒడిశాకు చెందిన అంబికా పాండే కాంస్య పతకం సాధించారు.

ఇయర్ ఎండ్ ఆఫర్లు.. రండి బాబు రండి..

వినియోగదారులకు కార్ల కంపెనీల వల.. కొనుగోళ్లపై ఆఫర్ల మీద ఆఫర్లు

ప్యాసింజర్ కార్ల మార్కెట్లో ఇయర్ ఎండ్ సందడి నడుస్తోంది. 2025 స్టాకును వదిలించుకునేందుకు కార్ల కంపెనీలు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. క్యాష్ బెనిఫిట్స్, ఎక్స్ఛేంజీ బోనస్‌లతో పాటు ఈఎంఐల వెసులుబాటు రూపంలోనూ కంపెనీలు కొనుగోలుదారులను రండి బాబు రండి అని ఆకర్షిస్తున్నాయి. ఫోక్స్‌వ్యాగన్, మారుతి సుజుకీ, కియా, హ్యుండయ్ మోటార్స్‌తో పాటు హోండా వంటి దిగ్గజ కార్ల కంపెనీల హ్యాచ్‌బ్యాక్‌లు, సెడాన్‌లతో పాటు ఎస్‌యూవీలపై ఆఫర్లు అందిస్తున్నాయి. ఫెస్టివల్ సీజన్‌లో ప్రారంభమైన ఈ ఆఫర్లు ఈ నెలాఖరుకల్లా క్లోజ్ కాబోతున్నాయి. వివిధ కంపెనీలు ఆఫర్ చేస్తున్న ఈ ఇయర్ ఎండ్ ఆఫర్లు ఎలా ఉన్నాయంటే..



కియా ఇండియా

అమ్మకాలు పెంచుకునేందుకు కియా ఇండియా 'ఇన్‌స్పైరింగ్ డిసెంబర్' పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఈ ప్రచారంలో భాగంగా సెల్టోస్, సోనెట్, కార్నివాల్ వంటి ఎంపిక చేసిన కొన్ని మోడల్స్‌పై నగదు డిస్కౌంట్‌లు, ఎక్స్ఛేంజీ ఆఫర్లు, లాయల్టీ బోనస్‌ల రూపంలో రూ.3.65 లక్షల వరకు ప్రత్యేక ప్రయోజనాలు అందజేస్తోంది. ఈ నెలాఖరుతో ముగిసే ఈ ప్రత్యేక ఆఫర్లు స్టాకు ఉన్నంత వరకు మాత్రమేనని కంపెనీ తెలిపింది.

మారుతి సుజుకీ



- వ్యాగన్‌ఆర్ పెట్రోల్, సీఎన్‌జీ వేరియంట్స్‌పై ఎక్స్ఛేంజీ, స్క్రాపేజీ బోనస్‌లు, నగదు ప్రయోజనాల రూపంలో రూ.61,100 వరకు ఆఫర్
- బాలెనో పెట్రోల్ మాన్యువల్, సీఎన్‌జీ వెర్షన్లపై రూ.48,000 వరకు, ఏఎంటీ వెర్షన్‌పై రూ.53,000 వరకు ప్రయోజనాలు
- డిజైర్ పెట్రోల్, సీఎన్‌జీ వేరియంట్స్‌పై రూ.15,000 వరకు ప్రయోజనాలు
- స్విఫ్ట్ పెట్రోల్ మాన్యువల్, ఏఎంటీ వేరియంట్లపై రూ.40,000 వరకు, సీఎన్‌జీ వెర్షన్లపై రూ.30,000 వరకు ఆదా
- గ్రాండ్ విటారా పెట్రోల్, ఆల్ వీల్ డ్రైవ్, సీఎన్‌జీ వేరియంట్స్‌పై రూ.లక్షకుపైగా, హైబ్రిడ్స్‌పై ఎక్స్‌టెండెడ్ వారెంటీతో పాటు రూ.2.03 లక్షల వరకు ఆదా

మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం)

- ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ కొనుగోళ్లపై రూ.1,14,500 వరకు
- ఎక్స్‌యూవీ 400 మోడల్‌పై రూ.4.45 లక్షల వరకు
- స్కార్పియో క్లాసిక్‌పై రూ.1.14 లక్షల వరకు ఆదా
- స్కార్పియో ఎన్ మోడల్ మీద రూ.85,600 వరకు
- థార్ రాక్స్ మోడల్‌పై రూ.1.20 లక్షల వరకు ఆదా
- ఎక్స్‌యూవీ 700 మోడల్ మీద రూ.1,55,600 వరకు

స్కోడా

- మిడ్ సైజ్ ఎస్‌యూవీ కుషాక్‌పై రూ.3.25 లక్షల వరకు ఆదా
- స్లావియా సెడాన్ మీద రూ.2.25 లక్షల వరకు ప్రయోజనాలు
- కైలాక్‌పై రూ.75,000 వరకు ప్రయోజనాలు
- టాప్ ఎండ్ కోడియాక్ మోడల్ ఎస్‌యూవీపై రూ.6 లక్షల వరకు ఆదా

టాటా మోటార్స్

- టాటా పంచ్ పెట్రోల్, సీఎన్‌జీ వేరియంట్లపై రూ.40,000 వరకు డిస్కౌంట్
- రూ.7.99 లక్షల నుంచి రూ.14.15 లక్షల ధర ఉండే టాటా నెక్సస్ పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ వెర్షన్ల మీద రూ.50,000 వరకు డిస్కౌంట్
- కొత్త ఆల్ట్రోజ్ మోడల్స్ మీద రూ.25,000 వరకు రాయితీ
- రూ.6.3 లక్షలు- రూ.10.51 లక్షల మధ్య ధర ఉండే పాత ఆల్ట్రోజ్ మోడల్స్‌పై రూ.85,000 వరకు డిస్కౌంట్
- హారియర్, సఫారీ మోడల్స్‌పై రూ.లక్ష వరకు ప్రయోజనాలు
- టియాగో, టిగోర్, పంచ్, ఆల్ట్రోజ్, నెక్సాన్, కర్వ్ వంటి ఐసీఈ వాహన రుణాలపై కనీస ఈఎంఐ రూ.4,999 నుంచి రూ.9,999 వరకు.
- ఈవీల రుణాలపైనా రూ.5,999 నుంచి రూ.14,555 వరకు కనీస ఈఎంఐలు

హ్యుండయ్ మోటార్

- గ్రాండ్ ఐ10 నియోస్ మీద రూ.1,43,808 వరకు
- ఐ20 పై రూ.1,68,053 వరకు
- ఎక్స్‌టర్ మీద రూ.1,74,209 వరకు
- ఆరాపై రూ.1,11,465 వరకు
- వెర్నా మోడల్ మీద రూ.1,35,640 వరకు
- అల్కాజార్ మోడల్‌పై రూ.1,15,376 వరకు

హోండా కార్స్

- రూ.7,40,800 నుంచి ప్రారంభమయ్యే అమేజ్ మోడల్ మీద రూ.87,000 వరకు ప్రయోజనాలు
- రూ.10,99,900 నుంచి ప్రారంభమయ్యే హోండా ఎలివేటర్ ఎస్‌యూవీ మీద రూ.1.76 లక్షల వరకు
- రూ.11,95,300 నుంచి ప్రారంభమయ్యే సిటీ సెడాన్ సెలక్ట్ వేరియంట్స్‌పై రూ.1,57,700 వరకు ప్రయోజనాలు

ఫోక్స్‌వ్యాగన్

- టైగన్ స్పోర్ట్ 1.0 లీటర్ టీఎస్ఐ ఆటోమేటిక్ వెర్షన్ మీద రూ.80,000 వరకు ఆదా
- టైగన్ జీటీ ప్లస్ స్పోర్ట్ 1.5 లీటర్ టీఎస్ఐ డీఎస్‌జీ మోడల్‌పై రూ.50,000 ఎక్స్ఛేంజీ ప్రయోజనాలతో పాటు తొలి ఆరు ఈఎంఐలు కంపెనీనే చెల్లిస్తుంది
- టైగన్ హైలైన్ ప్లస్ 1.0 లీటర్ టీఎస్ఐ ఆటోమేటిక్ మోడల్‌పై రూ.లక్ష వరకు ప్రయోజనాలు
- 1.0 లీటర్ టీఎస్ఐ ఆటోమేటిక్, జీటీ ప్లస్ క్రోమ్ 1.5 లీటర్ టీఎస్ఐ డీఎస్‌జీ మోడల్స్‌పై ఆరు నెలల ఈఎంఐ చెల్లింపు మద్దతు
- 1.5 లీటర్ డీఎస్‌జీ మోడల్‌పై అదనంగా రూ.50,000 ఎక్స్ఛేంజీ ఆఫర్
- వర్టస్ జీటీ ప్లస్ క్రోమ్ 1.5 లీటర్ టీఎస్ఐ డీఎస్‌జీ మోడల్‌పై రూ.30,000 ఎక్స్ఛేంజీ ఆఫర్‌తో పాటు తొలి ఆరు నెలల ఈఎంఐలను కంపెనీ భరిస్తుంది
- జీటీ ప్లస్ స్పోర్ట్ డీఎస్‌జీపైనా ఆరు నెలల ఈఎంఐ చెల్లింపు, రూ.30,000 ఎక్స్ఛేంజీ ప్రయోజనాలు
- వర్టస్ స్పోర్ట్ మోడల్స్‌పైనా రూ.80,000 ప్రయోజనాలు

క్యాష్ డిస్కౌంట్‌లు, ఎక్స్ఛేంజీ బోనస్‌లు, లాయల్టీ బోనస్‌లు, కార్పొరేట్ ఆఫర్లు, బీమా పథకాలతో కలిపి ఈ ప్రయోజనాలు లభిస్తాయి. అయితే కొనుగోలు చేసే వాహనం మోడల్, ప్రాంతం, డీలర్‌ను బట్టి పై ప్రయోజనాల్లో స్వల్ప తేడాలు ఉంటాయి.



	బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)		
	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,38,550 ▲	1,27,000 ▲	2,33,000 ▲
విజయవాడ	1,40,500 ▲	1,30,500 ▲	2,17,000 ▲
విశాఖపట్నం	1,40,700 ▲	1,27,700 ▲	2,34,000 ▲
రాజమండ్రి	1,38,550 ▲	1,27,000 ▲	2,15,000 ▲
ప్రొద్దుటూరు	1,38,500 ▲	1,27,420 ▲	2,12,000 ▲
ముంబై	1,36,283 ▲	1,24,835 ▲	2,11,000 ▲

బంగారం @ రూ.1.40 లక్షలు

- సరికొత్త రికార్డు స్థాయికి ధరలు

న్యూఢిల్లీ: దేశీయంగా బంగారం, వెండి ధరలు సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం రేటు మంగళవారం మరో రూ.2,650 పెరిగి రూ.1,40,850 కి చేరింది. అంతర్జాతీయంగా వీటి ధరలు కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ తొలిసారిగా 4,500 డాలర్ల మైలురాయిని దాటింది. సిల్వర్ సైతం తొలిసారి 70 డాలర్ల మార్క్‌ను తాకింది. వచ్చే ఏడాది ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలతోపాటు అమెరికా-వెనిజులా ఉద్రిక్తతలు కూడా ఇందుకు కారణమయ్యాయి.

సెన్సెక్స్ 42 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండు రోజుల లాభాల జోరుకు అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మంగళవారం సెన్సెక్స్ 42.64 పాయింట్లు కోల్పోయి 85,524.84 వద్దకు జారుకోగా నిఫ్టీ కేవలం 4.75 పాయింట్ల వృద్ధితో 26,177.15 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	675	విజయవాడ	720
వరంగల్	677	గోదావరి	695
చిత్తూరు	703	విశాఖపట్నం	702
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	140
కరీంనగర్	142	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	137
కర్నూలు	142	నెల్లూరు	142
విశాఖపట్నం	121	అనంతపురం	142
గోదావరి	135		

ఆల్మటీలో ఆర్‌సీ ప్లాస్టో డీలర్ల సమావేశం



హైదరాబాద్: ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. కజకిస్థాన్‌లోని ఆల్మటీలో డీలర్ల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న 94 మంది డీలర్లు హాజరయ్యారని తెలిపింది. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్లు నీలేష్ అగర్వాల్, విశాల్ అగర్వాల్, స్పర్ష్ అగర్వాల్.. కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు, వ్యూహాలను డీలర్లకు వివరించారు. అలాగే వ్యాపార వృద్ధికి అవసరమైన సలహాలు సూచనలు అందించటంతో పాటు దీర్ఘకాలిక భాగస్వామ్యాలను కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ ఆష్నీర్ గ్రోవర్ కూడా పాల్గొన్నారు.

2030 నాటికి 5 కొత్త ఈవీలు

టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ (టీఎంపీవీ).. విద్యుత్ వాహనాల (ఈవీ) విభాగానికి సంబంధించి భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఎలక్ట్రిక్ వాహన విక్రయాలు 2.5 లక్షల యూనిట్లకు చేరుకున్న సందర్భంగా టీఎంపీవీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర మాట్లాడుతూ.. 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి 5 కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది సియెర్రా ఈవీ, పంచ్ ఈవీ కొత్త వెర్షన్‌తో పాటు 2026 చివరికల్లా ప్రీమియం ఈవీ అవిన్యను సైతం విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే కొత్త వాహనాలు, టెక్నాలజీల అభివృద్ధితో పాటు ఈవీ ఆవరణ వ్యవస్థను భారీగా విస్తరించేందుకు 2029-30 నాటికి రూ.16,000-18,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు శైలేష్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఆరు ఈవీ మోడళ్లను మార్కెట్లో విక్రయిస్తోంది. దేశీయ ఈవీల విభాగంలో టీఎంపీవీ 45-50 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది.

ఐదేళ్లలో రూ.9,000 కోట్ల రెవెన్యూ టార్గెట్

రామ్‌కీ ఇన్‌ఫ్రా సీఈఓ సునీల్ నాయర్ ● రూ.10,000 కోట్లకు ఆర్డర్ బుక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్.. వచ్చే ఐదేళ్లలో రూ.9,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం నాడిక్కడ సంస్థ సీఈఓ సునీల్ నాయర్ మాట్లాడుతూ..గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో సంస్థ ఆదాయం రూ.2,044 కోట్లుగా ఉందని, రానున్న ఐదు సంవత్సరాల్లో దీన్ని ఏటా 30 శాతం వృద్ధితో రూ.9,000 కోట్ల (100 కోట్ల డాలర్లు)కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈపీసీ, హ్యామ్, బీఓటీ విభాగాల్లో పెద్దఎత్తున ఆర్డర్లను దక్కించుకోవటం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశీయంగా ప్రభుత్వాలు మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి పెడుతుండటం కూడా తమకు కలిసి రానుందన్నారు. ప్రస్తుతం సంస్థ ఆర్డర్ బుక్ రూ.10,000 కోట్లుగా ఉందని, ఈ ఏడాది దేశీయంగా మరో 9,000 కోట్ల ఆర్డర్లతో పాటు విదేశాల్లో రూ.1,000 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు నాయర్ వెల్లడించారు. ప్రధానంగా ఇండస్ట్రియల్ పార్కులు, వాటర్, వేస్ట్ వాటర్, వేస్ట్ టు ఎనర్జీ విభాగాలపై దృష్టి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. కాగా తెలంగాణ ప్రభుత్వం నుంచి హ్యామ్ విధానంలో రూ.2,085 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఆర్డర్‌లో భాగంగా హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ నుంచి తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని నాయర్ తెలిపారు.

స్పోర్ట్స్

ఒకే ఓవర్‌లో 5 వికెట్లు



టీ20ల్లో ప్రపంచ రికార్డు

ఇండోనేసియా బౌలర్ ప్రియందన సంచలనం

బాలి (ఇండోనేసియా): ఇండోనేసియాకు చెందిన పేసర్ గెడె ప్రియందన అంతర్జాతీయ టీ20ల్లో సంచలన ప్రదర్శన నమోదు చేశాడు. ఎనిమిది టీ20ల సిరీస్‌లో భాగంగా కంబోడియాతో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి అద్భుతహ.. అనిపించాడు. ప్రియందన (1-0-1-5) రికార్డు ప్రదర్శనతో ఆతిథ్య ఇండోనేసియా 60 పరుగులతో గెలిచింది. తొలుత ఇండోనేసియా.. ధర్మ కేసుమా (110 నాటౌట్) అజేయ సెంచరీతో 20 ఓవర్లలో 167/5 స్కోరు చేసింది. ఛేదనలో ప్రియందనకు తోడు అంజార్ (2/10), డానిస్లాన్ (2/17) వికెట్ల వేటలో చెలరేగడంతో కంబోడియా 16 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. 16వ ఓవర్‌లో బంతి తీసుకున్న ప్రియందన.. తొలి మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించాడు. నాలుగో బంతిని డాట్ బాల్‌గా వేసిన అతను..తర్వాత వైడ్ ఇచ్చుకున్నాడు. అనంతరం రెండు బంతుల్లో మరో ఇద్దరిని అవుట్ చేసి ఐదు వికెట్ల ప్రదర్శనను పూర్తి చేసుకున్నాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా 28 ఏళ్ల ప్రియందన చరిత్ర సృష్టించాడు. కాగా, గతంలో 2010 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో పాకిస్థాన్ పేసర్ మహ్మద్ ఆమెర్ విసిరిన ఒక ఓవర్‌లో ఐదు వికెట్లు పతనమైనప్పటికీ.. వాటిలో రెండు రనౌట్లు ఉన్నాయి. దేశవాళీ టీ20ల్లో భారత్‌కు చెందిన అభిమన్యు మిథున్, బంగ్లాదేశ్ ఆటగాడు అల్ అమిన్ హొస్సైన్ ఈ ఘనత సాధించారు.



స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, అతడి భార్య హిమని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకొన్నారు. ఈ సందర్భంగా చోప్రాతో స్పోర్ట్స్ సహ అనేక విషయాలపై చర్చించినట్టు మోదీ 'ఎక్స్'లో తెలిపారు. వారితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు.

అమ్మాయిలు అలవోకగా..



అదరగొట్టిన షఫాలీ

షఫాలీ వర్మ (69 నాటౌట్)

శ్రీ చరణికి రెండు వికెట్లు ● రెండో టీ20లో లంక చిత్తు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): షఫాలీ వర్మ (34 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 69 నాటౌట్) అదిరే అర్ధ శతకంతోపాటు స్పిన్నర్లు రాణించడంతో.. భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన రెండో టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలుత శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 128/9 స్కోరు చేసింది. హర్షిత సమరవిక్రమ (33), చమరి ఆటపట్టు (31), హాసిని పెరీరా (22) ఫర్వాలేదనిపించారు. శ్రీచరణి, వైష్ణవి శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. స్నేహ్ రాణా (1/11) పొదుపుగా బౌలింగ్ చేసింది. ఛేదనలో భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది. జెమీమా రోడ్రిగ్స్ (26) రాణించింది. కవిష, మాల్కి మదార, కవింది తలో వికెట్ పడగొట్టారు. జ్వరంతో బాధపడుతున్న దీప్తి శర్మ స్థానంలో స్నేహ్ రాణా జట్టులోకి వచ్చింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా షఫాలీ నిలిచింది.

బాదుడే.. బాదుడు: డాషింగ్ బ్యాటర్ షఫాలీ తుదికంటా క్రీజులో నిలవడంతో.. స్వల్ప లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (14), షఫాలీ తొలి వికెట్‌కు 29 పరుగులతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, నాలుగో ఓవర్‌లో కవిష బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో మంధాన అవుటైంది. వన్‌డౌన్‌లో వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి షఫాలీ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. దీంతో పవర్‌ప్లేను భారత్ 68/1తో ముగించింది. అయితే, 8వ ఓవర్‌లో జెమీమాను కవింది క్యాచ్ అవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి జట్టు విజయానికి ఇంకా 42 పరుగులు కావాలి. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10) అండతో షఫాలీ.. మరో 49 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించింది.



శ్రీచరణి (2/23)

కట్టడి చేసిన స్పిన్నర్లు: స్నేహ్ రాణాతో పాటు యువ స్పిన్నర్లు చరణి, వైష్ణవి కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. లంక ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంకకు క్రాంతి ఆరంభంలోనే షాకిచ్చింది. ఓపెనర్ విష్మి గుణరత్నె (1)ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చింది. అయితే, కెప్టెన్ చమరి, హాసిని రెండో వికెట్‌కు 36 రన్స్‌తో ఆదుకొనే ప్రయత్నం చేశారు. చమరిని రాణా అవుట్ చేయగా.. పెరీరాతో జత కలసి హర్షిత దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించింది. కానీ, హాసినిని అవుట్ చేసిన చరణి.. మూడో వికెట్‌కు 44 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీసింది. హర్షితను రిచా రనౌట్ చేయడంతో.. లంక తడబడింది. 24 పరుగుల తేడాతో ఆరు వికెట్లు కోల్పోయింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 128/9 (హర్షిత 33, చమరి 31; శ్రీచరణి 2/23, వైష్ణవి 2/32).

భారత్: 11.5 ఓవర్లలో 129/3 (షఫాలీ 69 నాటౌట్, జెమీమా 26; కవిష 1/15, మదార 1/22).

దీప్తి @ నెం.1

టీ20 బౌలర్లలో అగ్రస్థానం



దుబాయ్: టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో నెంబర్‌వన్ బౌలర్‌గా నిలిచింది. ఐసీసీ మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో 28 ఏళ్ల దీప్తి.. 737 రేటింగ్ పాయింట్లతో బౌలింగ్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న ఆస్ట్రేలియా పేసర్ అనబెల్ సదర్లాండ్ (736) రెండో స్థానానికి పడిపోయింది. నెంబర్‌వన్ ర్యాంక్‌లో నిలవడం దీప్తికి కెరీర్‌లో ఇదే తొలిసారి. మిగతా భారత బౌలర్లలో తెలుగమ్మాయిలు అరుంధతి రెడ్డి ఐదు స్థానాలు ఎగబాకి 36వ, శ్రీచరణి ఏకంగా 19 స్థానాలు మెరుగై 69వ ర్యాంకుల్లో ఉన్నారు. టీ20 బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ ఐదు స్థానాలు మెరుగై 9వ ర్యాంక్‌తో టాప్‌టెన్‌లో నిలవగా, స్మృతీ మంధాన మూడో స్థానంలో కొనసాగుతోంది.

జెమీమాకు 'ఢిల్లీ' పగ్గాలు



న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత మహిళల జట్టు ప్రపంచ కప్ సాధించడంలో తనవంతు పాత్ర పోషించిన జెమీమా రోడ్రిగ్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కీలక బాధ్యతలు అప్పగించింది. వచ్చే ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు కెప్టెన్‌గా 25 ఏళ్ల జెమీమాను ఎంపిక చేసినట్టు ఢిల్లీ ఫ్రాంచైజీ మంగళవారం ప్రకటించింది. ఇన్నాళ్లూ ఢిల్లీ కెప్టెన్‌గా వ్యవహరించిన ఆస్ట్రేలియాకు చెందిన మెగ్ లానింగ్‌ను గతనెలలో జరిగిన వేలానికి ముందు ఆ జట్టు వదిలేసుకున్న సంగతి తెలిసిందే.

లెనాక్స్‌కు పిలుపు

- వన్డేలకు విలియమ్సన్ దూరం
- భారత్ టూర్‌కు న్యూజిలాండ్ జట్ల ప్రకటన

వెల్లింగ్టన్: వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే న్యూజిలాండ్ వన్డే, టీ20 టీమ్‌లను మంగళవారం ప్రకటించారు. ఎడమచేతి వాటం స్పిన్నర్ జేడెన్ లెనాక్స్ తొలిసారి జట్టులో చోటు దక్కించుకొన్నాడు. గాయం కారణంగా రెగ్యులర్ కెప్టెన్ మైకేల్ శాంట్నర్ విశ్రాంతినివ్వడంతో.. వన్డే జట్టుకు మైకేల్ బ్రేస్‌వెల్ నాయకత్వం వహించనున్నాడు. టీ20లకు మాత్రం శాంట్నర్ సారథ్యం వహించనున్నారు. భారత సంతతికి చెందిన స్పిన్నర్ ఆదిత్య అశోక్‌కు చోటు దక్కింది. జనవరి 11 నుంచి జరిగే టూర్‌లో కివీస్ మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది.

6 రోజులు తాగుతూనే ఉన్నారు..



ఇంగ్లండ్ క్రికెటర్లపై తీవ్ర విమర్శలు

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్ జట్టుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అడిలైడ్‌లో సిరీస్ నిర్ణాయక మూడో టెస్ట్‌లో ఇంగ్లండ్ ఓడిన తర్వాత సంచలన విషయాలు బయటికొచ్చాయి. రెండు-మూడు టెస్ట్‌ల మధ్య వచ్చిన 9 రోజుల విరామంలో ఇంగ్లిష్ ప్లేయర్లు కొందరు ఆరు రోజులపాటు ఏకధాటిగా మద్యం తాగుతూనే ఉన్నారని సమాచారం. రెండో టెస్ట్ ముగిసిన తర్వాత కొందరు ఇంగ్లిష్ ఆటగాళ్లు బ్రిస్బేన్‌లో రెండు రోజుల పాటు పూటుగా మద్యం సేవించగా.. ఆ తర్వాత నూసా బీచ్ రిసార్టులో ఉన్న నాలుగు రోజులు కూడా ఇదే పనిలో ఉన్నారు. మద్యం మత్తులో బెన్ డకెట్.. టీమ్ హోటల్ దారి తప్పడం, రోడ్డు పక్కన కూడా మందు తాగుతున్న కొన్ని వీడియోలు నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే, మితిమీరిన తాగుడు ఆరోపణలపై విచారణ చేస్తామని ఇంగ్లండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ చెప్పాడు.

'హజారే'లో స్టార్ల సందడి

బరిలో కోహ్లీ, రోహిత్, గిల్, పంత్

నేడు ఢిల్లీ x ఆంధ్ర; హైదరాబాద్ x యూపీ



బెంగళూరు: విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు భారత ఆటగాళ్లు పలువురు బరిలోకి దిగనుండడంతో విజయ్ హజారే ట్రోఫీలో సరికొత్త సందడి నెలకొంది. బుధవారం నుంచి టోర్నీ జరగనుంది. రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ కూడా తమతమ జట్ల తరపున బరిలోకి దిగుతున్నా.. అభిమానుల దృష్టి మాత్రం కోహ్లీ, రోహిత్‌పైనే ఉంది. బీసీసీఐ ఆదేశాల నేపథ్యంలో 15 ఏళ్ల తర్వాత విరాట్ ఈ దేశవాళీ టోర్నీలో ఆడుతున్నాడు. ముంబై తరపున రోహిత్ కేవలం రెండు మ్యాచ్‌లు అంటే.. ఈ నెల 24న సిక్కింతో, 26న ఉత్తరాఖండ్‌తో ఆడనున్నాడు. కోహ్లీ.. ఢిల్లీ తరపున ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడనే దానిపై స్పష్టత లేదు. గ్రూప్-డిలో తొలి మ్యాచ్‌లో ఆంధ్రతో ఢిల్లీ తలపడనుంది. ఇక, గ్రూప్-బిలో రాజ్‌కోట్‌లో జరిగే మ్యాచ్‌లో ఉత్తర్‌ప్రదేశ్‌తో హైదరాబాద్ ఆడనుంది.

- లిస్ట్-ఎ మ్యాచ్‌ల్లో 16 వేల పరుగుల మైలురాయికి కోహ్లీ (15999) ఒక్క పరుగు దూరంలో ఉన్నాడు. ఈ జాబితాలో భారత ప్లేయర్లలో సచిన్ (21,999) టాప్‌లో ఉన్నాడు.

మహిళల రన్నరప్ ఏపీ

టీమ్ విజేతలు హరియాణా, తమిళనాడు

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్టేట్-ఇంటర్ జోనల్ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. హరియాణా చాంపియన్‌గా నిలిచింది. ఇక్కడి సీహెచ్‌ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన మహిళల టీమ్ ఈవెంట్ ఫైనల్లో హరియాణా 3-0తో ఏపీని ఓడించింది. ఈ పోరులో స్టార్ షట్లర్ పీవీ సింధు బరిలోకి దిగకపోవడం ఏపీ అవకాశాలపై ప్రభావం చూపింది. ఇక.. ప్రత్యర్థి జట్టులోని ఉన్నతి హుడా, అన్మోల్ ఖారబ్‌లాంటి అంతర్జాతీయస్థాయి షట్లర్లను ఎదుర్కోవడంలో ఏపీ అమ్మాయిలు పూర్తిగా విఫలమయ్యారు. పురుషుల టీమ్ విభాగం ట్రోఫీని తమిళనాడు జట్టు దక్కించుకుంది. హోరాహోరీగా జరిగిన తుదిపోరులో తమిళనాడు 3-2తో హరియాణాపై గెలుపొందింది. మహిళల విభాగం మూడోస్థానం పోరులో గుజరాత్‌పై అస్సాం విజయం సాధించగా.. పురుషుల్లో ఉత్తరాఖండ్‌ను ఓడించి మహారాష్ట్ర తృతీయస్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై షట్లర్లకు ట్రోఫీలు అందజేశారు.



వినూత్నం

ఆత్మహత్యలకు పాల్పడాలనే ఆలోచనకు సకాలంలో అడ్డుకట్ట వేస్తూ, ఆ విపత్తుకు శాశ్వత ముగింపు పలుకుతోంది 'వన్ లైఫ్ సూసైడ్ ప్రివెన్షన్ సెంటర్'. లాభాపేక్ష లేని ఈ సంస్థకు చెందిన మెంటర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ రెబెకా మారియా 'నవ్య'తో పంచుకున్న అనుభవాలు...

నిరాశ వదిలించి... నవజీవనం వైపు

"ఆత్మహత్యకు పాల్పడే మార్గాల కోసం అన్వేషించే వారు కచ్చితంగా ఇంటర్నెట్‌లో వెతుకుతారు. ఆ ప్రయత్నం చేసే ప్రతి ఒక్కరికీ ఆత్మహత్య నివారణకు చెందిన హెల్ప్ లైన్ నంబర్లు కనిపిస్తాయి. అలా వన్ లైఫ్ సంస్థను ఆశ్రయించిన వారికి తగిన కౌన్సెలింగ్‌ను అందించి, జీవితం పట్ల ఆశను కల్పించి, ఆత్మహత్య ఆలోచన మాన్పించేలా సహాయపడుతూ ఉంటాం. ఇందుకోసం మా దగ్గర 120 మంది వాలంటీర్లు ఉన్నారు. వీళ్లందరూ వేర్వేరు రంగాలు, వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వారు. దేశం నలుమూలల నుంచి కాల్స్ వస్తూ ఉంటాయి కాబట్టి వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వాలంటీర్లు వేర్వేరు భాషల్లో కౌన్సెలింగ్ కోసం అందుబాటులో ఉంటారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునే వ్యక్తుల మానసిక స్థితిని అర్థం చేసుకుని, తీవ్రతను అంచనా వేసి, ఆ ఆలోచన విరమించుకునేలా చేయడానికి ఎంతో నేర్పు, ఓర్పు అవసరమవుతాయి. ఆత్మహత్య ఆలోచన ఎందుకొచ్చింది? దాని వెనకున్న కారణాలేంటి? అన్నది తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. అలాగే భావోద్వేగాలను అర్థం చేసుకుని, ఆలోచన తీవ్రతను అంచనా వేయడం కూడా ముఖ్యమే! కాబట్టి వాలంటీర్ల శిక్షణ వ్యూహాత్మకంగా సాగుతుంది. ఒకటిన్నర నెల శిక్షణ, ఆ తర్వాత 3 నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వాళ్లనే వాలంటీర్లుగా నియమించుకుంటాం. ప్రారంభంలో మాక్ కాల్స్ ద్వారా వాలంటీర్ల కౌన్సెలింగ్ సామర్థ్యాన్ని పరీక్షించి, అంతిమంగా టెలి కౌన్సెలింగ్‌కు అనుమతిస్తాం. మా దగ్గర శిక్షణ పొందిన వాలంటీర్లు అందరూ సర్టిఫైడ్ కౌన్సెలర్లే!

ఓర్పు, నేర్పులతో...

కొందరు ఆత్మహత్య గురించిన ఆలోచన వచ్చినా దానికి ప్రాధాన్యం ఇవ్వరు. ఇంకొందరు ఆ ఆలోచనను ఆచరణలో పెట్టే ప్రయత్నం చేస్తారు. అయితే ఆ క్షణం వాళ్ల ఆలోచనను ఆత్మహత్య నుంచి ఆశావహ భవిష్యత్తు వైపుకు మళ్లించడం ప్రధానం. మరీ ముఖ్యంగా ఆత్మహత్యకు పాల్పడేవాళ్లు, తమ బాధను ఎవరూ అర్థం చేసుకోవడం లేదనే వేదనకు గురవుతూ ఉంటారు. అంతటి కష్టం తనకి మాత్రమే వచ్చిందనే భ్రమలో ఉంటారు. తమ సమస్యకు చావు తప్ప మరో పరిష్కారం లేదని బలంగా నమ్ముతూ ఉంటారు. ఇలాంటి వాళ్ల మాటలను ఓపికగా విని, ఓదార్చడంతో పాటు, జోర్నల్ రాయడం, సానుకూల దృక్పథాన్ని అలవరుచుకోవడం, మానసిక ప్రశాంతతను అందించే యోగా, ధ్యానం లాంటి సెల్ఫ్ కేర్ యాక్టివిటీస్‌ను కూడా సూచిస్తూ ఉంటాం. ముఖాముఖి మాట్లాడినప్పుడు ఎదుటివారి భావోద్వేగాలను ప్రత్యక్షంగా చూడగలుగుతాం. కానీ టెలి కౌన్సెలింగ్‌లో ఆ అవకాశం ఉండదు. అయినప్పటికీ పరిస్థితిని అంచనా వేయగలుగుతాం. పరీక్షల ఒత్తిడి, ఒంటరితనం, ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు... ఇలా ఆత్మహత్యకు పురిగొల్పే అంశాలు అనేకం ఉంటాయి. కాబట్టి వారిని వేధిస్తున్న సమస్యను సానుకూలంగా అర్థం చేసుకుని, సాధ్యమైన పరిష్కారాన్ని సూచిస్తాం. అవసరాన్ని బట్టి విడతలవారీ టెలి కౌన్సెలింగ్ చేస్తాం. ఆత్మహత్య ఆలోచన విరమించుకున్న తర్వాత కూడా, అప్పుడప్పుడూ కాల్ చేస్తూ క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంటూ ఉంటాం. ఒకవేళ ఆత్మహత్య ఆలోచనకు మానసిక సమస్యలు కారణమని తేలితే, మానసిక వైద్యులను కలవమని కూడా సూచిస్తూ ఉంటాం. కౌన్సెలింగ్‌తో ఆత్మహత్య ఆలోచనను విరమించుకుని, మా సంస్థకు వాలంటీర్లుగా పని చేయడానికి ముందుకొచ్చిన వాళ్లు కూడా ఉన్నారు

ఆత్మహత్య మానుకుని వాలంటీరుగా మారి...

సైన్యంలో ఉన్నత హోదాలో సేవలందించిన ఒక వ్యక్తి, కుటుంబ సమస్యలతో, ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గరకు చేరుకుని, నీళ్లలోకి దూకి చనిపోబోతున్నానంటూ వన్ లైఫ్‌కు కాల్స్ చేయడం మొదలుపెట్టాడు. ఫోన్లో కౌన్సెలింగ్ అందించి, అతని ప్రయత్నాన్ని అడ్డుకునే సమయం లేదు. ఏమాత్రం తాత్సారం చేసినా విలువైన ప్రాణాలు పోతాయి. కాబట్టి అప్పటికప్పుడు పరిస్థితి తీవ్రతను అంచనా వేసి, స్వయంగా నేనే రంగంలోకి దిగి, దోమలగూడ పోలీస్ స్టేషన్‌కు అతని వివరాలను అందించాను. వెంటనే పోలీసులు అప్రమత్తమై, ట్యాంక్‌బండ్‌కు చేరుకుని, అతన్ని అడ్డుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పుడు స్టేషన్‌కు వెళ్లి, అతన్ని కలిసి, వ్యక్తిగతంగా కౌన్సెల్ చేశాను. ఆ తర్వాత కొంత కాలానికి అతను కూడా మా సంస్థకు వాలంటీర్‌గా మారిపోయి, తనలాంటి ఇతరులకు కౌన్సెలింగ్ ఇవ్వడం మొదలుపెట్టాడు. ఒక సందర్భంలో కర్ణాటకకు చెందిన ఒక మహిళ ఒక స్ట్రిప్ నిద్ర మాత్రలు మింగి, దిక్కుతోచని స్థితిలో మాకు కాల్ చేసింది. అప్పుడు తనంతట తానే క్యాబ్‌లో ఆసుపత్రికి వెళ్లేలా ఆమెను ప్రేరేపించి, అదే సమయంలో ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి తగిన చికిత్స ఏర్పాట్లను సిద్ధం చేయించాం."



పదిహేను రకాల థెరపీలు

"నేను ఎమ్ఎ సైకాలజీ చేశాను. ఫ్యామిలీ కౌన్సెలింగ్, ఛైల్డ్ కౌన్సెలింగ్, అడిక్షన్ కౌన్సెలింగ్ చేస్తూ ఉంటాను. అలాగే కాగ్నిటివ్ బిహేవియర్, యాంగర్ మేనేజ్‌మెంట్... ఇలా 15 రకాల థెరపీలను కూడా అందిస్తూ ఉంటాను. మాది హైదరాబాదే! మావారు కల్పేష్ దానిధారియా వ్యాపారి. మాకు ఇద్దరు మగ పిల్లలు. ప్రస్తుతం వన్‌లైఫ్‌కు మెంటర్‌గా పనిచేయడంతో పాటు ఛైల్డ్ అండ్ విమెన్ ప్రొటెక్షన్‌కు ఫ్యామిలీ కౌన్సెలర్, ఛైల్డ్ సైకాలజిస్ట్‌గా కూడా సేవలందిస్తున్నాను."

వన్ లైఫ్ హెల్ప్‌లైన్: 7893078930

• గోగుమళ్ల కవిత



- ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్స్, కూల్ కేక్‌లు, స్వీట్లు తీసుకోకూడదు. వీటివల్ల శరీరంలో శ్లేష్మం ఉత్పత్తి పెరిగి జలుబు, దగ్గు వస్తాయి. ఫ్రిజ్‌లో నుంచి తీసిన ఆహార పదార్థాలను కొద్దిసేపు బయట ఉంచి గది ఉష్ణోగ్రతకు వచ్చిన తరువాతనే తినాలి.
- రాత్రి సమయంలో పెరుగు తినకూడదు. పలుచని మజ్జిగను మితంగా తీసుకోవచ్చు. వీటివల్ల కఫం పెరిగి ఆస్తమా, శ్వాసకోశ సమస్యలు రావచ్చు.
- నూనెలో వేయించిన పదార్థాలను తినకూడదు. వీటివల్ల కడుపులో ఆమ్లత్వం, ఉబ్బరం, అజీర్తి లాంటి సమస్యలు ఏర్పడవచ్చు
- చలిగా ఉందంటూ ఎక్కువగా టీ, కాఫీ తాగకూడదు. వీటివల్ల శరీరంలో డీహైడ్రేషన్ సమస్యలు ఏర్పడతాయి.
- ద్రాక్ష, కమలాలు, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను ఎక్కువగా తినకూడదు. వీటివల్ల గొంతునొప్పి, కడుపులో మంట రావచ్చు. వీటిని మితంగా మధ్యాహ్నం సమయంలో తీసుకోవచ్చు.
- వంటకాల్లో ఎక్కువగా కారం, ఘాటైన మసాలాలు వాడకూడదు. వీటివల్ల పలు జీర్ణాశయ సమస్యలు ఏర్పడతాయి. అల్లం, దాల్చిన చెక్క, మిరియాలు వాడుకోవచ్చు.

ముఖం... మిలమిల

ఇంట్లో ఉండే శనగపిండితో ముఖాన్ని అందంగా మెరిపించుకోవచ్చు. ఆ చిట్కాలే ఇవి.

- చిన్న గిన్నెలో రెండు చెంచాల శనగపిండిని తీసుకుని అందులో ఒక చెంచా తేనె, కోడిగుడ్డు తెల్ల సొన వేసి బాగా కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి పావు గంట తరువాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే ముఖం మృదువుగా మెరుస్తుంది.
- ఒక చెంచా శనగపిండిలో ఒక చెంచా గంధం పొడి, మూడు చెంచాల పెరుగు కలిపి పేస్టులా చేయాలి. దీన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పలుచగా రాయాలి. పావుగంట తరువాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకుంటే చర్మరంధ్రాలు పూర్తి శుభ్రమవుతాయి. జిడ్డు చర్మం ఉన్నవారికి మొటిమల సమస్య తీరుతుంది. ముఖం కాంతివంతంగా మారుతుంది.
- గిన్నెలో పావు కప్పు శనగపిండి, మూడు చెంచాల టమాటా గుజ్జు, రెండు చెంచాల కీర పేస్టు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి బాగా ఆరనివ్వాలి. తరువాత మంచినీటితో కడిగేసుకుంటే ఫలితం కనిపిస్తుంది
- ఒక చెంచా శనగపిండిలో రెండు చెంచాల బాదం నూనె లేదా నాలుగు చెంచాల పాలు కలిపి ముఖానికి రాసి సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే ముఖం ఛాయగా కనిపిస్తుంది. పొడిచర్మం ఉన్నవారికి ఇది మంచి ఫలితాన్నిస్తుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, ఒక చెంచా నానబెట్టిన ఓట్స్, ఒక చెంచా తేనె, ఒక చెంచా రోజ్ వాటర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి కొద్దిగా ఆరిన తరువాత వేళ్ల కొనలతో మర్దన చేయాలి. ఆపైన మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే మొటిమల వల్ల వచ్చిన మచ్చలు తొలగిపోతాయి.



ఫ్యాషన్

టీనేజర్ల నగలు



వేడుకల్లో 16 నుంచి 20 ఏళ్ల లోపు అమ్మాయిలదే సరదా అంతా! ఎలాంటి వేడుకలో అయినా, అలంకరణలో ముందుండాలి అన్న తీరులో అలంకరించుకుంటారు ఈ ఈడు అమ్మాయిలు. అలాంటి ఆడపిల్లల కోసమే ఈ జ్యువెలరీ టిప్స్!

చోకర్ అందాలు!

నలుగురి దృష్టి ఆకట్టుకునే వెరైటీ జ్యువెలరీ ధరించాలని ఈ ఈడు పిల్లలు ఉబలాటపడతారు. అందుకోసం మరెక్కడా దొరనంత అపురూపంగా కనిపించే ప్రత్యేకమైన డిజైన్లు, కొత్త రకం నగలు ఎంచుకోవాలి. ఈ కోవకు చెందిన నగ...'చోకర్'! మెడకు దగ్గరగా ఉండే ఈ చోకర్ పోల్కి రకం అయి ఉండాలి. మెడకు హత్తుకునేలా ఉండాలి. వదులుగా, జారుతున్నట్టుగా ఉండకూడదు.





తెలుపుకే తొలి ప్రాధాన్యం!

ఎన్ని జాతి రాళ్లు ఉన్నా, తెలుపుకు ఉండే ఆకర్షణ అంతా ఇంతా కాదు. ఎక్కువ శాతం వేడుకలు రాత్రి వేళ జరుగుతూ ఉంటాయి కాబట్టి చీకట్లో ధగధగా మెరిసే వజ్రాలకే తొలి ప్రాధాన్యం! డైమండ్ లేదా పోల్కి, వైట్ కుందన్ నగలను ఎంచుకోవాలి.



పొడవాటి 'ఇయర్ రింగ్స్'

ఈ ఈడు పిల్లలు అనుసరించవలసిన మరో జ్యువెలరీ ఫ్యాషన్ పెద్ద ఇయర్ రింగ్స్! ఇవి భుజాలను తాకేంత పొడవుగా, భారీగా ఉండాలి. పోల్కీ, సెజాట్స్ లేదా మోజనైట్...ఇలా ఏ కోవకి చెందినవైనా టీనేజ్ ఆడపిల్లలకు సూటవుతాయి.





గురక తగ్గేదెలా..?

స్థూలకాయం, ముక్కు సంబంధిత అలెర్జీలు, మద్యపానం, ధూమపానం, వెల్లకిలా పడుకోవడం లాంటి కారణాల వల్ల గురక సమస్య ఏర్పడుతూ ఉంటుంది. గురకను నివారించే చిట్కాలు ఇవే...

- ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో అయిదు పుదీనా ఆకులు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి. తరువాత ఆ నీటితో నోటిని పుక్కిలిస్తే గురక తగ్గుతుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె కలుపుకుని తరచు తాగుతూ ఉంటే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.



- రోజూ ప్రాణాయామం చేయడం వల్ల శ్వాసనాళాలు పూర్తిగా శుభ్రమై గురక తగ్గుతుంది.
- తరచూ చూయింగ్ గమ్ నములుతూ ఉంటే గొంతు కండరాలు బలపడి గురక రాదు.
- రోజుకు అయిదుసార్లు బెలూన్ ఊదడం వల్ల గొంతు నుంచి శ్వాసనాళాల మార్గం పూర్తిగా తెరుచుకుని గురక సమస్య తీరుతుంది.
- రోజుకు రెండుసార్లు అల్లం టీ తాగుతూ ఉంటే గొంతులో ఏర్పడిన అడ్డంకులు తొలగి గురక రాదు.
- రోజూ ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి చేర్చుకోవడం వల్ల టాన్సిల్స్ సమస్యలు తగ్గి గురక సమస్య తీరుతుంది.

అరుణకాంతులు

ఒకవైపు బకింగ్‌హామ్ ప్యాలెస్ రాజసం.. మరోవైపు తిహాడ్ జైలు గోడల మధ్య నిశ్శబ్దం. ఈ రెండు విభిన్న ప్రపంచాలను తన కూచిపూడి నృత్యంతో కలిపిన అసాధారణ ప్రయాణం అరుణిమ కుమార్‌ది. కళ కేవలం ప్రదర్శనకు మాత్రమే కాదని, అది మానవత్వానికి, మానసిక స్వస్థతకు, సాంస్కృతిక వారధికి ఓ శక్తివంతమైన సాధనమని ఆమె నిరూపిస్తున్నారు. లండన్‌ను కేంద్రంగా చేసుకొని ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లో కూచిపూడి కీర్తి పతాకాన్ని ఎగురవేస్తూ వేలాదిమంది జీవితాల్లో స్ఫూర్తి నింపుతున్నారు.



ఇటీవలే కింగ్ చార్లెస్‌3 చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'బ్రిటిష్ ఎంపైర్ మెడల్' అందుకున్న తొలి కూచిపూడి నృత్యకారిణిగా అరుణిమ చరిత్ర సృష్టించారు. కళ ద్వారా సమాజ సేవకు, సాంస్కృతిక సమ్మేళనానికి ఆమె చేస్తున్న కృషికి దక్కిన అరుదైన గౌరవమిది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి డిగ్రీలు అందుకుని ఫైనాన్స్ రంగంలో పనిచేసిన అరుణిమ జీవితం ఓ అరుదైన మలుపు తీసుకుంది. తీవ్ర అనారోగ్యంతో ఆపరేషన్ థియేటర్‌లో మృత్యువుతో పోరాడుతున్నప్పుడు ఆమె ఒకటే అనుకున్నారు. "ఒకవేళ నేను బతికితే నా జీవితాన్ని అర్థవంతంగా మలచుకోవాలి" అని. ఆ సంకల్పమే ఆమెను చిన్నప్పుడు ఎంతగానో ప్రేమించిన కూచిపూడి వద్దకు చేర్చింది.



ప్రయాణాన్ని మార్చిన క్షణం

యూకేకి వెళ్లిన తొలినాళ్లలో భారతీయ శాస్త్రీయ నృత్యంపై, ముఖ్యంగా కూచిపూడిపై అక్కడి వారికి ఉన్న అవగాహన తక్కువని అరుణిమ గ్రహించారు. ప్రవాస భారతీయ యువత తమ మూలాలతో సంబంధం కోల్పోతున్నారని గమనించారు. తన నాట్యం ద్వారా ఆ కొరతను తీర్చాలని సంకల్పించారు. సవాళ్లను అధిగమించి లండన్‌లోని సౌత్‌బ్యాంక్ సెంటర్‌లో ప్రదర్శన ఇచ్చే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఆ క్షణం ఆమె ప్రయాణాన్ని మార్చేసింది. నేడు భారతదేశం వెలుపల అతిపెద్ద కూచిపూడి శిక్షణ సంస్థను ఆమె నడుపుతున్నారు. ఏటా 250 మందికిపైగా విద్యార్థులకు శిక్షణ ఇస్తూ బకింగ్‌హామ్ ప్యాలెస్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అత్యున్నత వేదికలపై భారతీయ కళను ప్రదర్శిస్తున్నారు.

నాట్యంతో పరివర్తన


ఢిల్లీలోని తిహాడ్ జైలులో అరుణిమ చేస్తున్న కృషి ఆమె ప్రస్థానంలో అత్యంత స్ఫూర్తిదాయకమైన అంశం. ఆసియాలోనే అతిపెద్ద కారాగారాల్లో ఒకటైన ఈ జైలులో ఆమె ఖైదీలకు కూచిపూడి నేర్పిస్తున్నారు. "ప్రతి మనిషిలోనూ ఒక అంతర్గత లయ ఉంటుంది. దానిని ప్రోత్సహిస్తే వారి మనసు, శరీరం, హృదయం పరివర్తన చెందుతాయి" అంటారు అరుణిమ. ఒకప్పుడు తనను చిత్రహింసలు పెట్టిన భర్తను హత్యచేసిన కేసులో శిక్ష అనుభవిస్తున్న ఓ మహిళ అరుణిమకు ఎదురైంది. 'ఇక్కడ మీరు ఖైదీలా బందీగా ఉన్నానని అనుకుంటున్నారా?' అన్న ప్రశ్నకు ఆమె చెప్పిన సమాధానం అరుణిమను కదిలించివేసింది. "లేదు, ఇక్కడే స్వేచ్ఛగా ఉన్నాను. రోజూ దెబ్బలు తినే భయం లేదు. భయంతో నిద్ర లేవాల్సిన అవసరం లేదు. అందుకే ఇక్కడే నాకు నిజమైన స్వేచ్ఛ దొరికింది" అన్న ఆమె మాటలు 'బంధిని' అనే నృత్యరూపకానికి ప్రాణం పోశాయి. 'నిజమైన ఖైదీ ఎవరు?' అనే ప్రశ్నను ఈ రూపకం సంధిస్తుంది.

భవిష్యత్ తరాలకు వారసత్వం

లండన్‌లోని తన స్టూడియోలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎందరికో అరుణిమ గురువుగా మారారు. గోల్డ్‌మన్ సాక్స్ వంటి సంస్థల్లో పనిచేసే ఉన్నతోద్యోగులు సైతం ఆమె వద్ద నృత్యం నేర్చుకుంటూ మానసిక ప్రశాంతత పొందుతున్నారు. "ఈ నృత్యం మా జీవితంలో ఒక భాగమైపోయింది. ఇది మా మనసు, శరీరం, ఆత్మను ఏకం చేస్తోంది" అని ఆమె విద్యార్థులు చెబుతారు. భారతీయ కళను విదేశీ గడ్డపై ప్రదర్శిస్తున్న ఆమె... ఒక సంప్రదాయాన్ని కాపాడటం లేదు.. దానికి కొత్త అర్థాన్ని ఇస్తూ కొత్త తరానికి అందిస్తున్నారు. అణచివేతకు గురైనవారికి, తమ మూలాలు వెతుక్కుంటున్న వారికి... ఇలా ఎందరికో నాట్యంతో ఒక చికిత్సలా, స్ఫూర్తి దీపికలా దారి చూపుతున్నారు.

ముత్యాల ముగ్గు

20 చుక్కలు
2 వరుసలు 2 వచ్చే వరకు
చుక్క విడిచి చుక్క





ఊహ చేకూరి,
గొల్లపూడి, విజయవాడ

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్ హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

ఈ లేడీ లెక్చరర్.. వీకెండ్ దొంగ!



నిందితురాలు రేవతి, స్వాధీనం చేసుకున్న నగలు

బెంగళూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వారమంతా కాలేజీలో పాఠాలు చెప్పడం ఆమె వృత్తి. వారంతంలో చోరీలు చేయడం ఆమె ప్రవృత్తి. పెళ్లివేడుకలే టార్గెట్. ఇలా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అధ్యాపకురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె పేరు రేవతి. శివమొగ్గ జిల్లాకు చెందిన ఆమె బెంగళూరు కేఆర్ పురం ప్రాంతంలో నివసిస్తున్నారు. బెళ్లందూరు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలు. వారమంతా పాఠాలు చెప్పే ఈమె.. వీకెండ్‌లో దొంగ అవతారం ఎత్తుతారు. ఎక్కడెక్కడ పెళ్లిళ్లు జరుగుతున్నాయో తెలుసుకుని, అతిథిలా వెళ్లి ఆభరణాలను కాజేస్తుంటారు. కల్యాణ మండపంలో అందరినీ పలకరిస్తూ హడావుడి చేస్తుంటారు. ఆభరణాలు చోరీ చేసి, మాయమౌతారు. ఇదే తరహాలో నవంబరు 25న బసవనగుడిలోని ద్వారకనాథ కల్యాణ మండపంలో జరిగిన పెళ్లికి ఆహ్వానం లేకున్నా ఆమె వెళ్లారు. అక్కడ బంగారు ఆభరణాలను కాజేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీ టీవీ ఫుటేజీ, పెళ్లిలో తీసిన వీడియోల ఆధారంగా అనుమానితులను గుర్తించారు. వారి వివరాలను ఆరా తీయగా, రేవతి దొరికిపోయారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు.. 'వారాంతపు దొంగతనాల' గురించి తెలుసుకుని నివ్వెరపోయారు. ఆమె నుంచి రూ.32 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

ఆప్కో ఆఫర్ డిస్కౌంట్ 60%



అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, నూతన సంవత్సరం సందర్భంగా చేనేత వస్త్రాలపై చేనేత జౌళి శాఖ భారీ డిస్కౌంట్ ప్రకటించింది. మంగళగిరిలో 60శాతం, విజయవాడ ఆప్కో షోరూమ్‌లో 50శాతం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 40శాతం రాయితీ ఇవ్వనుంది. తెలుగు వారందరూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ఆదరించాలని ఆ శాఖ మంత్రి ఎస్.సవిత కోరారు. చేనేతల సమస్యలు, నేతన్నలకు రాయితీ, వస్త్ర వ్యాపారాలు, క్లస్టర్ల ఏర్పాటు, సొసైటీల నుంచి నేత ఉత్పత్తుల కొనుగోలు తదితర అంశాలపై మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి మంగళవారం సమీక్షించారు. నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ఆప్కో ద్వారా డిస్కౌంట్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఈ నెల 29 నుంచి రాయితీతో వస్త్రాలు విక్రయించాలని మంత్రి అధికారులకు నిర్దేశించారు. తిరుపతిలో ఈ నెల 26 నుంచి చేనేత ఎగ్జిబిషన్ నిర్వహించాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల చేనేతల ఉత్పత్తులు ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్, పిఠాపురంలో స్పెషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్, అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం, రాష్ట్రవ్యాప్తంగా 30 ఆప్కో షోరూమ్‌ల అభివృద్ధికి రూ.99.60 కోట్ల ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు ఈ సమావేశంలో కమిషనర్ రేఖా రాణి వివరించారు.

కొత్త జంటకు శ్రీవారి అక్షింతలు!



తిరుమల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నూతన వధూవరులకు శ్రీవారి దీవెనలతో అక్షింతలు, కుంకుమ, కంకణం, ఆశీర్వచనం పత్రిక, కల్యాణ సంస్కృతి అనే పుస్తకాన్ని టీటీడీ అందిస్తోంది. ప్రతి ఏడాది శుభలేఖ పంపిన లక్షకు పైగా జంటలకు శ్రీవారి ఆశీస్సులతో కల్యాణం జరుగుతోంది. ఈ మహత్తర కార్యక్రమాన్ని టీటీడీ కొన్నేళ్లుగా కొనసాగిస్తోంది. కల్యాణంలో మొదటి ఘట్టంగా వధూవరులకు కంకణధారణ చేస్తారు. ఇందుకోసం శ్రీపద్మావతి అమ్మవారి ఆశీస్సులతో కుంకుమతో పాటు కంకణాన్ని పంపుతున్నారు. ఇక, వివాహంలో చివరిగా తలంబ్రాలు పోసే ఆచారం ఉంది. కొత్త దంపతులకు సకల మంగళాలు కలగాలని, వారి దాంపత్యం ఫలప్రదం కావాలని కోరుతూ టీటీడీ శ్రీవారి ఆశీస్సులతో తలంబ్రాలు పంపుతోంది. ఇక, వివాహ వ్యవస్థ గురించి తెలిపేందుకు 'కల్యాణ సంస్కృతి' పుస్తకాన్ని, శ్రీవారు, అమ్మవారి ఫొటోలతో కూడిన వేదాశీర్వచన పత్రికను పంపుతున్నారు. కొత్త జంటలకు శ్రీవారి ఆశీస్సులు అందించడానికి తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఉన్న తపాలా విభాగం సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. దీనికోసం వధూవరులు తమ పూర్తి చిరునామాతో 'కార్యనిర్వాహణాధికారి, టీటీడీ పరిపాలన భవనం, కేటీ రోడ్డు, తిరుపతి 517501' పేరుతో వివాహ పత్రికను పంపాలి. మరిన్ని వివరాలకు కాల్ సెంటర్ నం.155257లో భక్తులు సంప్రదించవచ్చు.

పల్లె వెలుగుకూ ఏసీ బస్సులే!



అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యావరణ రహిత ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధే లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది పీఎం-ఈ బస్ సేవా పథకం కింద రాష్ట్రానికి 1,050 ఎలక్ట్రిక్ వాహనాలు ఇస్తోందన్నారు. ఏపీఎస్ఆర్టీసీలోని పల్లె వెలుగు బస్సులు సైతం ఏసీ ఎలక్ట్రిక్ బస్సులే ఉండాలని, వచ్చే ఏడాది ఆర్టీసీ సేకరించుకునే వాటిలో ఏసీ బస్సులైనా పల్లె వెలుగు కోటా మేరకు కేటాయించాలని అధికారులకు నిర్దేశించారు. వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో మంగళవారం ఆర్టీసీపై సమీక్షించిన ఆయన వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొత్తం 1,450 బస్సులు సమకూర్చుకోవడమే ఏపీఎస్ఆర్టీసీ లక్ష్యం కావాలన్నారు. రాబోయే ఐదేళ్లలో 8,819 ఆర్టీసీ డీజిల్ బస్సుల స్థానంలో అన్నీ ఈవీలే ఉండాలన్నారు. ఎనిమిది సంవత్సరాలకు పైబడిన బస్సులన్నీ తప్పనిసరి ఈవీలుగా మార్చాలని, స్త్రీ శక్తి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.







వలస పక్షుల వినోదం!

పులికాట్‌లో విదేశీ అతిథుల సందడి

నల్లని మబ్బులు గుంపులు.. గుంపులు.. తెల్లని కొంగలు బారులు..బారులు..! తిరుపతి జిల్లా పులికాట్ సరస్సులో విదేశీ వలస పక్షుల సందడి వీక్షకులకు ఇదే అనుభూతిని కలిగిస్తోంది! ఇటీవల కురిసిన వర్షాలకు కళకళలాడుతున్న పులికాట్‌లో ఓవైపు చేపలు, రొయ్యల వేటలో మత్స్యకారుల పడవలు తిరుగుతుండగా, మరోవైపు వారి చుట్టూ పక్షులు విహరిస్తున్నాయి. ఫ్లెమింగోలు, పెయింటెడ్ స్టార్క్స్, తెడ్డుముక్కు కొంగలు గుంపులుగా ఎగిరొచ్చి సరస్సు అంతా పరుచుకున్నాయి. ఇప్పటికే 50వేలకు పైగా పక్షులు చేరుకున్నట్లు అంచనా. ఇవికాక నేలపట్టు నుంచి పెలికాన్‌లు, వెదురుపట్టు నుంచి పెయింటెడ్ స్టార్క్స్ సరస్సులో చేపలవేట సాగిస్తున్నాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డుకు అటూ ఇటూ, అటకానితిప్ప వేనాడు దారి.. కొరిడి-పేర్నాడు రోడ్డుకు తూర్పు దిక్కున, శ్రీహరికోటకు పడమర దిక్కున, నవాబుపేట ప్రాంతంలో వేలసంఖ్యలో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

క్వాంటమ్‌తో భవిత బంగారం

(మొదటి పేజీ తరువాయి)

క్వాంటమ్ కంప్యూటింగ్ నైపుణ్యంతో ఎవరైనా నోబెల్ బహుమతిని సాధిస్తే వారికి రూ.100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అమరావతి వేదికగా మంగళవారం పలు ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన 50,000 మందికిపైగా టెక్ విద్యార్థులతో "క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్" కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సహా వివిధ ఆధునిక సాంకేతికతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. "యువత రేపటి గురించి ఆలోచిస్తే.. నేను 20 ఏళ్ల ముందుకు ఆలోచిస్తాను. అందులో భాగమే అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సహా పునరుత్పాదక విద్యుత్తు, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో కొత్త ఆవిష్కరణను అందించే పూచీ నాది. దానిని అందుకునే బాధ్యత విద్యార్థులు, యువతదే. ఆరునెలల్లోనే క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ భవనాన్ని నిర్మించాలని సీఆర్‌డీఏ సమావేశంలో దిశానిర్దేశం చేశాం. అమరావతి క్వాంటమ్‌వ్యాలీని అద్భుతంగా నిర్మిస్తున్నాం. గత నెల 13వ తేదీన క్వాంటమ్ కంప్యూటర్‌పై నేను చేసిన ప్రకటన ఎందరిలోనో విశ్వాసాన్ని పెంచింది. ఏపీ స్పీడ్ లెర్నర్. క్వాంటమ్ కంప్యూటింగ్ కంటే ఆంధ్రప్రదేశ్ స్పీడ్‌గా పరుగులు తీస్తోంది.

భారతీయుల డీఎన్ఏలోనే విజ్ఞానం

విజ్ఞానం భారతీయుల డీఎన్ఏలోనే ఉంది. క్రీస్తు పూర్వం 2500లోనే పట్టణ ప్రణాళికలు రచించారు. భారత్‌కు బంగారు పిచ్చుక అనే పేరుంది. గణితంలో భారతీయులు చురుగ్గా ఉంటారు. 2000 ఏళ్ల కిందటే ప్రపంచ జీడీపీలో 40శాతం భారత్. ఇప్పుడు జీడీపీలో ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నాం. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వంలో 2047 నాటికి కచ్చితంగా మొదటి స్థానంలో ఉంటాం. వికసిత్ భారత్ దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోంది. 30 ట్రిలియన్ డాలర్ వ్యవస్థగా వృద్ధి చెందుతోంది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, జీఎస్టీలాంటి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ ప్రొఫెషనల్స్‌లో ఒకరు భారతీయులైతే.. నలుగురు భారతీయుల్లో ఒకరు ఉమ్మడి ఏపీకి చెందినవారు ఉన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రపంచానికి నిపుణులను అందించాం. సైబరాబాద్ హైటెక్ సిటీని ఎల్అండ్‌టీ 14 నెలల్లో నిర్మించింది. ఇప్పుడు అమరావతి క్వాంటమ్ వ్యాలీని కూడా నిర్మిస్తోంది. మన యువత భవిష్యత్తు తేజోవంతంగా కనిపిస్తోంది. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ కృష్ణలాంటి వారు దిగ్గజ కంపెనీలకు సారథ్యం వహిస్తున్నారు. గతంలో ఐటీ అనుబంధ సేవలను వివిధ దేశాలకు భారత్ నుంచే అందించాం. ముఖ్యంగా తెలుగువారే అందించారు. విశాఖలో ఇప్పుడు గూగుల్ వంటి అతిపెద్ద సంస్థ డేటా సెంటర్‌ను స్థాపిస్తోంది. అతిపెద్ద సీ-కేబుల్ వేను నిర్మిస్తోంది.

త్వరలో క్వాంటమ్ టెక్నాలజీ కోర్సులు

- పాఠశాల స్థాయి నుంచే క్వాంటమ్‌పై శిక్షణ
- ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో భేటీలో సీఎం



ఐఐటీ మద్రాస్ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతకు కొత్త నైపుణ్యాల కల్పనకు త్వరలో క్వాంటమ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో డిజిటల్ విధానంలో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించే ప్రతిపాదనను ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు వివరించారు. నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా తయారుచేసిన యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. సీఎం మాట్లాడుతూ.. "ప్రభుత్వ విద్యాసంస్థల్లో 7 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఆ టెక్నాలజీపై అవగాహన కల్పించాలి. జనవరి నెలాఖరులో విద్యార్థుల పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహిస్తాం. రాష్ట్రంలో మొత్తం 50వేల మంది టెక్ విద్యార్థులకు క్వాంటమ్‌పై నైపుణ్య శిక్షణ అందాలి. వచ్చే ఏడాది జనవరి నాటికి క్వాంటమ్‌పై పాఠ్యాంశాలు రూపొందించాలి" అని అన్నారు.

పలు రంగాల్లో క్వాంటమ్ పరిశోధనలు

'రాష్ట్రాన్ని క్వాంటమ్ హబ్‌తో పాటు గ్రీన్‌హైడ్రోజన్ హబ్‌గా మారుస్తున్నాం. రాష్ట్ర ఇరవై ఏళ్ల భవిష్యత్తుకు కార్యాచరణను సిద్ధం చేశాం. ప్రధాని మోదీ చొరవతో స్థాపించిన నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా రాష్ట్రానికి ఎన్నో పెట్టుబడులు వస్తున్నాయి. ఐటీ విప్లవం తరహాలోనే క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాన్ని కూడా భారతీయులు అందిపుచ్చుకోవాల్సి ఉంది. వైద్యం, విద్యుత్తు, సుస్థిర వ్యవసాయం, ఫైనాన్షియల్ మోడలింగ్, మెటీరియల్ డిస్కవరీ, వెదర్ ఫోర్ కాస్టింగ్ వంటి అంశాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలు అవసరమవుతాయి క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలకు ఆకాశమే హద్దు. వ్యక్తిగత ఔషధాలు, ప్రివెంటివ్ క్యూర్, హెల్త్‌కు సంబంధించి క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలు సహకరిస్తాయి' అని చంద్రబాబు చెప్పారు.

పాస్టర్లకు క్రిస్మస్ కానుక

గౌరవ వేతనాలకు 50 కోట్లు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో క్రైస్తవుల భద్రతకు, గౌరవానికి ఎలాంటి భంగం కలగనివ్వం. వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. క్రిస్మస్‌కు ముందే ఈ నెల 24లోగా పాస్టర్లకు గౌరవ వేతనం అందజేస్తాం' అని సీఎం చంద్రబాబు సోమవారం రాత్రి విజయవాడలో జరిగిన క్రిస్మస్ వేడుకలు సందర్భంగా ఇచ్చిన హామీ.. 24 గంటల్లోగానే అమలైంది. పాస్టర్ల గౌరవ వేతనాల కోసం రూ.50.04కోట్లు విడుదల చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా 8,427 మంది పాస్టర్లకు లబ్ధి చేకూరుతుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు. 2024 డిసెంబరు నుంచి 2025 నవంబరు వరకు.. ఒక్కొక్కరికి నెలకు రూ.5వేల చొప్పున 12 నెలల గౌరవ వేతనం అందించేందుకు నిధుల విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమాన్ని అణగదొక్కే ప్రయత్నం చేశారని ఫరూక్ విమర్శించారు.

రాష్ట్రంలో చలి పులి

జి.మాడుగులలో 6 డిగ్రీలు

విశాఖపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతం నుంచి అతి శీతల గాలులు మధ్య భారతం మీదుగా కోస్తా, రాయలసీమ వరకూ వీస్తున్నాయి. దీంతో కోస్తా, రాయలసీమల్లో చలి కొనసాగుతోంది. ఉదయం పూట పొగమంచు కురుస్తోంది. పగలు ఎక్కువ సమయం చల్లగా ఉంటోంది. మంగళవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2నుంచి 3డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. జి.మాడుగులలో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 3రోజులు చలి పెరగడంతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

పంటలకు ప్రత్యేక క్యాలెండర్

రైతులకు ప్రయోజనకరంగా రూపొందించండి



- దానికి అనుగుణంగా ఖరీఫ్, రబీ పంటల సాగు, మార్కెటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి
- గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి: సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా ఖరీఫ్, రబీ సీజన్ల పంటలకు ప్రత్యేక క్యాలెండర్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులను ఆదేశించారు. ఆ క్యాలెండర్‌కు అనుగుణంగా పంటల సాగు, మార్కెటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ధాన్యం కొనుగోళ్లు, వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌లు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆయా సీజన్లలో ఎలాంటి పంటలు వేయాలి, రైతులకు ఏది ప్రయోజనం అనే అంశాలపై అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పంట ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు కోత సమయంలోనూ తగిన సూచనలు ఇవ్వాలన్నారు. కోల్డ్‌చైన్ ద్వారా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు మన పంట ఉత్పత్తులను తరలించడంతోపాటు వాటి ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లకు పంట ఉత్పత్తులను తరలించేందుకు రైలు రవాణా వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

రైతులకు చెల్లింపుల్లో ఇబ్బందులు ఉండొద్దు

రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో మాట్లాడి రైతులకు చెల్లింపుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో రైసు మిల్లర్లు అక్రమాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎదురవుతున్న బ్యాంకు గ్యారంటీ సమస్యలను పరిష్కరించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్లు ఒకే తరహా బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానం మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశం నుంచే రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కన్వీనర్‌తో ముఖ్యమంత్రి మాట్లాడి తగిన ఆదేశాలు జారీచేశారు.

మామిడి రైతులకు అండగా ఉన్నాం

మామిడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.184 కోట్లను రాయితీగా చెల్లిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా కేజీకి రూ.4 చొప్పున అదనపు ధర చెల్లిస్తున్నామని చెప్పారు. పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. రైతుల ఇబ్బందులను పది రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మామిడి రైతులకు అండగా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. జనవరిలో ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.

రూ.20కే కిలో గోధుమ పిండి

జనవరి 1 నుంచే రేషన్‌షాపుల్లో పంపిణీ

తొలుత జిల్లా కేంద్రాలు, ముఖ్యపట్టణాల్లోనే అమలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి నెల రేషన్‌లో గోధుమ పిండిని రాయితీపై కార్డుదారులకు సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వివిధ బ్రాండ్లతో విక్రయిస్తున్న గోధుమ పిండి ధర నాణ్యత, రకాలను బట్టి కిలో రూ.40 నుంచి రూ.80 వరకు ఉంది. కొన్ని స్థానిక రకాల గోధుమ పిండి కిలో రూ.30కు కూడా లభిస్తోంది. ఈ నేపథ్యంలో రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయనున్న నాణ్యమైన చక్కీ గోధుమ పిండి ప్యాకెట్ ధర రూ.20గా ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత 26 జిల్లా కేంద్రాలతోపాటు ముఖ్యపట్టణాలు, నగరాల్లో పంపిణీ చేయనున్నారు. ఒక్కొక్క రేషన్‌కార్డుపై కిలో చొప్పున పంపిణీకి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కేంద్రం తాత్కాలిక ప్రాతిపదికన నెలకు 1,838 టన్నులు గోధుమలను రాష్ట్రానికి కేటాయిస్తోంది. దీనిని కార్డుదారులకు సక్రమంగా అందించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. పిండి నాణ్యంగా లేదని, వాసన వస్తోందనే కారణంతో తీసుకోవడానికి కార్డుదారులు ముందుకు రాకపోవడంతో పైలెట్ దశలోనే దాన్ని నిలిపివేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్రాంతి పండగకు పేదలు సైతం పిండి వంటలు చేసుకునేందుకు వీలుగా గోధుమ పిండిని రాయితీపై అందించాలని నిర్ణయించింది. కేంద్ర కేటాయించిన గోధుమలను భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ద్వారా తీసుకున్న రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ.. వాటిని మర పట్టించి నాణ్యమైన చెక్కి గోధుమ పిండిగా మార్చి ఒక్కో రేషన్‌కార్డుకు కేజీ చొప్పున ప్యాకెట్లలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్యాకెట్లను రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్యపట్టణాలు, నగరాల్లోని రేషన్ షాపులకు తరలించి.. జనవరి 1 నుంచే కార్డుదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. వీటిని తీసుకోడానికి రేషన్‌కార్డుదారులు ఆసక్తి చూపితే.. డిమాండ్‌ను బట్టి రాష్ట్రంలోని కార్డుదారులందరికీ ప్రతినెలా సబ్సిడీపై గోధుమ పిండి సరఫరా చేసేందుకు పౌరసరఫరాల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



వాహనం ఢీకొని పెద్ద పులి మృతి



వెల్దుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దపులి మృతిచెందింది. మార్కాపురం డివిజన్ పరిధిలోని శిరిగిరిపాడు బీట్, సెక్షన్ పరిధిలో ఉన్న నేషనల్ హైవే ఎన్‌హెచ్ 565 రహదారిపై ఈ సంఘటన జరిగింది. సమాచారం తెలుసుకున్న వన్యప్రాణుల (వైల్డ్‌లైఫ్) ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వైల్డ్ లైఫ్ డీడీ అబ్దుల్ రవూఫ్, డీఎఫ్‌వో నీరజ్‌హన్స్‌లు మాట్లాడుతూ మృతిచెందినది ఆడ పులి అని తేలిందన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని త్వరలోనే గుర్తిస్తామన్నారు.

అటవీ మార్గాల్లో రాత్రి గస్తీ పెంచాలి: పవన్

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అటవీ సరిహద్దు మార్గాల్లో ప్రయాణించే వాహనదారులంతా వన్యప్రాణుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. మంగళవారం మార్కాపురం డివిజన్‌లో వాహనం ఢీకొని పులి, ఆదోని రేంజ్‌లో రైలు ఢీకొని చిరుత మృతి చెందిన ఘటనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలపై తక్షణం విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వన్యప్రాణుల సంచార మార్గాల్లో హాట్‌స్పాట్స్‌ను గుర్తించి, రాత్రి వేళ గస్తీ పెంచాలని ఆదేశించారు.

రైలు ఢీకొని చిరుత మృతి



ఆదోని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని చిరుతపులి మృతిచెందిన సంఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం కుప్పగల్లు రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఫారెస్ట్ రేంజ్ అధికారిణి తేజస్వి తెలిపిన మేరకు... కుప్పగల్లు రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఓ చిరుత పట్టాలను దాటే క్రమంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఆ ధాటికి చిరుతపులి శరీరం రెండు ముక్కలై అక్కడికక్కడే మృతిచెందింది. పట్టాలపై చిరుతను గమనించిన రైల్వే పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శివరాం పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే దహనక్రియలు నిర్వహించారు. అయితే ఏ రైలు ఢీకొట్టిందనే వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'హెచ్-1బీ' కొత్త లాటరీ విధానం

ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి!.. ఎక్కువ జీతం- ఎక్కువ నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం

న్యూయార్క్, డిసెంబరు 23: హెచ్-1బీ వీసాల కేటాయింపునకు సంబంధించి ప్రస్తుతం అమలు చేస్తున్న లక్కీ లాటరీకి బదులుగా జీతం, నైపుణ్యాలకు అధికప్రాధాన్యమిచ్చేలా కొత్త ఎంపిక ప్రక్రియను ట్రంప్ సర్కారు ఈ ఏడాది సెప్టెంబరులో రూపొందించింది గుర్తుందా? ఆ విధానానికి సంబంధించిన మార్గదర్శకాలు, నిబంధనలను యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్) తాజాగా విడుదల చేసింది. కొత్త విధానం 2026 ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి వస్తుందని.. 2027 ఆర్థిక సంవత్సరం (2026 సెప్టెంబరు 27 నుంచి 2027 సెప్టెంబరు 25 వరకూ ఉండే) హెచ్-1బీ వీసా కోటా నమోదు సీజన్‌కు వర్తిస్తుందని వివరించింది. ప్రస్తుతం ఉన్న లాటరీ విధానం దుర్వినియోగం అవుతోందని, అమెరికన్ల కన్నా తక్కువ వేతనాలకు పనిచేసే విదేశీ కార్మికులను తీసుకురావడానికి ఈ విధానాన్ని కంపెనీలు ఉపయోగించుకుంటున్నాయని యూఎస్‌సీఐఎస్ అధికార ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ అన్నారు. ఇప్పటిదాకా హెచ్-1బీ వీసాల జారీకి డీహెచ్ఎస్ అనుసరిస్తున్న లాటరీ విధానంలో.. ఆ వీసాపై రావాలనుకునే ఉద్యోగులందరూ సమానమే. ప్రతిభ ఆధారంగాగానీ.. జీతం ఆధారంగాగానీ ఎవరికీ ఎలాంటి ప్రాధాన్యమూ ఇవ్వరు. లాటరీ విధానంలో ఎంపికైనవారు అమెరికాకు వచ్చేవారు. కానీ.. కొత్త విధానంలో 'వెయిటెడ్ సెలక్షన్' పద్ధతిని అనుసరిస్తారు. అంటే.. ఎక్కువ నైపుణ్యం ఉండి, ఎక్కువ జీతం అందుకునే వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా.. హెచ్-1బీ వీసాల కోసం వచ్చే దరఖాస్తులను.. ఎక్కువ జీతం(లెవెల్ 4), మధ్యస్థ జీతం(లెవెల్ 3), తక్కువ జీతం(లెవెల్ 2), ఎంట్రీ లెవెల్ అని 4రకాలుగా వర్గీకరిస్తారు. వీరిలో ఎక్కువ నైపుణ్యం, ఎక్కువ జీతం ఉండే లెవెల్ 4వారికి సెలెక్షన్‌పూల్‌లో 4ఎంట్రీలు ఇస్తారు. మధ్యస్థ జీతం ఉన్నవారికి 3ఎంట్రీలు, తక్కువ జీతం ఉన్నవారికి 2ఎంట్రీలు, ప్రవేశస్థాయివారికి ఒక ఎంట్రీ ఇస్తారు. దీంతో ఎక్కువ నైపుణ్యం ఉన్నవారే అమెరికాలో అడుగుపెట్టే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏకీకృత కుటుంబ సర్వే చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను విడుదల చేస్తూ ప్రణాళికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో కచ్చితంగా నమోదు చేసేలా చూడటం దీని లక్ష్యం. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను సకాలంలో అందించడానికి ఈ సర్వే ఉపయోగపడుతుంది. అలాగే ప్రజాసేవల పంపిణీ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. డిసెంబరు నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభమవుతుంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారు. ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రస్తుత పరిస్థితి ధ్రువీకరణ, నవీకరణ చేస్తారు. ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించి గుర్తింపు ధ్రువీకరణ సురక్షితంగా నిర్వహిస్తారు. పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుతూ రికార్డులు ఆధునీకరిస్తారు.

ప్రకృతి రక్షణ సమష్టి బాధ్యత

▸▸ అసెంబ్లీ క్యాలెండర్ ఆవిష్కరణలో సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛమైన ప్రకృతిని కాపాడుకోవడం మనందరి సమష్టి బాధ్యత. అసెంబ్లీ క్యాలెండర్‌ను కూడా అదే సందేశంతో రూపొందించారు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ శాసనవ్యవస్థ రూపొందించిన 2026 సంవత్సరపు అధికారిక వాల్, టేబుల్ క్యాలెండర్లను, డైరీలను సీఎం మంగళవారం ఆవిష్కరించారు. 'జీవ వైవిధ్యం - ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం' శీర్షికతో రూపొందించిన ఈ క్యాలెండర్‌ను రాష్ట్రంలోని సుసంపన్నమైన పర్యావరణ సంపదకు దృశ్య నివాళిగా రూపొందిచారని సీఎం పేర్కొన్నారు. క్యాలెండర్ రూపకల్పనకు కృత్రిమ మేధ(ఏఐ)ని వినియోగించడం బాగుందన్నారు. క్యాలెండర్‌లో ఉన్న 12 వన్యప్రాణులను కేవలం చిత్రాలుగా మాత్రమే చూడకూడదని, అవి భూమిపై మనతో పాటు సహజీవనం చేసే హక్కు కలిగిన జీవులను గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతకు భంగం వాటిల్లితే అనివార్యంగా మానవ-వన్యప్రాణి సంఘర్షణకు దారి తీస్తుందని, దీనిని ఇటీవల కాలంలో తరచుగా చూస్తున్నామని అన్నారు. క్యాలెండర్‌ను వినూత్నంగా రూపొందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్‌తోపాటు కార్యాలయ సిబ్బందిని అభినందించారు. స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ క్యాలెండర్‌లో ఉన్న ప్రతి జీవికి వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని షెడ్యూల్-1 కింద అత్యున్నత రక్షణ కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా పాల్గొన్నారు.

జగన్ రక్తదాహానికి యువత నాశనం: మాణిక్యరావు

వైసీపీ అధినేత జగన్ తన జన్మదినం సందర్భంగా వైసీపీ శ్రేణులకు రాష్ట్రవ్యాప్తంగా అలజడులు సృష్టించాలన్న ఆదేశాలు ఇచ్చారని, ఆయన ఆదేశాల మేరకే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయని లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నడూ లేనివిధంగా ఓ నాయకుడి పుట్టినరోజు సందర్భంగా కార్యకర్తలు కత్తులు తీసుకుని రోడ్ల మీదకు వచ్చి మూగ జంతువులను నరికి, ఆ రక్తంతో తమ నాయకుడి చిత్రపటానికి రక్తాభిషేకం చేశారని అన్నారు. జగన్ తన రక్తదాహాన్ని తీర్చుకునేందుకు యువత భవిష్యత్తును నాశనం చేయాలని కంకణం కట్టుకున్నారని విమర్శించారు.

దివ్యాంగులకు త్వరలో ఉచిత 3 చక్రాల మోటార్ వాహనాలు: మంత్రి డోలా

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మంగళవారం సచివాలయంలో పలువురు దివ్యాంగులు మంత్రిని కలిశారు. ఇటీవల దివ్యాంగులకు ఏడు వరాలు సీఎం చంద్రబాబు ప్రకటించడంపై సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచితంగా త్వరలో త్రీవీలర్స్(రెట్రోఫిటెడ్ మోటారు వాహనాలు) అందిస్తామన్నారు. దివ్యాంగుల కోసం విశాఖలో రూ.200 కోట్లతో పారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తున్నామని తెలిపారు.

సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026

▸▸ సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాకెట్ తయారీ పోటీలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, కాలేజీ యువతలో రాకెట్ల తయారీ నైపుణ్యాలను వెలికి తీసేలా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్ 2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి 24 వరకు గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఫైనల్స్ జరగనున్నాయి. సైన్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సీఎంకు వివరించారు. కాలేజీ స్థాయిలో కెమికల్ రాకెట్రీ, పాఠశాల స్థాయిలో హైడ్రో రాకెట్రీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కెమికల్ రాకెట్రీ విభాగంలో 16 ఏళ్లకు పైబడిన వారు, హైడ్రో రాకెట్రీ విభాగంలో 6-12 ఏళ్ల మధ్య వయస్సున్న వారు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. http://www.sciencecity.ap.gov.in/rocketry_challenge.aspx వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

నాలుగు దఫాలుగా ఓటర్ల జాబితా సవరణ

▸▸ పంచాయతీరాజ్ చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ఏటా నాలుగు దఫాలు రివిజన్ చేసుకునే విధంగా పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ నం.11ను జారీచేసింది. గతంలో ఎన్నికల ఓటర్ల జాబితా ప్రతి ఏటా జనవరి 1 నాటికి నమోదు, సవరణ, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉండేది. ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్ సవరించిన ప్రజాప్రాతినిధ్య చట్ట సవరణ ప్రకారం ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1న అదనంగా ఓటర్ల జాబితా రివిజన్‌కు గడువును నిర్దేశించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల కోసం రూపొందించిన ఓటర్ల జాబితానే పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లోనూ వినియోగిస్తారు. దీని కోసం ఆర్డినెన్స్ తెచ్చేందుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదించింది. ఈనెల 19న గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం కూడా లభించింది. ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇక ఏడాదిలో నాలుగు దఫాలు ఎన్నికల ఓటర్ల జాబితాలో 18 ఏళ్ల నిండిన యువత తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

అధిక వడ్డీకి అప్పులు.. చెల్లించకుంటే దాడులు



రౌడీషీటర్ పండు అతడి అనుచరుడిని నడిరోడ్డుపై నడిపించి తీసుకెళ్తున్న పోలీసులు

▸▸ గంజాయి అమ్మకం, సుపారీ తీసుకుని బెదిరింపులు

▸▸ కృష్ణా జిల్లాలో రౌడీషీటర్ అరెస్టు.. రోడ్డుపై నడిపించిన పోలీసులు

విజయవాడ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలకు అప్పులు ఇస్తాడు. చెల్లించని వారిపైకి అనుచరులను ఉసిగొలుపుతాడు. యువతకు గంజాయి సరఫరా చేస్తాడు. సుపారీ తీసుకుని బెదిరింపులకు పాల్పడుతుంటాడు. ఇలా కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్యాంగ్‌ను నిర్వహిస్తున్న రౌడీషీటర్ కోసూరి మణికంఠ అలియాస్ కేటీఎం పండుకు పోలీసులు కొత్త ట్రీట్‌మెంట్ ఇచ్చారు. పండుతోపాటు అతని అనుచరుడిని రోడ్డుపై నడిపించారు. మాదిరెడ్డి శివకుమార్ అనే యువకుడికి పండు గతంలో ఆటోను అద్దెకిచ్చాడు. ఎక్కువ అద్దెను వసూలు చేస్తుండడంతో శివకుమార్ దాన్ని వెనక్కి ఇచ్చేశాడు. అయితే అద్దె డబ్బులు రూ.5వేలు బాకీ ఉండగా.. దానికి వడ్డీ వేసి విడతల వారీగా రూ.70 వేలు వసూలు చేశాడు. ఈ నెల 21న పండు తన అనుచరుడైన కళింగపట్నం మనోహర్ అలియాస్ బబ్లూని డబ్బులకోసం శివకుమార్ ఇంటికి పంపాడు. మనోహర్.. కరీం, వినోద్, ముక్కలు అలియాస్ దుర్గాప్రసాద్, గిరీష్‌తో కలిసి వెళ్లి శివకుమార్‌పై ఇనుప రాడ్లతో దాడి చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం పండును అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. స్టేషన్‌కు తీసుకెళ్లే క్రమంలో పోరంకి నుంచి వారిని నడిరోడ్డుపై నడిపించారు.

నదుల 'అనుసంధానం'పై త్వరలో సీఎంలతో సమావేశం

▸▸ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్

▸▸ గంగా-కావేరీపై కుదరని ఏకాభిప్రాయం

▸▸ ఇచ్చంపల్లి నుంచి తరలింపునకు అంగీకరించం: ఏపీ

▸▸ ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదనకు అంగీకరిస్తాం: తెలంగాణ

▸▸ మాకు 25 టీఎంసీలంటే ఎలా?: కర్ణాటక డిప్యూటీ సీఎం

▸▸ ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో ఏకాభిప్రాయానికి రాని రాష్ట్రాలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'జాతీయ నదుల అనుసంధాన పథకంపై ఏకాభిప్రాయం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. నదీజలాల వాటా, అలైన్‌మెంట్‌లపై ఏకాభిప్రాయం సాధ్యంకాని పరిస్థితుల్లో త్వరలోనే ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. గంగా-కావేరీ(గోదావరి కూడా) నదుల అనుసంధాన పథకంపై మంగళవారం ఢిల్లీలో సీఆర్ పాటిల్ అధ్యక్షతన జాతీయ నదీజలాల అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశం జరిగింది. మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ అధికారులు హాజరయ్యారు. దేశీయంగా నదీ జలాల ఆవశ్యకత చాలా ఉందని, గ్రామీణ ప్రాంతాలకు సాగు, తాగు నీటిని అందించాలని ప్రధాని మోదీ ప్రత్యేక లక్ష్యం నిర్దేశించుకున్నారని, అందుకే గంగా-కావేరీ నదుల అనుసంధాన పథకానికి మొగ్గు చూపారని తెలిపారు. నదుల అనుసంధానంపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయాన్ని తీసుకురావాలన్నదే లక్ష్యమని వెల్లడించారు. ఇప్పటికే నదుల అనుసంధానంపై సమగ్ర నివేదిక తయారు చేశామని చెప్పారు. దీనిపై అధ్యయనం చేసి అభిప్రాయాలను వెల్లడించాలని రాష్ట్రాలను కోరామన్నారు. రాష్ట్రాల నుంచి ఇప్పటిదాకా ఏకాభిప్రాయం సాధ్యం కాలేదని పాటిల్ వివరించారు. త్వరలోనే నదుల అనుసంధాన పథకం లబ్ధిదారు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రధానంగా గంగా-కావేరీ అనుసంధాన పథకంలో భాగమైన.. గోదావరి-కావేరి నదుల అనుసంధాన పథకంపై తెలంగాణ జోక్యం చేసుకుంది. ఇచ్చంపల్లి నుంచి కావేరి అనుసంధాన పథకం డిజైన్‌ను తాము సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నట్లు పేర్కొంది. అయితే, తమకు గోదావరి జలాల్లో 50 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేసింది. తమకు అనుగుణంగా ఆయకట్టు మార్పులు చేసుకునేందుకు స్వేచ్ఛ ఇవ్వాలని ప్రతిపాదించింది. అదేవిధంగా రెండు రిజర్వాయర్లు నిర్మించుకునేందుకు ఆమోదం తెలపాలని తెలంగాణ అధికారులు కోరారు. ట్రైబ్యునళ్లలో విచారణ జరుగుతున్నందున ప్రాజెక్టుల వారీ కేటాయింపులపై స్పష్టత వచ్చేంత వరకు ఈ ప్రతిపాదనలు అమలుకాకుండా ఆపాలని విజ్ఞప్తి చేసింది. దీంతో జలాల వాటాలపై ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని పాటిల్ స్పష్టం చేశారు.

బనకచర్లతోనే బాగు: ఏపీ

తెలంగాణ అధికారుల అభిప్రాయంతో ఏపీ అధికారులు ఏకీభవించలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ద్వారా గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని చేపడితే ఖర్చు తగ్గడమే కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలూ తగ్గుతాయని ఏపీ తరఫున జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సీఈ సుగుణాకరరావు వివరించారు. పెన్నా-కావేరి నదుల అనుసంధానానికి కూడా పోలవరం-బనకచర్ల ఉపయోగపడుతుందన్నారు. ఇచ్చంపల్లి నుంచి కావేరీ అనుసంధానం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇచ్చంపల్లి వద్ద నీటి నిల్వలు లేవని వెల్లడించారు. ఎన్‌డబ్ల్యూడీఏ చెబుతున్నట్లుగా ఛత్తీస్‌గఢ్ వాడుకోని 147 టీఎంసీల గోదావరి జలాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. ఒకవైపు ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చంటూ ఛత్తీస్‌గఢ్‌కు ఎన్‌డబ్ల్యూడీఏ ఆమోదముద్ర వేసిందని పేర్కొన్నారు. ఒకవైపు ఛత్తీస్‌గఢ్ ప్రాజెక్టులు కడతామంటుంటే.. గంగా జలలాను తరలిస్తామంటూ కేంద్రం చెబుతుండటం దిగువ రాష్ట్రాలకు నమ్మశక్యంగా లేదని ఏపీ స్పష్టం చేసింది. ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయంతో ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని వెల్లడించింది. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం, సోమశిల ద్వారా గోదావరి జలాలను తరలించి.. ఈ ప్రాజెక్టులలో నీటిని నిల్వ చేసుకునేందుకు ఉపయోగించుకుంటామంటే అసలు అంగీకరించేది లేదని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. గోదావరి-కావేరి అనుసంధాన పథకంపై అభ్యంతరాలు లేకుండా ఉండాలంటే.. దిగువన ఉన్న పోలవరం-బనకచర్ల పథకం ద్వారా గోదావరి జలాలను కావేరికి తరలించడమే ఉత్తమమని వెల్లడించింది. ఈ సూచనతో ఎన్‌డబ్ల్యూడీఏ సానుకూలంగా స్పందించింది. కానీ, తుది నిర్ణయం తీసుకోలేదు. గోదావరి నదిపై తెలంగాణ ఇష్టారీతిన అనధికార ప్రాజెక్టులు నిర్మించిందని.. దానివల్ల ఇతర రాష్ట్రాలకు జలాల సమస్యలు తలెత్తుతున్నాయని ఏపీ పేర్కొంది.

35 టీఎంసీలు కేటాయించాలి: కర్ణాటక

కావేరీ అనుసంధాన పథకంలో తమకు 25 టీఎంసీలనే కేటాయించడంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం 35 టీఎంసీలైనా ఇవ్వాలని కోరారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అధికారులు తమకు కూడా జలాల వాటాను పెంచాలని కోరారు.

సామాన్యులపై భారం ఉండదు

▸▸ స్టేట్ హైవేలపై నిర్దిష్ట ప్రమాణాల మేరకు టోల్ గేట్లు

▸▸ టోల్ వసూళ్లపై మరింత కసరత్తు జరుగుతోంది

▸▸ ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ సూచనల మేరకే రాష్ట్రంలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ), హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో రహదారి ప్రాజెక్టులు చేపడుతున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ రెండు విధానాల పనుల్లో నిర్మించి, అభివృద్ధి చేసే స్టేట్ హైవేలపై నిర్దిష్ట ప్రమాణాల మేరకే టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సామాన్యులపై భారం పడకుండా టోల్ వసూలు చేస్తారని, దీనిపై కసరత్తు జరుగుతోందని వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల ఆటోలు, వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లు వంటివాటిపై ఆ టోల్ ఉండదని, కార్లు, రవాణా లారీలు, ఇతర భారీ వాహనాలపైనే టోల్ ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబుతో కలిసి మంగళవారం సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. హ్యామ్ కింద చేపట్టే రోడ్లపై జగన్ పత్రిక కథనాలపై మంత్రి మండిపడ్డారు. రోడ్డెక్కితే బాదుడే అన్న కథనాలు అవాస్తవమని చెప్పారు. గత ప్రభుత్వ పాపాల వల్లే రాష్ట్రంలో రహదారులకు దుర్గతి పట్టిందని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో ఒక్క రోడ్డు వేయలేదని, ఉన్న రోడ్లకు నిర్వహణ లేదన్నారు. ఫలితంగా ఆర్అండ్‌బీపై ఇప్పుడు భారం పడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20,104 కి.మీ. రహదారుల నిర్వహణ చేపట్టామని, గుంతలు పూడ్చేందుకు రూ.3,342 కోట్లు వ్యయం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గుంతలు పూడ్చేందుకు రూ.860 కోట్లు వ్యయం చేశామన్నారు. ఇటీవల తుఫానుల వల్ల దెబ్బతిన్న రోడ్లపై గుంతలను జనవరి నాటికి, నిర్వహణ పనులను మార్చి నాటికి పూర్తిచేస్తామన్నారు.

పరిస్థితులు బట్టి పాలసీలో మార్పు: కృష్ణబాబు

హ్యామ్‌లో చేపట్టే రహదారి ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం ఉంటుందని కృష్ణబాబు చెప్పారు. ప్రభుత్వ వాటాలో కేంద్రానికి 20 లేదా 30 శాతం ఉంటుందని, మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. కాంట్రాక్టర్ 60 శాతం వాటా ప్రభుత్వం 15 వార్షిక ఇన్‌స్టాల్‌మెంట్ల కింద చెల్లిస్తుందని వివరించారు. రాష్ట్ర హైవేలపై టోల్ వసూలు చేయాలన్న పాలసీ గత ప్రభుత్వ హయాంలో 2022లోనే వచ్చిందని చెప్పారు. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా పాలసీలో ఏ మార్పులు తీసుకురావాలో ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. హ్యామ్‌లో తొలి దశలో 1,500 కి.మీ. రహదారి నిర్మాణం ఉంటుందన్నారు. ఇందులో సగటున ఒక్కో కి.మీ. నిర్మాణం కోసం రూ. 5 కోట్లమేర ఖర్చు అవుతుందని చెప్పారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జనవరి 1 నుంచి 30 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలపై జీఎస్టీ భారం తగ్గినందున, ఆ మేరకు హ్యామ్ ప్రాజెక్టులకు రహదారి భద్రత కింద 10 శాతం సుంకం వసూలు చేయాలని ప్రతిపాదించినట్లుగా కృష్ణబాబు అంగీకరించారు. అయితే దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు.

రోడ్డుపై నడిపిస్తూ స్టేషన్‌కు..

(మొదటి పేజీ తరువాయి)



అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలో రప్పా రప్పా బ్యాచ్‌ను నడిపించి తీసుకువెళుతున్న పోలీసులు

వీరంగం సృష్టించారు. బాణసంచా కాలుస్తూ హంగామా చేశారు. టపాసుల మోతకు తీవ్రంగా ఇబ్బందిపడిన గర్భిణి సంధ్యారాణి.. తనకు ఇబ్బందిగా ఉందని, పక్కకు వెళ్లి కాల్చుకోవాలని కోరారు. దీంతో కోపంతో ఊగిపోయిన అజయ్ దేవ్.. ఆమె గొంతు నులిమి, కడుపుపై కాలితో తన్నాడు. దీంతో బాధితురాలు ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అజయ్ దేవ్, అతని తండ్రి అంజనప్పపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అజయ్‌దేవ్‌ను అదుపులోకి తీసుకోగా అంజనప్ప పరారీలో ఉన్నాడు. నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవనే సందేశం ఇచ్చేందుకే అజయ్‌ను రోడ్డుపై నడిపించామని కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రంలో మూగ జీవాలను బలిచ్చి... జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేసిన వారిలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు బోయ రుద్ర, ఉప్పర రాజు, మాళాపురం ఇంద్ర, గంగాధర, సంతోశ్‌లను పట్టణంలోని ప్రధాన వీధుల్లో నడిపించుకుంటూ తీసుకెళ్లి పోలీసు జీపు ఎక్కించారు. అనంతరం ఉరవకొండ కోర్టులో హాజరుపరిచారు.

ఫ్లెక్సీ షాపు సీజ్.. యజమాని అరెస్టు

'2029 ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ 88 దాటగానే కూటమి నేతల తలలు గంగమ్మ జాతరలో మేకపోతును నరికినట్టు రప్పా.. రప్పా నరుకుతాం' అంటూ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం రామసింగవరంలో వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. దీంతో పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఫ్లెక్సీని ముద్రించిన రాయల్ ఫ్లెక్సీ షాపు యజమానిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 21న ఏలూరు జిల్లా పడమటిపాలెంలో మహిళపై దాడిచేసిన వైసీపీ కార్యకర్త సిరివెల్ల బాలుపైనా కేసు నమోదు చేశారు.

జగన్ ఫ్లెక్సీలు తొలగిస్తున్నారని.. టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై వైసీపీ కౌన్సిలర్ భర్త దాడి

తెనాలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడంలో చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగిపై వైసీపీ కైన్సిలర్ భర్త దాడికి పాల్పడ్డాడు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 21న జగన్ పుట్టినరోజు సందర్భంగా వైసీపీ నాయకులు తెనాలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం వాటిని తొలగిస్తుండగా 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత భర్త శ్రీను వైసీపీ నాయకులతో కలిసి సిబ్బందిని అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో టౌన్ ప్లానింగ్ ఉద్యోగి వెంకట్రామయ్యపై శ్రీను దాడి చేశాడు. విధులను అడ్డుకోవడమే కాకుండా దాడి చేయడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కమిషనర్ రామఅప్పలనాయుడికి ఫిర్యాదు చేశారు. దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



టీడీపీ ప్రధాన కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

కొబ్బరి రైతుల ఆదాయం పెంచుతాం

▸▸ ఉత్పత్తులకు అదనపు విలువ జోడింపుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా చర్యలు

▸▸ కోనసీమ జిల్లాలో పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఉత్పత్తులకు అదనపు విలువను జోడించి కొబ్బరి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. కొబ్బరి పరిశ్రమ అభివృద్ధిపై మంగళవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కొబ్బరి పంట అధికంగా ఉన్న డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని తూర్పుపాలెం, అమలాపురం నియోజకవర్గంలోని మామిడికుదురు మండలం ఉప్పలగుప్తం, పెదపట్నం లంకల్లో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసి, కొబ్బరి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాంతాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఇంక్యుబేషన్ సెంటర్, కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సిద్ధం చేశామని వివరించారు. వీటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోను ఆదేశించారు. కొబ్బరి పొడి, నూనె, పాలు వంటి కొబ్బరి ఆధారిత ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడంతో పాటు, వాటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజోలు నియోజకవర్గంలో 25 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు ఉందని, ఇక్కడ ఏటా 30-40 కోట్ల కొబ్బరి కాయల ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. కోనసీమ జిల్లాలో కొబ్బరి ప్రాసెసింగ్ సౌకర్యాలు లేకపోవడంతో రైతులు తమ కొబ్బరి కాయల తొక్కలు తీసి, ఎండు కొబ్బరి కాయలను తమిళనాడు, కేరళ, కర్ణాటక మార్కెట్లకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగానే కొబ్బరికి అదనపు విలువను జోడించేందుకు అవసరమైన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోనసీమ జిల్లా కలెక్టరును మంత్రి ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లాలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు 10 ఎకరాల భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముందుకు వచ్చారని, ఇక్కడ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించి నివేదిక ఇవ్వాలని కలెక్టరును కోరారు.

ఫిట్‌నెస్ ఫీజుల పెంపునకు బ్రేక్

▸▸ లారీ ఓనర్లకు ఊరట.. కేంద్రం స్పష్టత ఇచ్చాకే నిర్ణయం

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ మంజూరు, రెన్యూవల్ ఫీజుల పెంపు నిర్ణయానికి తాత్కాలికంగా ప్రభుత్వం బ్రేకులు వేసింది. కేంద్ర ప్రభుత్వం నవంబరు 11న రవాణా వాహనాల వయసు ఆధారంగా ఫిట్‌నెస్ ఫీజులు పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేసింది. పదిహేనేళ్ల పైబడిన లారీకి ఏకంగా రూ.36 వేలు పెరగడంతో లారీ యజమానుల నుంచి నిరసన వ్యక్తమైంది. లారీలు ఆపేస్తామని అసోసియేషన్ ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే చర్చలు జరిపింది. ప్రభుత్వ హామీ మేరకు లారీ యజమానులు వాహనాలు ఆపకుండా నడపడంతో తాజాగా రాష్ట్ర రవాణా శాఖ పెంపు నిర్ణయాన్ని తాత్కాలికంగా పక్కన బెడుతూ ఉత్తర్వులిచ్చింది. కేంద్రం నుంచి పూర్తి స్థాయి స్పష్టత రావడంతో పాటు పొరుగు రాష్ట్రాల్లో నిర్ణయాలపై సమీక్షించి సముచిత నిర్ణయం తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయం పట్ల లారీ యజమానుల సంఘం కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు.

ఇళ్లల్లోనూ నోట్ల కట్టలు!

సబ్‌రిజిస్ట్రార్లు, సిబ్బంది నివాసాల్లో ఏసీబీ సోదాలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వరుస దాడులు నిర్వహిస్తోంది. నవంబరు మొదటి వారంలో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు చేపట్టి పలు అక్రమాలు, ఉల్లంఘనలు గుర్తించిన ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు చేపట్టారు. గతంలో జరిపిన దాడుల్లో లభించిన ఆధారాల మేరకు అనుమానం ఉన్న సబ్‌రిజిస్ట్రార్ల నివాసాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం, విజయనగరం, అనంతపురం, ఎన్టీఆర్ జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై 4 కేసులు నమోదు చేసిన ఏబీసీ... అవినీతికి కేంద్ర బిందువుగా నిలుస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించింది.

- విశాఖ జగదాంబ సెంటర్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణలు, తనిఖీల్లో లభించిన ఆధారాల మేరకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ మోహనరావు నివాసంతో పాటు సిబ్బంది ఇళ్లలో ఉదయం నుంచి అధికారులు సోదాలు నిర్వహించారు. రామ్‌నగర్ శారదా టవర్స్‌లోని మోహన్‌రావు నివాసంలో ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించిన పత్రాలు గుర్తించినట్టు అధికారులు ప్రకటించారు. నగదు, బంగారు ఆభరణాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ సుధారాణి, అటెండర్ ఆనంద్‌కుమార్ ఇళ్లలో చెరో రూ.కోటి విలువైన ఆస్తులు గుర్తించామని, వీటిపై విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.
- విజయనగరం ఎస్‌వీఎన్ నగర్‌లో ఉంటున్న భోగాపురం సబ్ రిజిస్ట్రార్ పాండిలపల్లి రామకృష్ణ ఇంట్లో జరిపిన తనిఖీల్లో పలు కీలక డాక్యుమెంట్లు, బ్యాంకు లావాదేవీల పత్రాలతో పాటు నివాసంలో రూ.30,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్న భోగాపురంలోని ఆలేటి కనకరాజు నివాసం నుంచి రూ18.10 లక్షల నగదు, 550 గ్రాముల బంగారు, 937 గ్రాముల వెండి ఆభరణాలు, కీలక పత్రాలు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ నివాసంలో రూ.1.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ అశోక్, సీనియర్ అసిస్టెంట్ అనంతలక్ష్మి నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు.
- అనంతపురం జిల్లా ఏసీబీ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని రాజహంస గోల్డెన్ హోమ్స్‌లో ఉంటున్న చిలమత్తూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ బాబు ఇంట్లో తనిఖీలు చేశారు. చిలమత్తూరులో ఉంటున్న ప్రసాద్‌బాబు సహాయకుడు, ప్రైవేటు వ్యక్తి సోమశేఖర్ ఇంట్లో మరో బృందం తనిఖీలు చేసింది. వీరి ఇళ్లలో పలు డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.
- ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ షేక్ మహమ్మద్‌కు చెందిన భవానీపురంలోని ఆయన ఇంట్లో, జూనియర్ అసిస్టెంట్ డి.పద్మకు చెందిన కొండపల్లిలోని ఆమె నివాసంలో ఏకకాలంలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించినట్లు తెలిసింది. దాడుల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా డి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్‌గా సాయిరాజును నియమించారు. మిగతాచోట్ల జరిగిన సోదాల్లో లభించిన ఆధారాల మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి అక్రమార్కులపై చర్యలకు ఏసీబీ ప్రతిపాదించనుందని సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ లంచం డిమాండ్ చేసినా టోల్ ఫ్రీ నం.1064, లేదా 9440440057కు సమాచారం అందించాలని డీజీ అతుల్ సింగ్ సూచించారు.



విజయనగరం జిల్లా భోగాపురంలోని ఆలేటి కనకరాజు నివాసంలో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు, వెండి సామగ్రి, ఆస్తి పత్రాలు



లోక్‌భవన్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు

క్రీస్తు జీవితం స్ఫూర్తిదాయకం : గవర్నర్

- లోక్‌భవన్‌లో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ అనేది దయ, ప్రేమను బోధించి, ఏసుక్రీస్తును స్మరించుకునే మంచి సమయమని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. మంగళవారం లోక్‌భవన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. సద్గుణాలతో జీవితాన్ని కొనసాగించాలని ఆయన అందరికీ తెలియజేశారన్నారు. తొలుత షామ్‌రాక్ ఇంటర్నేషన్ స్కూల్ విద్యార్థులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. అనంతరం గవర్నర్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గవర్నర్ జాయింట్ సెక్రటరీ పీఎస్ సూర్యప్రకాశ్, లోక్‌భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టులో ఘనంగా సెమీ క్రిస్మస్



హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ హాలులో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ఫ్లెక్సీల ఏర్పాటుపై హైకోర్టులో పిల్

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు అభ్యర్థులు విజయవాడ సిటీ సివిల్ కోర్టు పరిసరాల్లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, వీటిపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొంటూ గుంటూరుకు చెందిన న్యాయవాది మస్తాన్ వలీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తన పిల్‌లో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన న్యాయవాదులకు నోటీసులు జారీ చేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో వినియోగించాల్సిన పోస్టర్ల పరిమాణం, ప్రచార స్థలాలు వంటి అంశాల పై కఠిన మార్గదర్శకాలు రూపొందించేలా ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్‌ను ఆదేశించాలని కోరారు.

వరాహస్వామినీ వదల్లేదు!

విమాన గోపురం బంగారు తాపడంలో చేతివాటం

- 102 గ్రా. అపహరించడానికి యత్నించినట్లు గుర్తింపు
- 2022 నాటి చోరీని దాచిపెట్టిన అప్పటి టీటీడీ అధికారులు
- గోవిందరాజస్వామి ఆలయ పనుల్లోనూ గోల్‌మాల్?
- ఈవో ఏకే సింఘాల్‌కు ఫిర్యాదులు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

కల్తీ నెయ్యి, పరకామణిలో చోరీ, పట్టువస్త్రాల కొనుగోళ్లలో అవినీతి.. ఇలా గత జగన్ ప్రభుత్వంలో తిరుమలలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తిరుమలలోని వరాహస్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనుల్లో చేతివాటం చూపించారు. పనులు జరిగే సమయంలో కాంట్రాక్టర్, జ్యువెలరీ అప్రైజర్ కుమ్మక్కై 102 గ్రాముల బంగారాన్ని లిక్విడ్ రూపంలో అపహరించేందుకు యత్నించినట్టు అప్పటి విజిలెన్స్ విచారణలో బయటపడింది. తిరుమలలోని వరాహస్వామి ఆలయ విమానంపై 2020 డిసెంబరులో బంగారు తాపడం పనులను టీటీడీ చేపట్టింది. ఏడాదిపాటు ఈ పనులు జరిగాయి. రాగి రేకులపై బంగారు పూత పూసే పనిని తమిళనాడుకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇందుకోసం 38 కిలోల 360 గ్రాముల 700 మిల్లీగ్రాముల 24 క్యారెట్ల బంగారాన్ని టీటీడీ అందజేసింది. తిరుపతి జ్యువెలరీ నుంచి తిరుమల పేష్కార్ కార్యాలయానికి ఏడు విడతల్లో ఈ బంగారాన్ని పంపారు. పనులు పూర్తయిన తర్వాత రికార్డులో 38 కిలోల 366 గ్రాముల 700 మిల్లీ గ్రాముల బంగారాన్ని వినియోగించినట్టు చూపడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. సాధారణంగా బంగారు పూత పనుల్లో కొంత వ్యర్థమై తగ్గుతుంది. కానీ ఇక్కడ మాత్రం పెరిగింది. ఇదే సమయంలో బంగారాన్ని ఆమ్లంలో కరిగించి తరలిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విచారణ మొదలైంది. స్ట్రాంగ్ రూంలో పాదరసం, శుద్ధికి ఉపయోగించే ఆమ్ల ద్రావణం నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఈ ద్రావణాలను నిపుణుల సాయంతో పరీక్షించగా వీటిలో బంగారం కలగలిసి ఉన్నట్టు తేలింది.

పాదరసంలో బంగారం

2022 జూన్ 30న చేసిన పరీక్షలో పాదరసంలో 45.700గ్రాముల బంగారాన్ని గుర్తించారు. రెండోసారి మరికొంత పాదరసాన్ని పరీక్షించగా 15.900 గ్రాముల బంగారం బయటపడింది. అదే ఏడాది ఆగస్టు 1న ఆమ్ల ద్రావణం నుంచి మరో 28.900 గ్రాములు వెలికి తీశారు. ఇలా 90.500 గ్రాముల లెక్కల్లో లేని బంగారాన్ని వెలికితీశారు. రికార్డుల్లో అదనంగా చూపినదానితో కలిపి మొత్తం 102 గ్రాముల అదనపు బంగారాన్ని గుర్తించారు. జ్యువెలరీ అప్రైజర్, కాంట్రాక్టర్ మధ్య జరిగిన కొన్ని ఫోన్ సంభాషణలను టీటీడీ విజిలెన్స్ విభాగం పరిశీలించింది. తాపడం పనుల్లో కొట్టేసే బంగారంలో అప్రైజర్ 10 శాతం కమీషన్ కోరినట్టు అందులో ఉంది. 2022 ఆగస్టులో విజిలెన్స్ విచారణలో ఇదంతా బయటపడింది. నాటి వైసీపీ ప్రభుత్వంలోని బోర్డు, టీటీడీ అధికారులు ఈ ఘటనకు కారణమైన వ్యక్తులపై చర్యలుచేపట్టినా, విషయాన్ని బయటకు పొక్కకుండా దాచిపెట్టారు.

'గోవిందరాజస్వామి' పనుల్లోనూ...

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమానం బంగారు తాపడం పనుల్లోనూ భారీ ఎత్తున బంగారాన్ని కొట్టేశారంటూ తాజాగా టీటీడీ ఈవోకు ఫిర్యాదులు అందాయి. వాస్తవానికి దీనిపై అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. 'గోవిందరాజస్వామి ఆలయ విమాన పనులను తీసుకున్న కాంట్రాక్టర్... వాటిని ఓ ముస్లిం కాంట్రాక్టర్‌కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చారని, నాణ్యత లేని బంగారు పెయింట్, ఎనీల్ ఉపయోగించి 30 నుంచి 50 కేజీల బంగారం మాయం చేశారని అరోపణలు వచ్చాయి. 2023లో ఈ అంశంపై కొన్ని హిందూ సంఘాలు ప్రెస్‌మీట్లు పెట్టి ధర్నాలు చేశాయి. దీనిపై విజిలెన్స్ అప్పట్లోనే విచారణ చేపట్టింది. సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన తర్వాత ముస్లింలు పనులు చేశారనడానికి ఆధారాలు లేవని విజిలెన్స్ నివేదికలో స్పష్టం చేసింది. నిరంతర భద్రత ఉన్నందున బంగారం దొంగతనం జరిగే అవకాశమే లేదని పేర్కొంది. ఏఈవో జ్యువెలరీ, అప్రైజర్, డీఈఈ, ఈఈ పర్యవేక్షణలోనే పనులు సాగాయని తెలిపింది. అయితే ఇదే అంశంపై తాజాగా టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో జగన్ జమానాలో జరిగిన ఈ అంశంపై కూడా విజిలెన్స్ విభాగం మరోసారి పరిశీలన చేయనున్నట్టు తెలిసింది.



వరాహస్వామి ఆలయ విమాన గోపురం

కేజీల కొద్దీ బంగారం దోచేశారు: కిరణ్ రాయల్

తిరుపతి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో గోవిందరాజస్వామి ఆలయ గోపురంపై బంగారు తాపడం పనుల్లో కేజీలకొద్దీ బంగారం దోచేశారని జనసేననేత కిరణ్ రాయల్ ఆరోపించారు. గోపురానికి 9 లేయర్ల తాపడం చేయకుండా 2లేయర్లతో కానిచ్చేశారని చెప్పారు. గోపురంపై ఉన్న 32 విగ్రహాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ కుంభకోణంలో అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాత్ర ఉందని ఆరోపించారు. త్వరలోనే టీటీడీ సీవీఎస్‌వోను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే తిరుమల విగ్రహాలను కూడా మార్చేసేవారన్నారు.

ఐపీఎస్ అమ్మిరెడ్డికి ప్రివిలేజ్ సెగ!

- శాసనమండలి కమిటీ ఎదుట హాజరు
- పొంతన లేని సమాధానాలతో నీళ్లు నమిలిన అమ్మిరెడ్డి
- జనవరి 5న మరోసారి విచారణకు రావాలని ఆదేశం

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డి శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ ఎదుట హాజరయ్యారు. కమిటీ సమావేశం మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్ బీటీ నాయుడు నేతృత్వంలోని కమిటీ సుమారు గంటన్నరపాటు అమ్మిరెడ్డిని విచారించింది. ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో ఏఐజీగా పనిచేస్తున్న అమ్మిరెడ్డి గతంలో గుంటూరు ఎస్పీగా పనిచేసిన సమయంలో అప్పటి ఎమ్మెల్సీ లోకేశ్ చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ... 'ఎస్సీ కులాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటాం' అంటూ చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ లోకేశ్ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశారు. దీనిపై అమ్మిరెడ్డికి నోటీసులు ఇచ్చి పిలిపించిన కమిటీ.. లోకేశ్ ట్వీట్‌లో ఎక్కడా కుల ప్రస్తావన లేకపోయినా మీరు ఎందుకు ఎస్సీ కులాన్ని ప్రస్తావించారని కమిటీ ప్రశ్నించింది. అమ్మిరెడ్డి నీళ్లు నమిలారు. 'మీరు ఇచ్చిన సమాధానంలో శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీకి ఎలాంటి అధికారాలు లేవని ఎలా పేర్కొంటారు.?' అన్న మరో ప్రశ్నకు ఆయన స్పందిస్తూ... 'అది అప్పటి డీజీపీ కార్యాలయ న్యాయ సలహాదారుగా ఉన్న వ్యక్తి ఇచ్చారు' అని చెప్పారు. అమ్మిరెడ్డితోపాటు వచ్చిన ఆ వ్యక్తిని కమిటీ ప్రశ్నించింది. దానికి ఆయన... 'అప్పట్లో ఏం రాశానో నాకు గుర్తు లేదు' అని పేర్కొన్నారు. కమిటీ అడిగిన పలు ప్రశ్నలకు అమ్మిరెడ్డి పరస్పర విరుద్ధంగా సమాధానాలు ఇచ్చారు. గతంలో డీజీపీకి లీగల్ అడ్వయిజర్‌గా పనిచేసిన వ్యక్తి ప్రస్తుతం మరో శాఖకు పనిచేస్తున్నారు. ప్రివిలేజెస్ కమిటీ అధికారాలను ప్రశ్నించినందుకుగాను ఆయన్ను ఆ పదవి నుంచి తొలగించాలని కోరేందుకు ప్రివిలేజెస్ కమిటీ సిద్ధమవుతోంది. రాజ్యాంగపరంగా ఆర్టికల్ 194 ప్రకారం రాజ్యసభకు ఏ విధంగా హక్కులు ఉంటాయో రాష్ట్రంలో ఉన్న శాసనమండలికి కూడా అవే అధికారాలు ఉంటాయని కమిటీ స్పష్టం చేసింది. జనవరి 5న మరో దఫా విచారణకు హాజరు కావాలని అమ్మిరెడ్డిని ఆదేశించింది.

కమిటీ ముందుకు మరో ఇద్దరు అధికారులు

మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి కమిటీ ఎదుట హాజరైన వివరణ ఇచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ వెంకటమరణయ్య విచారణకు హాజరయ్యారు. అధికారుల నుంచి సేకరించిన వివరణలు, ఆధారాలను పరిశీలించిన అనంతరం కమిటీ తదుపరి నిర్ణయం తీసుకోనుంది. ప్రజాప్రతినిధుల గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా కమిటీ స్పష్టం చేసింది. సమావేశంలో కమిటీ సభ్యులు జయేంద్ర భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పండుల రవీంద్రబాబు, తలశిల రఘురామ్, రాజగొల్ల రమేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను గౌరవించాలి

- మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ బీటీ నాయుడు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్షమైనా, పాలకపక్షమైనా... శాసనసభ, మండలి సభ్యుల హక్కుల(ప్రివిలేజ్) విషయంలో తప్పు చేస్తే... ఎవరినైనా కమిటీ పిలిపించి విచారిస్తుంది' అని మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ బీటీ నాయుడు స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారులను భయపెట్టాలనేది కమిటీ ఉద్దేశం కాదని పేర్కొన్నారు. మంగళవారం వెలగపూడి అసెంబ్లీ హాలు-1లో ప్రివిలేజ్ కమిటీ సమావేశం జరిగింది. అధికారుల విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రివిలేజ్ కమిటీ ముందు శాసనమండలికి సంబంధించి 28 కేసులు పెండింగ్ ఉన్నాయి. ఇందులో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ ఇచ్చిన ప్రివిలేజ్ పిటిషన్లపై విచారించాం. లోకేశ్ ప్రివిలేజ్ విషయంలో ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డి, ఛైర్మన్ విషయంలో భీమవరం మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్సీ విషయంలో ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌ను పిలిపించి వివరణ కోరాం. మంత్రి లోకేశ్ ప్రివిలేజ్ విషయంలో ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డి సరైన సమాధానం చెప్పలేకపోయారు. విచారణ ఎదుర్కొన్న పలువురు అధికారులు తప్పుని ఒప్పుకుని, ఇంకోసారి ఇలాంటి తప్పు జరగకుండా చూసుకుంటామన్నారు. వీరి వివరణలను పరిశీలించి, జనవరి 5న ఈ మూడు కేసులతో పాటు మిగతా కేసులనూ విచారించాలని నిర్ణయించాం.' అని తెలిపారు.

కొండపై కల్తీకి కట్టడి

(మొదటి పేజీ తరువాయి)

నెయ్యి సహా దినుసుల నాణ్యత గత ఏడాదిన్నర కాలంలో పెరిగింది. ప్రసాదాలు బాగున్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెయ్యి నాణ్యతపై ప్రస్తుతం ఎలాంటి ఫిర్యాదులూ రావడం లేదు. గత ఏడాదిన్నర కాలంగా ఒక్క నెయ్యి ట్యాంకర్ కూడా వెనక్కి తిప్పి పంపే అవసరం రాలేదు. అలాగే ఇతర సరుకుల నాణ్యత విషయంలో కూడా రాజీ పడడం లేదు. గతేడాది జూలై నుంచి ఈ నెల మొదటి వారం వరకు కర్ణాటకకు చెందిన నందిని డెయిరీ పది లక్షల కిలోల నెయ్యి టీటీడీకి సరఫరా చేసింది. ఈ ఏడాదన్నర వ్యవధిలోనే వేర్వేరు టెండర్లలో పాల్గొన్న ఈ డెయిరీ కిలో రూ.498 నుంచి రూ.716 వరకూ వేర్వేరు ధరలతో నెయ్యిని టీటీడీకి సరఫరా చేసింది. నందిని డెయిరీ టెండరు గడువు ముగిసిన నేపథ్యంలో ప్రస్తుతం గుంటూరు జిల్లా సంగం డెయిరీ 10 లక్షల కిలోలు, మహారాష్ట్రలోని పుణెకు చెందిన ఇందాపూర్ డెయిరీ 6.50 లక్షల కిలోలు, తిరుపతికే చెందిన మదర్ డెయిరీ 3.50 లక్షల కిలోలు చొప్పున టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి. ఈ డెయిరీలు కిలో రూ.655 ధరతో నెయ్యి చేరవేస్తున్నాయి. నాణ్యత లేదనే కారణంగా ఏడాదిన్నరగా ఒక్క ట్యాంకరు నెయ్యి కూడా టీటీడీ నుంచి వెనక్కి వెళ్లలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ పాలకమండళ్లు ఆమోదించిన ధరలతో పోలిస్తే ప్రస్తుతం టీటీడీ కొనుగోలు చేస్తున్న నెయ్యి ధరలు రెట్టింపు ఉన్నాయి. నాణ్యత విషయంలో రాజీ పడకపోవడమే ఇందుకు కారణమంటున్నారు. ఈ నెయ్యి వినియోగించి తయారు చేసే శ్రీవారి ప్రసాదాలపై భక్తుల నుంచీ ఫిర్యాదులు లేవు.

తేడా కొడితే..

టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం ఏటా రూ.600 కోట్ల విలువైన 177 రకాల సరుకులు, ఇతర వస్తువులు (ఆహార సంబంధమైనవి) కొనుగోలు చేస్తోంది. అందులో రోజువారీ వినియోగం చూస్తే నెయ్యి 15 వేల కిలోలు, జీడిపప్పు 3,500 కిలోలు, చక్కెర 40 వేల కిలోలు, బియ్యం 20 వేల కిలోలు, బెల్లం రెండు వేల కిలోలు, ఎండు ద్రాక్ష 1,500 కిలోలు, యాలకులు 500 కిలోలు ఉన్నాయి. శ్రీవారి ప్రసాదాలలో ఎక్కువగా వినియోగించే జీడిపప్పు తరచుగా నాసిరకం వస్తున్నట్టు టీటీడీ అధికారులు గుర్తించారు. ప్రతి పది లోడ్‌లలో రెండు నుంచి మూడు లోడ్‌ల సరుకు నాణ్యత లేకుండా వస్తున్నాయని గుర్తించారు. ఇలాంటి లోడ్‌లను నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నారు. గతేడాది నుంచి ఇప్పటివరకూ 18 నెలల కాలంలో 25 లారీల లోడ్‌ల జీడిపప్పును తిరస్కరించినట్టు సమాచారం. ఇదే వ్యవధిలో పది లోడ్‌ల ఎండు ద్రాక్ష, ఏడు లోడ్‌ల చింతపండు, పది లోడ్‌ల కంది పప్పు, పది లోడ్‌ల వరకూ ఎండుమిర్చిలను వెనక్కి పంపినట్టు సమాచారం.

నాణ్యత లేకుంటే దాతలు ఇచ్చినా తిరస్కరణ

టీటీడీకి అవసరమైన సరుకులను ఎంతోమంది భక్తులు విరాళంగా అందజేస్తుంటారు. అందులో కూరగాయలు మొదలుకుని నిత్యావసర సరుకుల వరకూ ఉంటున్నాయి. శ్రీవారి అన్న ప్రసాదాలకు సంబంధించి తిరుపతిలోని టీటీడీ వేర్ హౌస్ ప్రాంగణానికి రోజూ భక్తులు వచ్చి తమకు తోచిన వస్తువులు ఇచ్చి వెళుతుంటారు. కొందరు మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా ఇలా చేస్తుంటారు. బియ్యం, చక్కెర, జీడిపప్పు, నెయ్యి, కందిపప్పు, చింతపండు వంటివి ఎక్కువగా ఇస్తున్నారు. అయితే వాటి శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపి నాణ్యత బాగుంటేనే స్వీకరిస్తున్నారు. టీటీడీ వేర్‌హౌస్ ప్రాంగణంలో నాలుగు గోదాములున్నాయి. మొదటి గోదాములో 60 రకాల సరుకులు, రెండో గోదాములో మరో 60 రకాల సరుకులు, మూడో గోదాములో 57 రకాల సరుకులు నిల్వ ఉంచుతున్నారు. మరొక దానిని సబ్ గోదాముగా అత్యవసరానికి వాడుతున్నారు. ఇక... తిరుమలలోని గోదామును నెయ్యి, చక్కెరల నిల్వకు మాత్రమే వినియోగిస్తున్నారు.

అదనపు సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల

మూడేళ్లపాటు పదవిలో.. కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)గా సీనియర్ న్యాయవాది, రాజ్యసభ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత కనకమేడల రవీంద్ర కుమార్ నియమితులయ్యారు. ఆయనతోపాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు దవీందర్ పాల్‌సింగ్, అనిల్ కౌశిక్‌లకు కూడా ఏఎస్‌జీలుగా అవకాశం లభించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురూ మూడేళ్లపాటు ఏఎస్‌జీలుగా కొనసాగుతారని పేర్కొంది. ప్రస్తుతం.. భారత అటార్నీ జనరల్‌గా వెంకటరమణి, సొలిసిటర్ జనరల్‌గా తుషార్ మెహతా ఉన్నారు. సుప్రీంకోర్టులో ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అత్యున్నత బాధ్యత అదనపు సొలిసిటర్ జనరల్‌దే కావడం విశేషం.

సివిల్ కోర్టు న్యాయవాది నుంచి..

కనకమేడల రవీంద్రకుమార్ 8, ఆగస్టు 1956న జన్మించారు. నాగార్జున యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ, అన్నామలై యూనివర్సిటీ నుంచి ఎంఎల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 1983లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. విజయవాడలో సీనియర్ న్యాయవాది కాటమనేని రవీంద్రరావు దగ్గర జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ తర్వాత ఐదేళ్లపాటు విజయవాడ సివిల్ కోర్టులో న్యాయవాద వృత్తిని కొనసాగించారు. 1994లో ఉమ్మడి ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఈ క్రమంలోనే.. కేంద్ర ప్రభుత్వం, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు, ఏపీ ట్రాన్స్‌కో సహా పలు సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. ప్రస్తుతం.. సుప్రీంకోర్టుతోపాటు ఏపీ, తెలంగాణ హైకోర్టుల్లోనూ సీనియర్ న్యాయవాదిగా రవీంద్ర కుమార్ ప్రాక్టీస్ చేస్తున్నారు.



లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ కమిటీలో..

కనకమేడల రవీంద్రకుమార్ 2018-24 వరకు టీడీపీ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన రాజ్యసభ ప్యానల్‌కు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే, ఆ ఆరేళ్ల కాలంలో అనేక పార్లమెంటరీ స్థాయీ సంఘాలు, కమిటీల్లో సభ్యుడిగా చేశారు. ప్రధానంగా 'లా అండ్ జస్టిస్' మంత్రిత్వ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, చట్టం, న్యా యం(పీపీజీ-లా) తదితర కమిటీల్లో సభ్యుడిగా పనిచేశారు.

డివైడరుకు జనసేన రంగులు



జగన్ హయాంలో అది గుడైనా, బడైనా ఆఖరికి ప్రభుత్వ కార్యాలయం అయినా వైసీపీ రంగు పడక తప్పేది కాదు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు వైసీపీ తీరును తప్పుపట్టేవారు. అయితే, ఇప్పుడు జనసేన కార్యకర్తలు అత్యుత్సాహంతో చేసిన పని మరోసారి నాటి వైసీపీ రంగుల గోలను గుర్తుకు తెచ్చింది. గుంటూరు రూరల్ మండలంలోని వెంగళాయపాలెంలో దివంగత నేత వంగవీటి రంగా విగ్రహాన్ని స్థానిక జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేశారు. రంగా తనయుడు వంగవీటి రాధా ఈ నెల 26 వ తేదీన ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రోడ్‌లోని డివైడర్‌కు మంగళవారం జనసేన రంగులు వేసి కార్యకర్తలు హడావుడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జనసేన కార్యకర్తల చర్యను నెటిజన్లతో పాటు గ్రామస్థులు కూడా తప్పుబడుతున్నారు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.